


ESTD: 1999

www.voodayam.com

# వుదయం

హైదరాబాద్ | 15-01-2026 గురువారం | సంపుటి : 26 | సంచిక : 306 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on




## రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ఖూనీ



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని ఎన్టీవీ కార్యాలయంలో పోలీసుల సోదాలను ఆయన ఖండించారు. ప్రశ్నించే హక్కు ఇస్తున్నామని చెప్పిన సీఎం... అధికారంలోకి వచ్చాక ఎమర్జెన్సీని తలపించేలా పాలనను చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఎన్టీవీ భుజంపై తుపాకీ పెట్టి రాష్ట్రంలోని మీడియా మొత్తాన్ని భయపెట్టే ప్రయత్నం చేస్తూ.. వికృతానందం పొందుతున్నారని ఆరోపించారు. అసలు అరెస్ట్ చేసిన జర్నలిస్టులేమైనా టెర్రరిస్టులా అని ప్రశ్నించిన హరీశ్ రావు.. ఈ రకమైన బ్లాక్మెయిల్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదని సూచించారు. నగర సీపీ సజ్జనార్.. పోలీస్ యూనిఫామ్ తీసేసి కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని సూచించారు. ఆయన తీరు అధికార పార్టీ కార్యకర్తలా ఉందని హరీష్ విమర్శించారు. గతంలో మంత్రి కొండా సురేఖ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినపుడు చట్టం ఏమైందని ఆయన నిలదీశారు. ఆ రోజు కూడా బాధితురాలు మహిళేననే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు.

మిగతా 2లో

## ఇరాన్ నిరసనల పర్వంలో తొలి ఉరిశిక్ష

**తెహ్రాన్ :** ఖమేనై వ్యతిరేక నిరసనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న 26 ఏళ్ల ఇరానియన్ ఎర్ఫాన్ సొల్తానీ ఆచూకీ కుటుంబానికి రోజులపాటు తెలియలేదు. కాగా, హఠాత్తుగా అయాతొల్లా ఆలీ ఖమేనీ ప్రభుత్వంలోని భద్రతా యంత్రాంగం నుంచి వారికి కబురు వచ్చింది. అది నేరారోపణల గురించో, కోర్టు తేదీ గురించో కాదు, సొల్తానీకి మరణ శిక్ష పడిందనే సమాచారం ఇచ్చేందుకు. అతనికి వీడ్కోలు పలికేందుకు వారికి 10 నిమిషాల సమయం ఇస్తున్నామని చెప్పేందుకు. ఖమేనై వ్యతిరేక నిరసనల సందర్భంగా జనవరి 8వ తేదీని అదుపులోకి తీసుకున్న 26 ఏళ్ల ఎర్ఫాన్ సొల్తానీని బుధవారం నాడు ఉరి తీయనున్నట్టు వార్తా పత్రికలు కొన్ని పేర్కొన్నాయి. నిరసనలలో పాల్గొనవద్దంటూ ఖమేనై ప్రభుత్వం చేసిన హెచ్చరికలను ఖాతరు చేయకుండా అందులో పాల్గొన్న ఎర్ఫాన్ ఉరితీత ఈ ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలతో సంబంధించిన శిక్షణలలో మొదటిది. అతడు మొహరెబె అంటే భగవంతుడి పట్ల శత్రుత్వం ప్రదర్శించాడన్న ఆరోపణతో ఈ శిక్షను అమలు చేస్తున్నారు. ఈ వార్తతో తీవ్రమైన భయాందోళనలకు లోనైన సొల్తానీ కుటుంబాన్ని ఎవరితో మాట్లాడవద్దని, అలా చేస్తే మరింతమంది కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని అధికారులు బెదిరించారు. అతడిని అరెస్టు చేసిన వారంలోగానే అతడిని ఉరితీయడమన్నది అంతర్జాతీయంగా ఆందోళనలను రేకెత్తించడమే కాదు, ఇరాన్ క్షేత్రస్థాయి మరణశిక్షల వరకూ వెళ్లే



మిగతా 2లో




## హిందీ చదువులతో బానిసలుగా ఉత్తరాది ఆడపిల్లలు



**వివాదం రేపిన దయానిధి మారన్**

**చెన్నై :** ఇంగ్లీష్ విద్యను నిరుత్సాహపరుస్తూ, విద్యార్థులను హిందీ మాత్రమే చదవమని ప్రోత్సహిస్తున్నారని, అలాంటి విధానాలు దక్షిణాది రాష్ట్రాలలో, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటానికి, వలసలు పెద్దగా లేకపోవడానికీ కారణమవుతున్నాయని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ తీవ్రంగా విమర్శించారు. ఒక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన మారన్, కొన్ని రాష్ట్రాల్లో విద్యార్థులు విద్యను అభ్యసించకుండా నిరుత్సాహపరుస్తున్నారని, హిందీపై మాత్రమే దృష్టి పెట్టాలని చెబుతున్నారని ఆరోపించారు. ఇంగ్లీషు చదవవద్దని, చదివితే నాశనం అయిపోతారని, మిమ్మల్ని బానిసలుగా ఉంచుతారని చెబుతున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు మరొక్కసారి బలవంతంగా హిందీ రుద్దడంపై చర్చల మంటలను ఎగదోసే అవకాశం ఉంది. ప్రజలు ఉత్తరాది రాష్ట్రాల నుండి దక్షిణాదికితరలి రావడానికి ఈ విద్యా పద్ధతులే కారణమని అంటూ, తమిళనాడు విద్యకి ఇచ్చే ప్రాధాన్యత దాని ఆర్థిక వృద్ధికి దారితీసిందని మారన్ వాదించారు. విద్యావంతులైన ప్రజలు ఉన్నందుకే ప్రపంచంలోని అగ్ర కంపెనీలు నేడు తమిళనాడుకు వస్తున్నాయని ఆయన అన్నారు.

విద్యను హిందీకి మాత్రమే పరిమితం చేయడం వల్ల ఇతర ప్రాంతాలలో నిరుద్యోగం పెరుగుతుందని, తమిళనాడులోని ద్రవిడ నమూనా బాలబాలికలు ఇద్దరికీ సమాన విద్యను ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో

## మమత బెనర్జీ పిటిషన్ కొట్టివేత



**కోల్‌కత :** కోల్‌కతాలో జరిగిన ఐ-ప్యాక్ దాడులకు సంబంధించిన కేసును విచారించిన కలకత్తా హైకోర్టు, రాజకీయ కన్సల్టెన్సీ సంస్థపై జనవరి 8న సోదాల సందర్భంగా దర్యాప్తు సంస్థ స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న డేటాకు రక్షణ కోరుతూ తృణమూల్ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. జనవరి 8న కన్సల్టెన్సీ సంస్థకు సంబంధించిన ప్రాంగణంలో నిర్వహించిన సోదాల్లో ఏమీ స్వాధీనం చేసుకోలేదని ఈడీ చేసిన స్పష్టమైన ప్రకటనను కోర్టు నమోదు చేసింది. ఈడీ ప్రకటనను అధికారికంగా రికార్డ్ చేసిన తర్వాత పార్టీ దరఖాస్తును పరిష్కరించవచ్చని తృణమూల్ తరపు న్యాయవాది వాదించిన తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. సోదాల సమయంలో తమ డేటా ఏదైనా స్వాధీనం చేసుకుంటే, దానికి రక్షణ కల్పించడం అనే ఒకే ఒక పరిమిత ఉపశమనం కోసం మాత్రమే తాము ఒత్తిడి చేస్తున్నట్లు తృణమూల్ కోర్టు ముందు స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై ఈడీ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది. ఈ కేసును జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని

మిగతా 2లో

## భరోసాలో భారీ మార్పులు

### వ్యవసాయం చేయని భూములకు రైతు భరోసా నో

- కొత్తగా పట్టాలు పొందిన 80 వేల మంది రైతులకు వర్తింపు
- అర్హుల గుర్తింపు కోసం కొత్త మార్గదర్శకాలు
- కౌలు రైతులకూ పెట్టుబడి సాయం
- మూడు రోజుల్లో కొత్త పట్టాదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- పారదర్శకత పాటించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు చెప్పింది. కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకంలో కీలక మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తోంది. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే కొత్త పట్టాదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ముగిసిన తర్వాత కొత్తగా పట్టాలు పొందిన సుమారు 80 వేల మంది రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణాధికారులను కలిసి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది.

**ప్రక్షాళన దిశగా పథకం..**

గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకంలో నిధులు పెద్ద ఎత్తున దారి మళ్లినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో విచారణ చేపట్టిన గత ప్రభుత్వం సాగుయోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకున్నది. తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత కూడా పలు చోట్ల సాగులోని భూములకూ నిధులు వెళ్లినట్లు మండల, జిల్లా స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో సమగ్ర విచారణ చేపట్టిన కాంగ్రెస్ సర్కార్.. గతంలో సాగు చేయని భూములకు, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా పొరపాటున నిధులు వెళ్లినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈసారి అలాంటి పొరపాట్లకు తావు లేకుండా కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే నిధులు ఇవ్వాలని నిర్ణయించింది. నిజమైన సాగుదారులను గుర్తించడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం తగ్గుతుందని.. ఆ నిధులను అర్హులైన పేద రైతులకు మళ్లించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. సాగు భూములను పక్కాగా గుర్తించేందుకు అగ్రికల్చర్ యూనివర్సిటీ సహకారంతో సాటిలైట్ సర్వేనూ నిర్వహిస్తున్నారు. అయితే కేవలం సాటిలైట్ డేటాపైనే ఆధారపడకుండా.. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల ధృవీకరణను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. రైతు భరోసా నిధుల విడుదలలో జరుగుతున్న ఆలస్యం వెనుక ఆర్థిక, పరిపాలన పరమైన కారణాలు ఉన్నాయి. ఈ విడతలో సుమారు 65 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా, ఇందుకోసం సుమారు రూ.10 వేల కోట్ల నిధులు అవసరమని అంచనా. ఈ భారీ మొత్తాన్ని సేకరించడం ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. పాత రైతులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా కలిపి ఒకేసారి నగదు జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. ఇదిలావుంటే.. రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ , పరిషత్ ఎన్నికల దృష్ట్యా.. ఓటర్లను



మిగతా 2లో

## బకాయిలు చెల్లించాలి

### ప్రభుత్వానికి ఆల్కోటెవ్ విజ్ఞప్తి

**రూ.3,900 కోట్ల తక్షణం ఇవ్వాలి**

**లేకపోతే ప్రభుత్వ విశ్వసనీయతకు దెబ్బ**

**వుదయం, హైదరాబాద్:** రూ.3,900 కోట్ల పెండింగ్ బకాయిలు తక్షణం చెల్లించాలని బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి, ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్డబ్ల్యుఏఐ) సీఈఓ సంజిత్ పాధి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్ (సీఐఏబీసీ) డైరెక్టర్ జనరల్ అనంత్ అయ్యర్ డిమాండ్ చేశారు. ఈనెల చివరలో

మిగతా 2లో

## సంక్షేమం, అభివృద్ధి

### కష్టాల్లోనూ రెండేళ్లలో రేవంత్ సుపరిపాలన

**మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి**



**వుదయం, మహబూబ్ నగర్ :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెండు సంవత్సరాలుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి తో కలిసి శంకుస్థాపన చేశారు.స్థానిక శాసన సభ్యులు జి మధు సూదన్ రెడ్డి,రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లు పాల్గొన్నారు.

**భూత్పూర్ మున్సిపాలిటి లో**

10 కోట్ల 50 లక్షల నిధులతో నాగర్ కర్నూల్ రోడ్డు వద్ద సీతమ్మ కాంప్లెక్స్ నుండి స్ట్రోమ్ వాటర్ డైన్ నిర్మాణం. భూత్పూర్ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనుల నిర్మాణం, ఘన వ్యర్థాలు ప్రాసెసింగ్ యూనిట్ అభివృద్ధి పనుల నిర్మాణం, 1వ వార్డు నుండి 10వ వార్డులలో వివిధ ఏరియాలో వి.డి.సి.సి. రోడ్డు మరియు సి.సి. డ్రైన్ నిర్మాణం,50 లక్షల రూ.లతో హోల్ సేల్ కం రిటైల్ పిష్ మార్కెట్ నిర్మాణం పనులకు 3 కోట్ల 50 లక్షల నిధులతో సారిక టౌన్షిప్ వద్ద పార్కు అభివృద్ధి నిర్మాణం, అమిస్తాపూర్ వద్ద 1వ వార్డు నుండి 10వ వార్డులలో వివిధ ఏరియాలో వి.డి.సి.సి. రోడ్డు మరియు సి.సి. డైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.

**దేవరకద్ర మున్సిపాలిటీ లో**

10 కోట్ల రూపాయల నిధులతో ఆర్వోబి క్రింద సి.సి. రోడ్లు మరియు పార్కింగ్ సుందరీకరణ ఫుట్ పాత్, ల్యాండ్ స్కేపింగ్ మరియు మెయిన్ రోడ్ అభివృద్ధి నిర్మాణ పనులకు, 12 కోట్ల నిధులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు, 5 కోట్ల నిధులతో మున్సిపాలిటీలో వివిధ ప్రదేశాలలో వరద నీటి డ్రైన్ నిర్మాణ పనులకు,2 కోట్లతో స్విమ్మింగ్ పూల్ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే . మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ని చక్క బెడుతూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన వలసల జిల్లా నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందచేయడమే కాక సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి ద్వారా ఆర్.టి.సి. బస్సుల ద్వారా 10 వేల కోట్ల రూ.లు ఖర్చు పెట్టి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గుడిసెల్లో ఉన్న పేద వారికి 50 లక్షల కుటుంబాలకు 100 యూనిట్ వరకు విద్యుత్ ఉచితంగా కల్పిస్తూ కరెంట్ సంస్థలకు 6 వేల కోట్ల రూ.లు చెల్లిస్తున్నట్లు తెలిపారు.రైతులకు 21 వేల కోట్ల రూ.లు 2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 20 వేల కోట్ల రూ లు ఖర్చు చేసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.దేవరకద్ర,జడ్చర్ల నియోజక వర్గం లో కూడా పాఠశాలల పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పులు చేసిన వాటికి

మిగతా 2లో

## ఎన్నాళ్లు ఈ సస్పెన్స్?

### సిఎం పదవిపై ఊహాగానాలకు తెరదించండి : రాహుల్‌తో సిద్ధ రామయ్య, శివకుమార్



**బెంగళూరు :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడురాహుల్ గాంధీ మంగళవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన నేపథ్యంలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి వివాదాన్ని లేవనెత్తినట్టు తెలుస్తోంది. పార్టీ వర్గాల కథనం ప్రకారం, ముఖ్యమంత్రి పదవి పై హైకమాండ్ ప్రణాళికలపై స్పష్టతను కోరుతూ, ఊహాగానాలకు తెరదించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ముఖ్యమంత్రి కేబినెట్ పునర్వ్యవస్థీకరించవలసిన గురించి నొక్కి చెప్పినట్టు తెలుస్తోంది. కాగా, ఈ అంశంపై చర్చించేందుకు సిద్దరామయ్యను, శివకుమార్‌ను ఢిల్లీకి రావలసిందిగా రాహుల్ కోరినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం మైసూరు చేరుకున్న క్రమంలో సిద్దరామయ్య, శివకుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన తమిళనాడులోని ఊటీలో పొంగల్ ముందు ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయలుదేరి వెళ్లారు. ఆయన ఢిల్లీకి తిరిగి వెడుతున్నప్పుడు విమానాశ్రయంలో శివకుమార్ వీడ్కోలు పలికారు. రాష్ట్ర కాంగ్రెస్ అధిపతి కూడా అయిన శివకుమార్‌తో విమానాశ్రయంలో రాహుల్ గాంధీ సంభాషించడం మళ్లీ ఊహాగానాలకు తెరలేపింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి, కెపిసిసి అధ్యక్షుడు అయిన డికె శివకుమార్‌తో మైసూరు విమానాశ్రయంలో మంగళవారం చర్చలు జరిపారు. ఢిల్లీ వెళ్లే ముందు తమిళనాడు నుంచి మైసూరుకు రాహుల్ గాంధీ వచ్చినప్పుడు ఈ సమావేశం జరిగిందని, శివకుమార్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.తాను కాంగ్రెస్ అధ్యక్షుడనని, ఆయన లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అని, మేం చర్చించింది అంతా మీకు చెప్పలేం, మీరు ఏం మాట్లాడి ఉంటారని ఊహాగానాలు చేసి అనవసరంగా సమస్యలు సృష్టిస్తారు, అతడి

మిగతా 2లో



# ఇరాన్ నిరసనల పర్వంలో తొలి ఉరిశిక్ష

మొదటి పేజీ తరువాయి..

అవకాశం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అగ్ర నాయకుడు అలీ ఖమేనైకి వ్యతిరేకంగా పెరుగుతున్న నిరసనల మధ్య సోల్తానీ కేసును ఒక భయంకరమైన ఉదాహరణగా పట్టి చూపుతూ, అసమ్మతిని అణిచివేయడానికి సరైన ప్రక్రియ లేకుండాఇటువంటి క్లుప్త హత్యలను ఉపయోగిస్తున్నారని వారు అంటున్నారు. బుధవారం నాటికి 20వ రోజుకు చేరుకున్న ఈ నిరసన ప్రదర్శనలు రికార్డు ద్రవ్యోల్బణం, ఇరాన్ కరెన్సీ విలువ తీవ్రం పతనం కావడంతో ప్రారంభమై, వెనువెంటనే దేశవ్యాప్త అశాంతిగా పెరిగి 280 ప్రాంతాలలో ప్రజల తిరుగుబాటుకు కారణమైంది. క్రూరమైన అణచివేత చర్యలలో భాగంగా దాదాపు 2,000మంది వ్యక్తులను ఖమేనై ప్రభుత్వం హతం చేసి, సుమారు 20వేల మందిని అరెస్టు చేసింది. ఇరాన్‌లో భారీ స్థాయిలో కాల్పులు జరిగి, వ్యక్తులు మరణిస్తున్నారనే వార్తలు బయటకు రావడంతో ఐదు రోజుల పాటు ఇంటర్నెట్ సేవలను బంద్ చేశారు. సమాచారాన్ని బయటకు పంపేందుకు ఇరానియన్లను స్టార్‌లింక్‌ను ఉపయోగిస్తున్నారని, దీనితో మిలటరీ స్థాయి పరికరాలతో ప్రభుత్వం తొలుత వాటి సిగ్నళ్లను జామ్ చేయడమే కాక, ఇప్పుడు ఇళ్ల పైకప్పులపై దాడి చేయడానికి, టెర్మినల్లను జప్తు చేయడానికి, వాటిని ఉపయోగిస్తున్న వారిని శిక్షించడానికి సైన్యాలను మోహరించింది. ఇరాన్‌లోని ఖమేనీ పాలన అసమ్మతిని అణిచివేయడానికి, నిరోధించడానికి మరోసారి వేగవంతమైన విచారణలు , ఏకపక్ష ఉరిశిక్షలను ఆశ్రయించవచ్చు, అని హెచ్చరించడానికి అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఎర్ఫాన్ సోల్తాని కేసును ప్రముఖంగా చూపిస్తోంది.

**ఎర్ఫాన్ సొల్తానీ:**

*రోజుల్లోనే అరెస్టు, అదృశ్యం, శిక్ష..*

ఎర్ఫాన్ సొల్తానీని జనవరి 8వ తేదీ సాయంత్రం, కరాజ్‌లోని ఫర్దీస్ జిల్లాలో అతని ఇంటివద్ద అరెస్టు చేశారు. తర్వాత మూడు రోజుల వరకు, అతడి కుటుంబానికి అతడి గురించి ఏ సమాచారం ఇవ్వలేదు.గత ఆదివారం, అంటే జనవరి 11న ఖమేనీ భద్రతా అధికారులు అంతిమంగా కుటుంబాన్ని కాంటాక్ట్ చేసింది.సొల్తానీ



అదుపులో ఉన్నాడని, అతడికి అప్పటికే మరణశిక్ష విధించారని చెప్పినట్టు ఇరాన్ వైర్ పత్రిక పేర్కొంది. ఆ పత్రిక కథనం ప్రకారం, ఎర్ఫాన్ సొల్తానీ పై ఎటువంటి అధికారిక ఆరోపణలను బహిరంగంగా మోపలేదు, ఎటువంటి కోర్టు విచారణ జరపలేదు, న్యాయవాదిని కలిగి ఉండే అవకాశాన్ని ఇవ్వలేదు. అంతేకాదు, మీడియాతో మాట్లాడవద్దని అధికారులు కుటుంబాన్ని హెచ్చరించారు. తమ ఉత్తర్వులను అనుసరించకపోతే ఇతర కుటుంబ సభ్యులను అరెస్టు చేస్తామని బెదిరించారు. సొల్తానీ కుటుంబ సభ్యులు పదే పదే విజ్ఞప్తులు చేసిన తర్వాత మాత్రమే అధికారులు ఒకే ఒక సమావేశానికి అంగీకరించారు, అది కూడా కేవలం 10 నిమిషాల పాటు మాత్రమే. ఆ సమావేశం కూడా అతడి ఉరితీతకు ముందు అంతిమ వీడ్కోలుగా ఉండాలని అధికారులు స్పష్టంగా చెప్పారు. ఎర్ఫాన్ సొల్తానీ కేసులో ఎటువంటి సమీక్షకు అవకాశం లేదు. కుటుంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి ఒకరు, అజ్ఞాతంగా ఉంచాలన్న షరతులపై ఇరాన్ వైర్‌తో మాట్లాడుతూ, ఇరాన్ ప్రభుత్వం ఎర్ఫాన్ కుటుంబం పై పెడుతున్న వత్తిడిని అభివర్ణించారు. అతడి కుటుంబం ఇప్పుడు అత్యంత వత్తిడిలో ఉంది. సమీప బంధువైన ఒక లాయర్ ఆ కేసును వాదించేందుకు ముందుకు వస్తే, అతడిని అడ్డగించి, సెక్యూరిటీ అధికారులు బెదిరించారు. సమీక్షించడానికి ఎటువంటి ఫైలు లేదు. నిరసనలలో అరెస్టు అయిన ఎవరినైనా మొహరెబె (భగవంతుడి పట్ల శత్రుత్వం) కింద ఉరితీస్తామని ముందే ప్రకటించాం. ఎర్ఫాన్‌ను కూడా అదే నేరం కింద శిక్ష విధించాం, అదే అంతిమం, దానిని అమలు చేస్తామని చెప్పినట్టు ఆ వ్యక్తి ఇరాన్ వైర్‌కు వివరించారు. ఇరాన్ చట్టం కింద, మొహరెబె అన్నది తీవ్రమైన ఆరోపణ. దానిని తరచుగా నిరసనకారులు, అసమ్మతివాదులకు వ్యతిరేకంగా ఉపయోగించి, ఉరిశిక్ష విధించి, అమలు చేస్తుంటారు. ఈ ఆరోపణను ఒక రాజకీయ ఆయుధంగా ఇరాన్ అధికారులు ఉపయోగిస్తున్నారని మానవ హక్కుల గ్రూపులు ఎప్పటి నుంచో ఆరోపిస్తున్నాయి. సొల్తానీని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)కి చెందిన ఇంటెలిజెన్స్ సంస్థ అదుపులోకి తీసకుందని తాము విశ్వసించామని అతడి కుటుంబ సభ్యులు చెప్పారు. ఇరాన్ లో ప్రజలు అత్యంత భయపడే భద్రతా దళం ఐఆర్‌జిసి, వారు అగ్ర నాయకుడు అలీ ఖమేనైకి ప్రత్యక్షంగా విధేయంగా ఉంటారు. దీనిని సైద్ధాంతిక అనుగుణ్యతను అమలు చేయడం, భిన్నాభిప్రాయాలను అణిచివేయడం, ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలను నియంత్రించడం, స్వదేశంలో, విదేశాలలో ఖమేనై పాలనా శక్తిని ప్రదర్శించడం వంటి పనుల బాధ్యతలను నిర్వరిస్తుంది. లెబనీస్ – ఆస్ట్రేలియన్ ఇన్ఫ్లుయెన్సర్ మారియో నాఫాల్ సొల్తానీ గురించి ఎక్స్‌లో పోస్టు చేస్తూ, అతడి ఉరితీత జరగబోయే మరెన్నింటికో నాంది అని, ప్రజా సమూహాలను నియంత్రించేందుకు అధికారులు భయాన్ని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

**ఎర్ఫాన్ సొల్తానీ ఎవరు?**

ఎర్ఫాన్ సొల్తానీ దుస్తుల తయారీ పరిశ్రమలో పని చేస్తూ, ఇటీవలే ఒక ప్రైవేటు సంస్థలో చేరినట్టు ఇరాన్ వైర్ పేర్కొంది. అతడికి ఫ్యాషన్, వ్యక్తిగత స్టైల్ పట్ల అత్యంత ఆసక్తి అని స్నేహితులు, కుటుంబం అభివర్ణించాయి. ప్రభుత్వం ఇంకా డిలీట్ చేయని అతని ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ అతడు బాడీ బిల్డింగ్ పట్ల, క్రీడల పట్ల ఆసక్తి కలిగి, సాధారణ జీవితం సాగిస్తున్న యువకుడు అని వెల్లడిస్తుంది. అతడి అరెస్టు కన్నా ముందు నుంచే భద్రతా ఏజెన్సీల నుంచి సొల్తానీకి బెదిరింపు మెస్సేజీలు వచ్చాయని అతడి కుటుంబానికి సన్నిహిత వ్యక్తి ఒకరు ఇరాన్ వైర్‌కు చెప్పారు. తనపై నిఘా వేశారని కుటుంబానికి చెప్పిన అతడు, వెనక్కి తగ్గడానికి తిరస్కరించి, నిరసనలకు కట్టుబడ్డాడని అతడు చెప్పాడు. సొల్తానీ తక్షణ ఉరితీతపై నిపుణుల ప్రశ్నలు ఇరాన్ పరిశీలకులు, నిపుణులు కూడా ఈ ఉరితీత చట్టపరంగా అసాధ్యమైనదని పేర్కొంటున్నారు. అధికారులు ఇచ్చిన టైమ్‌లైన్ ప్రకారం, ఇరాన్ స్వంత క్రిమినల్ కోడ్ కింద ఈ ఉరిని చేయడం చట్టపరంగా అసాధ్యమని వారంటున్నారు. కేవలం మూడు రోజుల్లోనే ఒక వ్యక్తిని అరెస్టు చేసి, ఉరి తీయడం అసాధ్యమని మానవ హక్కుల న్యాయవాది మహమ్మద్ ఒలియాఫార్ద్ ఇరాన్ వైర్‌కు చెప్పారు. ప్రభుత్వం నియమించిన న్యాయవాదితో అయినా, ఈ ప్రక్రియకు పట్టే కనీస కాలం 10 రోజులని ఆయన అన్నారు. ఒకవేళ, ఆ వ్యక్తికి స్వతంత్ర న్యాయవాది ఉంటే, అప్పీళ్ల కోసం సమయం కూడా కలుపుకొని కనీసం 30 రోజులు ఈ ప్రక్రియ తీసుకుంటుందని వివరించారు. ఈ కేసు న్యాయమైన విచారణ జరుపకుండానే తక్షణం శిక్షించే లక్షణాలను కలిగి ఉందని ఒలియాఫార్ద్ అన్నారు, మొహరేబె అన్న అభియోగంలో కూడా తగిన ప్రక్రియ లేకుండా కొద్ది రోజుల్లోనే అమలు చేయాలని చట్టంలోని ఏ భాగంలోనూ పేర్కొన లేదు అని ఆయన అన్నారు.

ఒక ఇస్లామిక్ రిపబ్లిక్ అసమ్మతిని ఎలా అణచివేస్తుందో సొల్తానీ ఉరితీత పట్టి చూపుతుందని, ఇరానియన్– అమెరికన్ జర్నలిస్టు మాసీ అలినెజాద్ పేర్కొన్నారు. ఇంటర్నెట్‌ను నిలిపివేసి. వీధుల్లో నిరసనకారులను చంపండి. సమాజాన్ని నిశ్శబ్దం చేయడానికి వేగంగా ఉరిశిక్షలను ప్రారంభించండిష అంటూ అలీనెజాద్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ ప్రజలకు సహాయం కావాలి. ప్రభుత్వం వారిని అన్ని విధాలుగా చంపుతోంది. 21వ శతాబ్దంలో మానవతకు వ్యతిరేకంగా నేడు నేరాలు జరుగుతున్నాయి. చైనా తర్వాత ప్రపంచంలోనే అత్యధికంగా ఉరిశిక్షలు అమలు చేస్తున్న దేశాల్లో ఇరాన్ ఒకటని మానవ హక్కుల సంస్థలు చెబుతున్నాయి. 2024లో కనీసం 975 మందికి ఉరిశిక్ష అమలు జరిగిందని హక్కుల సంఘాలు నివేదించాయి. దాదాపు రెండు దశాబ్దాలలో ఇరాన్‌లో ఇది అత్యధిక సంఖ్యగా నమోదైంది. ఖమేనై పాలన అసమ్మతివాదులను భయపెట్టడంలో భాగం మరణశిక్షను విధించడాన్ని విస్తృతంగా చూశారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ నిరసనకారులకు మద్దతు ఇస్తూ, ఇరానియన్ దేశభక్తులారా, నిరసనలు కొనసాగించండి – మీ సంస్థలను స్వాధీనం చేసుకోండి!!! సహాయం మార్గంలోనే ఉంది అని అన్నారు. ఆయన యంత్రాంగం ఈ వాక్చాతుర్యాన్ని దూకుడుగా ఆర్థిక, సైనిక హెచ్చరికలతో జత చేసింది, ఇరాన్‌తో వ్యాపారం చేసే ఏ దేశంపైనా ప్రతిపాదిత 25శాతం సుంకం విధిస్తామని, అలాగే, ప్రభుత్వం ప్రదర్శనకారులను ఉరితీయడంలో ముందుకు సాగితే చాలా బలమైన చర్యలు ఉంటాయని అన్నారు. అదే సమయంలో, ట్రంప్ ఇరాన్ కోసం బహుళ ఎంపికలను తూకం వేస్తున్నారని, వాటిలో సైనిక ఎంపిక కూడా ఉందని నివేదికలు చెబుతున్నప్పటికీ, వాషింగ్టన్ దౌత్య మార్గాలను తెరిచి ఉంచింది. ఇంటర్నెట్ నిలిపివేత, భయంతో ఏర్పడిన నిశ్శబ్దం కారణంగా ప్రజల దృష్టికి ఆవల ఇలాంటి కేసులు ఇంకా ఎన్ని జరుగుతున్నాయో అనేది పెద్దగా తెలియడంలేదు. ఇరాన్ లోపల స్వతంత్రంగా నివేదించడం దాదాపు అసాధ్యం కాబట్టి, ఎర్ఫాన్ సొల్తానీ వంటి వారి మరణశిక్షలు అమలు అణచివేతలో ఒక భాగాన్ని మాత్రమే సూచిస్తాయి.

## భరోసాలో భారీ మార్పులు

మొదటి పేజీ తరువాయి..

ఆకట్టుకునేందుకు ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఈ నిధులను విడుదల చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సాగుదారుల వివరాలను నమోదు చేసే క్రమంలో పారదర్శకత పాటించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కసరత్తు అంతా పథకంలోని లొసుగులను తొలగించి.. కేవలం పంట పం డించే రైతులకు మాత్రమే లబ్ది చేకూర్చడమే లక్ష్యంగా సాగుతోంది. అనర్హులను తొలగించడం ద్వారా వ్యవస్థను ప్రక్షాళన చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

## మమత బెనర్జీ పిటిషన్ కొట్టివేత

మొదటి పేజీ తరువాయి..

ధర్మాసనం విచారిస్తుంది. ఇదిలా ఉండగా, బుధవారం హైకోర్టు విచారణ ప్రధానంగా ఐ–ప్యాక్ కార్యాలయం, ప్రతీక్ జైన్ నివాసంలో జరిగిన సోదాల ఫలితంగా టిఎంసి దాఖలు చేసిన పిటిషన్ నిర్వహణ చుట్టూ తిరిగింది. అఫిడవిట్ దాఖలు చేసిన వ్యక్తికి తనిఖీ చేసిన ప్రదేశాలతో సంబంధం లేదని, స్వాధీనం గురించి ఆరోపణలు చేస్తున్నవారికి వ్యక్తిగత జ్ఞానం లేదని వాదిస్తూ, ఈ లోపాలు విచారణ చేయలేనివని ఈడీ పిటిషన్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

## కష్టాల్లోనూ
## రెండేళ్లలో రేవంత్ సుపరిపాలన

మొదటి పేజీ తరువాయి..

వడ్డీ,అసలుకు 13 వేల కోట్ల రూ.లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు.గత ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు 90 శాతం పూర్తి చేశామని చెప్పడం ఆవాస్తవం అన్నారు. 7 వేల కోట్ల రూ.లు ఖర్చు చేసి ఉదండపూర్ వరకు భూ సేకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కోయల్ సాగర్ మిగిలిన పనికి,కల్వకుర్తి ఇతర ప్రాజెక్ట్ లు పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. ఎస్.ఎల్.బి.సి సొరంగం పను లు అమెరికా నుండి బేరింగ్ లు తెప్పించినట్లు,వేరే విధంగా మళ్లీ పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. దేవరకద్ర లో డిగ్రీ కళాశాల,అమృత్ కింద 5 కోట్ల పనులు,100 పడకల ఆసుపత్రి నిర్మాణం స్థానిక శాసన సభ్యులు జి.ఎం.ఆర్ పట్టు బట్టి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు
,కురుమూర్తి స్వామి దేవస్థానం కు ముఖ్యమంత్రి తో కలిపి 110 కోట్ల రూ లతో ఘాట్ రోడ్డు, రోప్ వే పనులను ప్రారంభించినట్లు,వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులు పాడి పంటలతో,మహిళలు కోటీశ్వరులు కావాలని,ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక పాడి అభివృద్ధి, మత్స్య, క్రీడల,యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.గ్రామాలు, మండలం లో అభివృద్ధి పనులు చేపట్టడం పండుగ అన్నారు శాసన సభ,పంచాయతీ ఎన్నికల లో ఆశీర్వదించి గెలిపించిన విధంగా వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూడా అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు.

## రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ

మొదటి పేజీ తరువాయి..

కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే కేటీఆర్ కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చిందని గుర్తు చేశారు. పోలీసులతో బెదిరించి ప్రశ్నించకుండా చేస్తున్నారని.. మీడియా ప్రశ్నించడం మానేస్తే అధికారంలో ఉన్నవాళ్లు బరితెగిస్తారన్నారు. ప్రజల గొంతుక లేకుండా పోతోందని, జర్నలిస్టులను చూస్తే చెంప పగలగొట్టాలని అనిపిస్తోందని ఓసారి సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు గుర్తు చేశారు.

## ఎన్నాళ్లు ఈ సస్పెన్స్?

మొదటి పేజీ తరువాయి..

నుంచి సందేశం ఏమీ లేదు, బాగా పని చేయమని చెప్పారు, మేం ఎంజిఎన్ఆర్ఇజిఎ గురించి చెప్తూ, ఆ సమస్య గురించి మేం ఏం చేయాలనుకుంటున్నామో చెప్పానని శివకుమార్ మీడియాకు చెప్పారు. నాయకత్వ అంశంపై చర్చించేందుకు ఇద్దరు నాయకులనూ సంక్రాంతి తర్వాత ఢిల్లీకి రమ్మని హైకమాండ్ పిలిచిందన్న పుకార్ల మధ్య శివకుమార్ వ్యాఖ్యలు వచ్చాయి. అంతకు ముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తేదీ ఇచ్చేందుకు తిరస్కరించి, అవసరమైనప్పుడు హైకమాండ్ నాయకులను పిలిపిస్తుందని చెప్పారు. ఇలా ఉండగా, పార్టీలో ఎలాంటి అయోమయం లేదని సిద్ధరామయ్య మీడియాతో అన్నారు. ఏం ఊహాగానాలు? అవి కేవలం మీడియా ఊహాగానాలు మాత్రమే. మీరు మాత్రమే ఊహాగానాలను సృష్టిస్తూ, ఆధారంలేని ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. పార్టీలో అయోమయం ఎక్కడుంది? అటువంటి పరిణామం ఏమీ లేదు అంటూ విరుచుకుపడ్డారు. కాగా, జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి శిబిరం ఒక కన్నువేసి ఉంచిందని పార్టీ వర్గాలు చెప్పాయి. ఈ అశాంతి 2023 ఎన్నికల ఫలితాలలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించినప్పటి నుండి కొనసాగుతోంది. ఆ సమయంలో, కాంగ్రెస్ విజయంలో పోషించిన పాత్ర కారణంగా శివకుమార్‌ను అగ్ర పదవికి బలమైన పోటీదారుగా పరిగణించారు. చివరికి, కాంగ్రెస్ నాయకత్వం ఆయనను ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవులకు సరిపెట్టుకునేలా ఒప్పించగలిగింది. రొటేషన్ ముఖ్యమంత్రి పదవికి ఒప్పందం కుదిరిందని కొన్ని నివేదికలు అప్పట్లో పేర్కొన్నాయి, కానీ ఇది ఎప్పుడూ ధృవీకృతం కాలేదు.

## హిందీ చదువులతో బానిసలుగా
## ఉత్తరాది ఆడపిల్లలు

మొదటి పేజీ తరువాయి..

దీని వల్ల రాష్ట్రంలో అక్షరాస్యత స్థాయిలు పెరిగాయని, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం పెరిగిందని ఆయన అన్నారు. ఆంగ్ల విద్యను నిరుత్సాహపరచడం వల్ల విద్యార్థుల అవకాశాలు, భవిష్యత్తు అవకాశాలు పరిమితం అవుతాయని, భాషా ఆధారి త పరిమితులు వృద్ధికి, ఉపాధికి అడ్డంకులుగా పనిచేస్తాయని మారన్ వాదించారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఆయనకు ఇంగితజ్ఞానం లేదని, దేశానికి, ముఖ్యంగా హిందీ మాట్లాడే వర్గాలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. దయానిధి మారన్ కు ఇంగితజ్ఞానం లేదని భావిస్తున్నాను. అదే సమస్య. నేను అతని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. భారతదేశ ప్రజలకు, ముఖ్యంగా హిందీ మాట్లాడేవారికి మారన్ క్షమాపణ చెప్పాలి, వారిని అతను చదువురానివారు, నాగరికత లేనివారుగా చిత్రీకరించాడని బిజెపి నాయకుడు తిరుపతి నారాయణన్ ఒక వార్తా సంస్థతో అన్నారు. ఈ అంశంపై మారన్ వాదనను సమర్థిస్తూ, ఉత్తరాదిలో మహిళల కోసం పోరాడటానికి ఎవరూ లేరని డీఎంకె నాయకుడు టికెఎస్ ఎలంగోవన్ అన్నారు. అది రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీపై ఆధారపడి ఉంటుంది. కాంగ్రెస్ మహిళలకు సాధికారత కల్పిస్తోంది. కాంగ్రెస్ ఎక్కడ పాలించి నా, వారు మహిళల విద్యకు మంచి చేస్తున్నారనడంలో సందేహం లేదు. తమిళనాడులో, మహిళల కోసం పోరాడినవారికి సాధికారత కల్పించాం. వారికి విద్య, ఉపాధిని అందించాం. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాం. మొదటి నుంచి మహిళల హక్కుల పురోగతి కోసం కృషి చేస్తున్నాం, అని ఆయన అన్నారు.




## బకాయిలు చెల్లించాలి

మొదటి పేజీ తరువాయి..

జరగనున్న ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) 56వ వార్షిక సమావేశం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆల్కహాలిక్ బేవరేజెస్ (ఆల్కోబెవ్) రంగానికి సంబంధించిన దీర్ఘకాలిక బకాయిలు చెల్లించాలని కోరారు. చెల్లింపుల ఆలస్యం అయితే సరఫరా వ్యవస్థలు దెబ్బతినడమే కాకుండా ఎక్సైజ్ ఆదాయాలపై ప్రభావం చూపుతాయన్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా దెబ్బ తీస్తుందని హెచ్చరించారు. తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఆల్కోబెవ్ సరఫరాదారులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.3,900 కోట్లు దాటాయన్నారు. వీటిలో సుమారు రూ.900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.




గత దశాబ్దంలో రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం నాలుగు రెట్లు పెరిగిందన్నారు. 2014లో సుమారు రూ.9,000 కోట్ల నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.38,000 కోట్లకు చేరుకుందన్నారు. అక్టోబర్ 2025లో మాత్రమే మద్యం రిటైల్ లైసెన్స్ దరఖాస్తు ఫీజుల ద్వారా రాష్ట్రానికి రూ.3,000 కోట్లకు పైగా ఆదాయం లభించిందన్నారు. డిసెంబర్ 2025లో కూడా ఆదాయ టర్నోవర్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకున్నట్లు వెల్లడైందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఆల్కోబెవ్ రంగం పన్ను ఆదాయాల్లో మూడో వంతుకు పైగా వాటా అందిస్తోందన్నారు. దేశంలోని రాష్ట్రాల్లో ఇదే అత్యధికమన్నారు. ఈ రంగం ప్రతి నెలా సుమారు రూ.2,300 నుంచి రూ.2,600 కోట్ల వరకు ఆదాయాన్ని సృష్టిస్తోందన్నారు. బ్రూవరీలు, డిస్టిలరీలు, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్, రిటైల్ వంటి విస్తృత ఎకోసిస్టమ్‌కు ఇది ఆధారంగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయన్నారు. టీజీ–ఐపాస్ ఆమోదాలు 50 శాతానికి పైగా తగ్గాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.13,730 కోట్లకు పడిపోయాయని పేర్కొన్నారు. దావోస్‌లో జరగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో తెలంగాణ రాష్ట్రం తనను తాను ఒక ప్రాధాన్య పెట్టుబడి గమ్యంగా ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఇప్పటికే ఉన్న బాధ్యతలను ప్రభుత్వం గౌరవించడం అత్యంత కీలకమన్నారు. ఈ స్థాయిలో చెల్లింపుల ఆలస్యం జరిగితే పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్ర విశ్వసనీయత, ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఆల్కోబెవ్ రంగం రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం అందిస్తుందన్నారు. బకాయిలను క్లియర్ చేయడం, 45 రోజుల ఒప్పంద చెల్లింపును పునరుద్ధరించడం ఆర్థికంగా వివేకవంతమైనదన్నారు. ఆదాయం, ఉద్యోగాలు, సరఫరా కొనసాగింపును కాపాడటానికి చాలా అవసరమన్నారు. పెండింగ్ బకాయిలు సకాలంలో చెల్లించడం వల్ల ప్రస్తుత, రాబోయే పెట్టుబడిదారులలో విశ్వాసం పెరుగుతుందన్నారు. వ్యాపారం చేయడానికి నమ్మకమైన ప్రదేశంగా తెలంగాణ ఖ్యాతి బలపడుతుందని పేర్కొన్నారు.

## పవన్
## సంక్రాంతి శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి..

కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేనేలేదని డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతి పండుగ నాడు ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని పవన్ కోరారు. 'మహా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ సంక్రాంతి తెలుగు వారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభమంగళాలను ప్రసాదించాలని ఆ సర్వేశ్వరుడిని వేడుకుంటున్నానని చెబుతూ.. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు' అని పవన్ కళ్యాణ్ ట్వీట్ చేశారు.

## రెండో వన్డేలో
## న్యూజిలాండ్ విజయం

### ఆకట్టుకున్న
### డారిల్ మిచెల్, విల్ యంగ్

**రాజ్‌కోట్:** భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను కివీస్ 1–1తో సమం చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని న్యూజిలాండ్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. డారిల్ మిచెల్ (131★; 117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సలు) శతకం బాదాడు. విల్ యంగ్ (87; 98 బంతుల్లో 7 ఫోర్లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. ఓపెనర్లు డేవాన్ కాన్వే (16), హెన్రీ నికోల్స్ (10) త్వరగానే నిష్క్రమించినా.. తర్వాత వచ్చిన విల్ యంగ్, డారిల్ మిచెల్ మూడో వికెట్‌కు 162 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. గ్లెన్ ఫిలిప్స్ (32★; 25 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇండోర్‌లో జరగనుంది. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (112★; 92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56; 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ చేశాడు. రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), రవీంద్ర జడేజా (27), నితీశ్ రెడ్డి (20) పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (8) నిరాశ పర్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జేమీసన్, ఫాక్స్, జేడెన్ లెనాక్స్, మైకేల్ బ్రాస్‌వెల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.





# గ్రేటర్ హైదరాబాద్



## పీర్జాదిగూడ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



**మేడిపల్లి, వుదయం ప్రతినిధి :** పీర్జాదిగూడ డివిజన్ ప్రజలకు జి హెచ్ ఎం సి 10వ డివిజన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు బండి మహేష్ యాదవ్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు,డివిజన్ లోని ప్రజలు భోగ భాగ్యాలతో సుఖ సంతోషాలతో మకర సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## డప్పుల దరువుతో రాస్తారోకో నేతల అరెస్టు



**ఊర్కొండ, వుదయం ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం. కల్వకుర్తి డివిజన్లో కలపాలని నిరాహార దీక్ష ఈరోజు అనగా బుధవారం రోజు ఊర్కొండ నాగర్ కర్నూలు జిల్లా ఓబీసీ అధ్యక్షులు వాగుల్దాస్ నిరంజన్ గౌడ్, ఆధ్వర్యంలో మండలంలో నిరసనలు నిరసిస్తూ 5వ రోజు ఉరుకొండ మండలాన్ని, కల్వకుర్తి రెవెన్యూ డివిజన్లో కొనసాగించాలని, కోదాడ జడ్చర్ల, హైవే రోడ్డు ప్రక్కల ఉరుకొండ మండల జేఏసీ నాయకులు. రిలే నిరాహార దీక్షలు చేశారు, అంతేకాదు రాస్తారోకో కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, సంఘీభావం తెలిపిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాభవన్ చైర్మన్ పరిరక్షణ సమితి సింగిరెడ్డి పరమేశ్వర్ గారు. బహుజన శోభాయాత్ర ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పాతూరు రమేష్ రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు అశోక్, ఊరుకొండ మండల భాజపా సీనియర్ నాయకులు తాడెం చిన్న, సంఘీభావం ప్రకటించారు. కల్వకుర్తి జేఏసీ నాయకులు ఆయిలలు సదానంద గౌడ్ వారిలో ఉరుకొండ మండల జడ్చర్ల జిల్లా అధ్యక్షులు ఆలకుంట వెంకటేష్, సమితిఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, రాధాకృష్ణబి నరేందర్ గౌడ్ మాదారం, బుడుమజ్జంగయ్య, వెంకటేష్ ముచ్చర్లపల్లి. అండేకర్ పవన్ కళ్యాణ్. డాన్ శివ ఉర్కొండ, అర్జునయ్య మధు షబ్బీర్, భాజపా సీనియర్ నాయకులు కల్వకుర్తి టిఆర్ఎస్ నాయకులు నేరేడు మల్లేష్, శ్యాంసుందర్ రెడ్డి, అరవింద్ గౌడ్,ఓర్సు శివ, డప్పు కళాకారులు లు రాములు, ఆంజనేయులు ఉరుకొండ పేట, బండారి శివుడు, రాజు నారం రెడ్డి, ఉరుకొండ మండలంలోని యువకులు నాయకులు పాల్గొన్నారు.

## చైనా మాంజాలు అమ్మితే కఠిన చర్యలు



**అందోల్, వుదయం ప్రతినిధి:** మెదక్ జిల్లా అల్లాదుర్గం గ్రామంలో గల వివిధ షాపులలో తనిఖీ చేసిన ఎస్ఐ శంకర్ సంక్రాంతి పండుగ కావడంతో పిల్లలకు యువకులకు చైనా మంజా అమ్మకూడదని హెచ్చరించారు.అలా కాదని ఒకవేళ ఎవరైనా చైనా మాంజా అమ్మినచో క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు.అలాగే గ్రామంలో ఎవరైనా చైనా మాంజాతో గాలిపటాలు ఎగరవేసిన వాటి వల్ల ఎవరికైనా గాయాలపాలు అయితే వారికి చట్టపరంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. అలాగే పండుగకి ఊరెళ్లే వాళ్ళు ఇంట్లో విలువైన వస్తువులు పెట్టకుండా బ్యాంక్ లాకర్లలో కానీ తెలిసిన వారి దగ్గర గాని పెట్టి వెళ్లాల్సిందిగా తెలిపారు. అలాగే దూర ప్రాంతాలకు బైక్ పై ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ గాలయ్య తోటి సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు.

## అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం



**అమీన్పూర్, సంగారెడ్డి,** బీరంగూడ శివాలయం గుట్ట పైన నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం అయ్యప్ప స్వామి దేవాలయం మొదటి స్లాబ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న దేవాలయ నిర్మాణ పనులలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. నేటి తరం యువత భక్తి భావం పెంపొందించుకోవాలని కోరారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు భక్తులు ఎమ్మెల్యే జీఎంఆర్ చేతిలో మీదుగా ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ కౌన్సిలర్లు మల్లేష్, బాలరాజు, గోపాల్, సీనియర్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఊరూరా ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు

### మహిళలకు ముగ్గుల పోటీలు విజేతలకు పట్టు చీరలు



**కల్వకుర్తి, వు దయం ప్రతినిధి :** రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని కర్తాల్, ఆమనగల్, తలకొండపల్లి, మాడుగుల, వెల్దండ, కల్వకుర్తి పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బారాస నాయకులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉప్పల వెంకటేష్ చేత కేక్ కట్ చేయించి తినిపించి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన మహిళల కు ముగ్గుల పోటీలు నిర్వహించారు విజేతలకు మొదటి బహుమతి మూడువేల రూపాయలు పట్టుచీర ద్వితీయ బహుమతి 2000 రూపాయలు పాల్గొన్న మహిళలందరికీ పట్టు చీరలు అందజేశారు

## సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

# సంక్రాంతి

- పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రంగోలి, కైట్ ఫెస్టివల్



**సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు :** తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పర్వదినం అని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రంగోలి, కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల ఎం డి ఆర్ ఫౌండేషన్ ను అభినందించారు. తన బాల్యంలో సంక్రాంతి వచ్చిందంటే పండగ ముందు పండగ తర్వాత గాలిపటాలు ఎగురవేస్తూ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే వారమని.. నేటితరం సెల్ ఫోన్, సోషల్ మీడియా మాయలో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం డి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పేట మున్సిఫ్ కోర్టుకు 2 మండలాలను మార్చాలి



**నారాయణ పేట టౌన్, వుదయం ప్రతినిధి :** కోస్గి కోర్టు పరిధి నుండి దామరగిద్ద, మక్తల్ కోర్టు పరిధి నుండి ఉట్కూరు మండలాల ను నారాయణపేట మున్సిఫ్ కోర్టు పరిధిలోకి మార్చాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ డిమాండ్.జనవరి 17వ తేదీ నుండి మక్తల్ నియోజకవర్గం లో కొత్తగా మున్సిఫ్ కోర్టు ప్రారంభమవుతున్న సందర్భంగా ఉట్కూరు మండలాన్ని మక్తల్ కోర్టు పరిధిలోకి తీసుకురావడం వల్ల నారాయణపేటకు అనుకొని ఉన్న వల్లంపల్లి మొదలుకొని తిప్రాస్ పల్లి, నిడుగుర్తి, అయ్యవారిపల్లి, బిజ్వారం, పెద్ద జట్రం, ఉట్కూర్,మొగ్ధంపురం, చిన్నపొర్ల,పెద్దపుర్ల, కొల్లూరు గ్రామాల ప్రజలకు కక్షిదారులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇప్పటికే కొడంగల్ కోర్టు పరిధి నుండి వేరుచేసి కోసిగిలో కొత్త కోర్టు ఏర్పాటు చేయడం వల్ల ఆ పరిధిలో దామరగిద్ద మండలం ఉండడంవల్ల దామరగిద్ద మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు కూడా చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ రెండు మండలాల ప్రజలు నిత్యము ఏదో ఒక పని కొరకు నిరంతరం నారాయణపేట లోనే ఉంటారు. సబ్ రిజిస్టర్,ఆర్డీవో, పంచాయతీ రాజ్ తదితర జిల్లా స్థాయి కార్యాలయాల లో వివిధ పనుల కొరకు నారాయణపేటకు వస్తూ ఉంటారని దీనిని దృష్టిలో ఉంచుకొని నారాయణ పేట మున్సిపల్ కోర్టు పరిధిలోకి వీటిని మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వము, హైకోర్టు ఉన్నతాధికారులు ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నారాయణపేట మున్సిఫ్ కోర్టు పరిధిలోకి ఇటు మక్తల్ కోర్టు నుండి ఉట్కూరును, కోస్గి కోర్టు పరిధి నుండి దామరగిద్ద మండలం తీసుకు రావాలని ఆయా మండలాల ప్రజలు కక్ష దారుల తరపున డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులు సవినయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ కోరారు.

## బ్రహ్మోత్సవాలకు ఎంపీకి ఆహ్వానం



**అలంపూర్, వుదయం ప్రతినిధి :** శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం నందు 2026 సంవత్సరం జనవరి 19,2026 నుండి జనవరి 23,2026 వరకు నిర్వహించనున్న శ్రీ జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవములకు, ఫిబ్రవరి 14,2026 నుండి ఫిబ్రవరి 18,2026 వరకు నిర్వహించనున్న శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి మహాశివరాత్రి మహోత్సవముల కు, మల్లు రవిని ఆహ్వానిస్తూ ఈ.ఓ. దీప్తి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది.

## వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ



**నారాయణపేట టౌన్, వుదయం ప్రతినిధి:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాదగిరి రోడ్‌లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు దొంగతనాలు, అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతోందని, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న 26 వాహనాలను గుర్తించి, వాటిపై మొత్తం రూ. 21,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

అదేవిధంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, సరైన నెంబర్ ప్లేట్, వాహన పత్రాలు వెంట ఉంచుకోవడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి వాహనదారుడు బాధ్యతగా నడుచుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

## ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం

### సర్పంచ్ ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి



**వెల్దండ, వు దయం ప్రతినిధి ప్రతినిధి:** మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేసిన ముగ్గులు పలువురుని అలరించాయి అనంతరం విజేతల కు 10000 నగదు తో పాటు గ్రైండర్ మరియు పాల్గొన్న మహిళలందరికీ పట్టు చీరలను అందజేశారు గ్రామ సర్పంచ్ ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు కార్యక్రమంలో నాయకులు కొండల్ రెడ్డి, రాములు, శారద, శ్రీను, అల్లాజి, రమేష్, పర్వతాలు కిషన్, కృష్ణయ్య తోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీనివాస కళ్యాణం కోసం భారీ ఏర్పాట్లు



**నారాయణపేట, వుదయం ప్రతినిధి :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ అంబాభవానీ ఆలయంలో ఈ నెల 16 న లోక కళ్యాణం కోసం నిర్వహిస్తున్న శ్రీ శ్రీనివాస కళ్యాణం కోసం భారీ ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా కళ్యాణం నిర్వాహకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీగాయత్రి దంపతులు మాట్లాడుతు శ్రీనివాస కళ్యాణం లోక కళ్యాణం కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ అంబాభవాని ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 6గంటలకు శ్రీనివాస కల్యాణం జరుగుతుందనీ తెలిపారు. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని తెలిపారు.శ్రీనివాస కళ్యాణం అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీనివాస కల్యాణం చూసి తరించాలని కోరారు.

## సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ చరిత్ర గ్రంథం ఆవిష్కరణ

### రాజవంశీయులు శ్రీ లక్ష్మీ కేశవ రెడ్డి



**గద్వాల , వుదయం ప్రతినిధి :** శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవ స్థానంలో బుధవారం అంగరంగ వైభవంగా శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా బోరవెల్లి పవన్ కుమార్ తెలుగు అధ్యాపకులు రచించిన శ్రీ సంతానవేణుగోపాలస్వామిదేవాలయ చరిత్ర అనే గ్రంధాన్ని ముఖ్య అతిథి శ్రీ లక్ష్మీ కేశవరెడ్డి రాజవంశీయులు ఆవిష్కరించడం జరిగింది. డాక్టర్ కే బాలస్వామి సభ అధ్యక్షత వహించారు. కె రామ్మోహన్ రావు, వారణాసి నాగేశ్వరా చారి విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మీ కేశవరెడ్డి మాట్లాడుతూ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయ చరిత్ర గ్రంధా ఆవిష్కరణ చేయడం చాలా ఆనందంగా ఉంది. మా పూర్వీకుల చరిత్ర మరియు దేవస్థాన చరిత్ర శ్రీవైష్ణవ సాంప్రదాయం గూర్చి చాలా విపులంగా ఇందులో వివరించడం జరిగింది. ఇలా భక్తుల సమక్షంలో ఈ యొక్క గ్రంధాన్ని ఆవిష్కరించడం చాలా ఆనందంగా అనిపిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు గోవర్ధన్ శెట్టి వ్యాఖ్యానం చేశారు. ఎంఎన్ నందకిషోర్ గ్రంథ సమీక్ష చేశారు. లక్ష్మణ్ ఒగ్గు నాగరాజు గోసాయి వేణు అంబటి భాను ప్రకాష్, మహేందర్ జయన్న, బసవరాజ్,బుచ్చన్న, తెలుగు పండితులు తెలుగు అధ్యాపకులు భారీ సంఖ్యలో హాజరై గ్రంథ రచన చేసిన బోరవెల్లి పవన్ కుమార్ ని ఘనంగా సన్మానం చేశారు.

## క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి

**వెల్దండ , వు దయం ప్రతినిధి :** క్రీడలు మానసికల్లాసం పెంపొందిస్తాయని యువత క్రీడల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎదగాలని బండోనిపల్లి గ్రామ సర్పంచ్ ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి పేర్కొన్నారు సంక్రాంతి పర్వదిన పురస్కరించుకొని బొల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన బిపిఎల్ క్రికెట్ క్రీడాకారులకు వందమందికి తన సొంత డబ్బు వెచ్చించి జెర్సీలు అందజేశారు యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని క్రీడాకారులకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు.

## జెపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

### 9వ వార్డులో బహుమతుల ప్రధానం



**నారాయణపేట టౌన్, వుదయం ప్రతినిధి :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో సంక్రాంతి నీ పురష్కరించు కుని మహిళలకు బుధవారం బిజెపి మాజీ కౌన్సిలర్లు బి .సుజాత కృష్ణ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించా రు.ఈ పోటిల్లో గెలుపొందిన విజేతలు మొదటి బహుమతి అనసూయ,రెండవ బహుమ తి వేంకటేశ్వరమ్మ,మూడో బహుమతి నాలమ్మ లకు ప్రదానం చేశారు.ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సనాతన ధర్మానికి పండుగ లు ప్రతికలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.ఆశప్ప,లక్ష్మన్,సురేష్,భీంరాజ్, నర్సింహ,ఆనంద్,ఆంజనేయులు ,లింగరాజు,అశోక్,భారత్,రమేష్,ఓంకార్,కార్తిక్,మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలి



**నాగర్ కర్నూల్ : వుదయం ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని 23వ వార్డు రాఘవేంద్ర కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కందికొండ గీత మాట్లాడుతూ మహిళల్లో పిల్లల్లో ఎంతో సృజనాత్మక శక్తి ఉంటుందని దాన్ని వెలికి తీసే ప్రయత్నంలో ఇది ఒక భాగమేనని తెలిపారు. అంతేకాక ఆడపిల్లల్ని పుట్టనిద్దాం చదవనిద్దాం ఎదగనిద్దాం బ్రతకనిద్దాం అంటూ ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాలను వ్యతిరేకించాలని తెలిపారు. పేదవారికి ఆర్థిక స్తోమత తగ్గిపోయి ఉన్నవారికి ఎస్సీ ఎస్టీలకు బీసీలకు అది చదువుకున్నంత కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వాలు ఉచిత విద్యను వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు కాలనీవాసులు అంజనమ్మ నవనీత స్వాతి మల్లీశ్వరి యామిని ఉమా ఉషశ్రీదేవి పాల్గొన్నారు.

## 19 నుండి 23 వరకు జ్ఞాన సరస్వతి బ్రహ్మోత్సవాలు

- ప్రతిరోజు చిన్నారులకు అక్షరాభ్యాసాలు,అన్నప్రాస, గో పూజలు...
- ఈనెల 22న చండీ హోమం..
- ఈనెల 23న వసంత పంచమి విశేష అక్షరభ్యాసాలు వేడుకలు,సరస్వతి హోమం
- ప్రతిరోజు మధ్యాహ్నం భక్తులకు ఉచిత అన్నప్రసాద పంపిణీ



**నాగర్ కర్నూల్ వుదయం ప్రతినిధి :** జిల్లా కేంద్రం కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు జ్ఞాన సరస్వతి దేవాలయంలో మాఘశుద్ధ పాడ్యమి నుండి మాఘ శుద్ధ పంచమి వరకు ఈనెల19 నుండి 23వరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు జ్ఞాన సరస్వతి దేవాలయ అధ్యక్షులు ఆకారపు విశ్వనాథం ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు తెలిపారు.గత 14సంవత్సరాల నుండి ప్రతిరోజు దేవాలయంలో గోపూజ,అమ్మవారికి త్రికాల పూజలు జరుగుతున్నట్లు తెలిపారు .ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19న మహాభిషేకం,అఖండ దీపారాధన,గోపూజ,గణపతి పూజ,పుణ్యావాచనం,రక్షాబంధనం,పంచగవ్య ప్రాశనం,మండపారాధన, నవగ్రహ మండప అంకురార్పణ,మండప పూజలు,ప్రత్యేకంగా గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 20న మంగళవారం నాడు సరస్వతి అమ్మవారికి మూలవిరాట్ కు సామూహిక అభిషేకాలు, గోకల్యాణము,తులాభారం,ఓం శ్రీ రక్ష కోలాట బృందం వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 21న బుధవారం నాడు ఉత్సవ విగ్రహానికి పాఠశాల విద్యార్థులచే సామూహిక అభిషేకాలు,శ్రీ గాయత్రి హోమము, దైవభక్తి దేశభక్తి పాటల కచేరీ కార్యక్రమము ఉన్నట్లు తెలిపారు.ఈనెల 22న గురువారం నాడు శ్రీ గురు దత్తాత్రేయ హోమము,9గంటలకు చండి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న మాఘ శుక్ల పంచమి,మాఘ పంచమి నాడు అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా బాలగోమాతకు డోలారోహణం ,ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈనెల 23న చిన్నారులకు విశేష అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నామని అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. గణపతి హోమం,చండీ హోమం, గాయత్రి హోమం,నవగ్రహ హోమం ,గోకళ్యాణం ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొనే భక్తులు,దంపతులు సాంప్రదాయ దుస్తులలో పాల్గొనాలని వారు కోరారు. వివరాలకు 6301083132, 9949031319 లలో సంప్రదించలని వారు కోరారు. ప్రతిరోజు మధ్యాహ్నము 12 గంటలకు అమ్మవారికి పల్లకి సేవ దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం జ్ఞాన సరస్వతి దేవాలయ సేవా ట్రస్టు ద్వారా పాల్గొన్న భక్తులందరికీ నిత్య అన్న ప్రసాద పంపిణీ ఉన్నట్లు తెలిపారు.ఈ ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

## నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆటలు



**నారాయణపేట, వుదయం ప్రతినిధి :** క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసేందుకు మన ఊరు మన ఆట పోటీలు నిర్వహిస్తున్నామని జాజాపూర్ ఉపసర్పంచ్ కుమ్మరిలక్ష్మణ్ అన్నారు. బుధవారం నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ లో సంక్రాంతి పురస్కరించుకొని క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి క్రికెట్ పోటీలను మన ఊరు మన ఆట నిర్వహిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. యువకులకు క్రీడాకారులకు నిర్వహించి యువకుల్లో ఉన్న నైపుణ్యాన్ని బయటికి వస్తుందని అన్నారు. ప్రతి ఏడాది క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తామనిఅన్నారు. క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతారనిఅన్నారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు కుర శివ, అరిగే సురేష్, మూలింటి తిమ్మప్ప, నీలి చంద్రకాంత్ లు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఊరు మన ఆట జె పి ఎల్ క్రికెట్ పోటీలలో ఏడు జట్లు తెలిపారు.ఈ క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 35 వేల రూపాయలను నారాయణపేట కాంగ్రెస్ యువజన అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయంతో అందిస్తున్నట్లు తెలిపారు. రెండవ బహుమతి 25వేల రూపాయలను గ్రామ యువకుడు డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. క్రికెట్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు క్రీడలను తిలకించేందుకు వచ్చిన ప్రజలకు కుమ్మరి చిన్న నారాయణ తాగునీటి సౌకర్యాన్ని కల్పించినందుకు ఆర్గనైజర్ల ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ రవికుమార్,హరీష్ కుమార్ గౌడ్, కుమ్మరి అనిల్ కుమార్,రుక్మత్ పాషా లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



“ఉత్తరాదిలో ఇంగ్లీష్ విద్యను నిరుత్సాహపరుస్తున్నారు. హిందీ మాత్రమే చదువాలని విద్యార్థులను నియంత్రిస్తున్నారు. అలాంటి విధానాలు దక్షిణాదిలో లేకపోవడం వల్లనే ఇక్కడ వలసలు పరిమితంగా ఉండి, అభివృద్ధి జరుగుతున్నది. హిందీకి విశేష ప్రాధాన్యంఇచ్చే ఉత్తరాది రాష్ట్రాల ధోరణి అటునుంచి దక్షిణాదికి వలసలను పెంచుతున్నది. తమిళనాడులో ప్రజలు విద్యావంతులు కావడం కారణంగానే ప్రపంచంలోని అతిపెద్ద కంపెనీలు తరలివస్తున్నాయి. దక్షిణాదిలో ఆడపిల్లలను విద్యావంతులను చేస్తున్నాం, ఉత్తరాదిలో వారు ఇంకా బానిసత్వంలో బతుకుతున్నారు.”

- డిఎంకి ఎంపి దయానిధి మారన్

## వే'మన'పద్యం

చదివి చదివి చదివి చావంగ నేలను
చావులేని చదువు చదవ వలయు
చదువు మర్మమెరిగి చదివిన చదువురా
విశ్వదాభిరామ వినుర వేమ!



## సంపాదకీయం

# గిగ్స్ విజయం

ఎట్టకేలకు గిగ్ కార్మికులు ఒక మంచి విజయం సాధించుకొన్నారు. మెడ మీద కత్తి వం '10 నిమిషాల్లోనే డెలివరీ' పథకానికి యాజమాన్యాల చేత స్వస్తి చెప్పించగలిగారు. గాల్లోంచి దండిగా లాభాలు తీయగల కొత్త విధానాలను అమల్లోకి తెస్తున్న ఆధునిక పెట్టుబడి కంపెనీలు దేశంలో అపారంగా గల నిరుద్యోగ యువత రక్తాన్ని పిండుకుంటున్నాయి. పాక్షిక నిపుణ పని వారిని, నెలవారి జీతాలు ఇతర జీవన భద్రత సదుపాయాలు లేకుండా, గంటలవారీ కూలి అర కొర చెల్లింపులకు పని చేసేవారిని గిగ్ కార్మికులు అంటున్నారు. ఆన్ లైన్ వ్యవస్థ బలపడిన తర్వాత యాప్ ల సాయంతో కావలసిన సరకులు ఆరర్ చేసే విధానం చోటు చేసుకొన్నది. దానితో మోటార్ సైకిల్ నడపటం చేతనయ్యే యువత గిగ్ లుగా పొట్ట పోషించుకొంటున్నారు. వినియోగదారు ఆర్డర్ చేసిన వస్తువు తాము తయారు చేయనక్కరలేదు, ఎవరో సిద్దం చేసిన వాటిని వినియోగదారుకు అందించడమే కంపెనీ పని, అందుకు విద్యావంతులైన నిరుద్యోగ యువతను కారు చౌకగా వినియోగించుకొంటున్నారు.వేరే ఉద్యోగం దొరికే అవకాశం బొత్తిగా లేకపోవడంతో ఈ పనిలో చేరిన గిగ్ లు2020 లో దేశంలో 77 లక్షల మంది ఉన్నారు, 2029 నాటికి 2కోట్ల 35 లక్షలకు చేరుతారని అంచనా.మొదట్లో సొంత కార్లు ఉన్నవారిని పోగేసి అధిక ఆదాయం ఆశ చూపి ఓలా వంటి కంపెనీలు విశేషంగా ధనార్జన చేసుకొన్న సంగతి తెలిసిందే. టాక్సీ సేవలకు వాడుకొన్న డ్రైవర్ల ఆశలు అడియాసలై వాయిదాల మీద కొనుక్కొన్న కార్ల ఇ ఎం ఐ లు చెల్లించుకోలేక వాటిని వారు తెగనమ్ముకోడం, ఆందోళనలకు సమకట్టడం తెలిసిందే. భారీ పెట్టుబడి వ్యయమేదీ లేకుండా విశేష లాభాలు ఇస్తున్న ఈ వ్యాపారాన్ని పెంచుకోడానికి యాజమాన్యాలు సరికొత్త వాణిజ్య వ్యూహాలు పన్నుతూ వినియోగదారను మరింతగా ఆకట్టుకొంటున్నాయి. తాజాగా 'ఆరర్ చేసిన పది నిమిషాల్లోనే డెలివరీ' అనే పథకాన్ని తెర మీదికి తెచ్చాయి.ఈ పథకానికి స్పందన బాగా వస్తుంది కాని గిగ్ కార్మికులకు అగ్ని పరీక్ష ఎదురవుతుంది. వారి ఆరోగ్యాలు దారుణంగా దెబ్బ తింటాయి. అకాల మరణాలూ సంభవిస్తాయి.దీని గురించి కేంద్ర మంత్రి మన్ సుఖ్ మాండవీయకు ఫిర్యాదు చేయగా ఈ పది నిమిషాల డెలివరీ విధానాన్ని ఉపసంహరించుకోడానికి బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గో వంటి తక్షణ సేవల సంస్థలు అంగీకరించేటట్టు కేంద్రం చర్యలు తీసుకొన్నది. వాటితో ప్రభుత్వ చర్చలు విజయవంతమయ్యాయి.అయితే ఇంతటితో వారి సమస్యలు అంతమైనట్టు కాదు. ఉద్యోగ, వేతన భద్రత, ప్రమాద బీమా వంటివి కల్పించాలి. డెలివరీ గమ్యాల్లో కుక్కలకు భయపడి పారిపోయే క్రమంలో మేడపై నుంచి దూకి మరణించిన కార్మికుల ఉదంతాలున్నాయి. అటువంటి వారి కుటుంబాలను ఆదుకోవాలి. వాహన ప్రమాదాల్లో చనిపోతున్నారు.అందుచేత వీరి సమగ్ర రక్షణకు కేంద్రం స్థాయిలో గట్టి చట్టాన్ని తేవాలి. యాగ్రిగేటర్లు, గిగ్ లు తమ పేరును నమోదు చేసుకోవడం, గిగ్స్ లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు,వర్కర్ల ను ఆడుకోడానికి ప్రతి డెలివరీ మీద 1-2 % సెస్ విధింపు వంటి చర్యలకు అవకాశం కల్పిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం 2023 లో తీసుకొచ్చిన మాదిరి చట్టాలు రావాలి. వాటి అమలు కట్టుదిట్టంగా జరగాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# బాలన్ పల్లి సాగుతో వలసలు కట్

తెలంగాణా లోని నాగర్ కర్నూల్ జిల్లా, తాడూరు మండల్, బాలన్ పల్లి లో ఎక్కువ శాతం పత్తి, వరి సాగు చేస్తుంటారు. అయితే వారు ఎంత కష్టించినా తగిన దిగుబడులు వచ్చేవి కాదు. దీనికి కారణం క్లైమెట్ ఛేంజ్ ! పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వాతావరణంలో తీవ్రమార్పులు చోటు చేసుకుంటున్నాయి. కరువు పరిస్థితులు తలెత్తడం తో వ్యవసాయం దెబ్బతిని రైతులు, రైతుకూలీలు జీవనాధారం కోల్పోతున్నారు. ఈ పరిస్థితుల నుండి బయట పడాలంటే, వాతావరణ మార్పులను ఎదుర్కొనే ‘ వాతావరణ నిర్ధారణ ప్రాజెక్ట్ ’ ని అమలు చేయాలని బాలన్ పల్లి రైతులు గ్రామ సభలో తీర్మానం చేశారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ ఆర్థిక సహకారంతో, ఎస్.డి.డి.పి.ఎ సంస్థ 2019 నుండి 2023 వరకు రైతుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం అమలు చేసింది. నిరంతరం పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వాతావరణంలో తీవ్రమార్పులు చోటు చేసుకుంటున్నాయి. మానవ మనుగడకు, వ్యవసాయానికి ఇబ్బందిగా మారాయి. కరువ పరిస్థితులు తలెత్తడం తో వ్యవసాయం దెబ్బతిని చిన్న రైతులు,రైతుకూలీలు జీవనాధారం కోల్పోతున్నారు. పంట ఉత్పాదకత తగ్గి ఆహార భద్రతకు ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో వాతావరణ మార్పులను ఎదుర్కొని భూసారాన్ని కాపాడి, పంటల దిగుబడులు పెంచే ఒక వినూత్న ప్రాజెక్ట్ సిపిపి. దీనిని జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) బాలన్ పల్లి లో అమలు చేసింది. సిపిపి ప్రాజెక్ట్ అమలు అనంతరం ఒకప్పటి కరువు ప్రాంతం , నేడు పచ్చని పైరులతో కళకళలాడుతుంది. దీని వెనుక బాలన్ పల్లి విలేజ్ వాటర్ షెడ్ కమిటీ సభ్యుల శ్రమ, నాబార్డ్ ఆర్థిక సాయం, ఎస్.డి.డి.పి.ఎ సంస్థ ప్రతినిధుల కార్యాచరణ ఉంది. ‘క్లైమేట్ ప్రూఫింగ్ ప్రాజెక్ట్’ మెట్టప్రాంతాల్లో నాబార్డ్ చేపట్టిన ఒక పర్యావరణ హిత కార్యక్రమం. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్ అనంతరం సహజ వనరుల అభివృద్ధికి తోడ్పాటును అందించి, సుస్థిర వ్యవసాయ దిశగా రైతులను నడిపించడానికి ఉద్దేశించిన కార్యక్రమమిది. దీనిలో భాగంగా, నాగర్ కర్నూల్ జిల్లా, తాడూర్ మండలం, బాలనపల్లి గ్రామంలో ఎస్.డి.డి.పి.ఎ అనే ఎన్‌జిఒ ద్వారా కార్యక్రమం అమలు చేశాం. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సాగు విధానంలో మార్పులు తెచ్చి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పెంచేలా రైతులకు శిక్షణలు ఇచ్చాం. భూగర్భ జలాలను పొదుపుగా వాడే సూక్ష్మసేద్య పరికరాలను అందించాం. బోర్‌వెల్ రీఛార్జి పాయింట్స్ , పెండాల్స్ , వ్యవసాయ పనిముట్లను రైతులకు సమకూర్చాం. దీనివల్ల వాతావరణ మార్పుల్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించి,రైతుల జీవనోపాధిని బలోపేతం చేయడం ద్వారా రైతుల ఆదాయం గతం కంటే మెరుగైంది. దిగుబడిపెరిగింది’ అన్నారు, నాబార్డ్ నాగర్ కర్నూల్ జిల్లా డెవలప్ మెంట్ మేనేజర్ పి.మనోహర్ రెడ్డి. ఒకపుడు బాలన్ పల్లి గ్రామంలో సేద్యం కష్టసాధ్యం అయి పంటలు పండిరచలేక రైతులు కూలీ పనులకు పోవాల్సి వచ్చేది. ఈ పరిస్థితిని మార్చడానికి నాబార్డ్ , ఎస్.డి.డి.పి.ఎ సంస్థ ద్వారా సర్వే చేయించి, వ్యవసాయ విధానంలో మార్పులు చేసింది. సిపిపి ప్రాజెక్ట్‌తో భూసారం, తేమ, పచ్చదనం వంటి సహజవనరులను కాపాడారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలు అయింది.ప్రాజెక్ట్ అమలుకు ముందు చురుకైన రైతులతో విలేజ్ వాటర్ షెడ్ కమిటీ ని ఏర్పాటు చేసుకున్నాం. ప్రతీ సమస్యను అందరం కలిసి చర్చించుకొని పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నాం. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా , వాననీటిని సంరక్షించడం ద్వారా భూగర్భజలాలు గతం కంటే పెరిగాయి.’ అన్నారు.’ ఎస్.డి.డి.పి.ఎ సంస్థ ప్రతినిధి వెంకటేశ్వరరావు. ‘ ఈ ప్రాజెక్ట్ వల్ల మాకు డ్రిప్ ఇరిగేషన్ యూనిట్, పెండాల్స్ (పందిర్లు) ఇచ్చారు. అంతంత మాత్రమే ఉన్న భూగర్భ జలాలను పొదుపుగా వాడుతూ, ప్రతీ మొక్కకు అందేలా డ్రిప్ ఇరిగేషన్, రెయిన్ గన్ టెక్నాలజీతో పొదుపుగా వాడుతున్నాం. ఈ ప్రాజెక్ట్ అమలు తరువాత ఒక్క రైతు కూడా నష్టం అనేది లేకుండా పాడిపంటలతో హ్యాపీగా ఉన్నారు. సొంతంగా కషాయాలు. ద్రవ, ఘనజీవామృతం వంటివి తయారు చేసుకొని పంటలపై పిచికారీ చేస్తూ ఆరోగ్యవంతమైన పంటలను పండిస్తున్నాం కూరగాయల సాగు చేస్తూ వారానికి 10,000 లకు పైగా ఆదాయం పొందుతున్నాం. హోల్ సేల్ వ్యాపారులు మా పొలాల దగ్గరకు వచ్చి కూరగాయలు కొంటున్నారు.’ అన్నారు బీర,కాకర , చిక్కుడు కోసి బస్తాల్లో నింపుతున్న సుదర్శన్. ఇదే ప్రాంతంలో ఉన్న కొన్ని బీడు భూములను పండ్లతోటలుగా మార్చారు. బాలన్‌పల్లికి చెందిన ఒక రైతుకు 7 ఏండ్ల క్రితం 200 మామిడి మొక్కలు ఇవ్వగా ఇపుడ అవి కాతకు వచ్చాయి. అంతర పంటలుగా అపరాలు సాగు చేస్తున్నారు.

1, లోదుక్కుల ద్వారా నేల సారం పెంచారు. భూ సారం పెంచడానికి జీలుగ పంటలను ప్రోత్సహించారు. 2, బోర్ వెల్ రీచార్జి పాయింట్స్‌తో బోర్లలో నీటి మట్టం పెంచారు. దీనివల్ల 36 హెక్టార్లు సాగు చేస్తున్నారు. 3, భూగర్భ జలాలను కాపాడడానికి 18 డ్రిప్ ఇరిగేషన్ యూనిట్లు, రెయిన్ గన్ వంటి ఆధునిక టెక్నాలజీని సమకూర్చడంతో దాదాపు 26 హెక్టార్లలో కూరగాయల దిగుబడి పెరిగింది. 4, నీటి వృధాను అరికట్టడానికి 3 సాయిల్ మాయిశ్చరైజ్ యూనిట్లు సమకూర్చారు. దీనివల్ల నేలలో తేమ శాతం తెలుసుకొని మిర్చి, కూరగాయల సాగులో దిగుబడి పెంచుతున్నారు. 5, నేలలో తేమను కాపాడి, కలుపు నివారణకు రైతులకు మల్చింగ్ షీట్స్ సమకూర్చారు. దీని వల్ల మొక్కల ఎదుగుదల బాగుంది. 6, ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్‌లో భాగంగా రైతుకు నిరంతర ఆదాయం కోసం, నాబార్డ్ సహకారంతో 300 బంగినపల్లి మామిడి మొక్కలను రైతులకు ఇచ్చారు. దీని వల్ల 2 హెక్టార్ల బీడు భూమి నేడు పండ్లతోటలుగా మారింది.రైతుల ఆదాయం పెరిగింది. 6, తీగజాతి కూరగాయల కోసం పెండాల్స్‌ని సమకూర్చారు. దీనివల్ల కాకర,బీర, చిక్కుడు వంటి పంటలు దిగుబడి పెరగడమే కాక నాణ్యత పెరిగింది. 7, రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువుల పై రైతులకు అవగాహన కలిగించడం వల్ల బాలన్ పల్లి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మారింది. గతంలో ఒక పంట పండిరచడమే అసాధ్యమైన రైతులు సిపిపి ప్రాజెక్ట్ అమలు అనంతరం నేడు రెండు పంటలు పండిస్తున్నారు. నాబార్డ్ అమలు చేసిన ఈ ప్రాజెక్ట్ రైతుల జీవనోపాధులను మెరుగు పడటమే కాక, వ్యక్తిగత, ఆదాయ భద్రతను చేకూరింది.ఒకపుడు ఉపాధికి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన రైతులు, నేడు వాపస్ వచ్చి వ్యవసాయం చేసుకుంటూ సుస్థిర జీవనోపాధులు పొందుతున్నారు. వాతావరణ మార్పులకు తగిన విధంగా సేద్యంలో మార్పులు చేస్తే వ్యవసాయం సుసంపన్నమవుతుందని ఈ రైతులు నిరూపించారు.

మోహన

## నాబార్డ్ ప్రూఫింగ్ ప్రాజెక్టు



# వర్గ పోరులో ఒరిగిన నేత

## రీతి-ఖ్యాతి

ఆంధ్ర ప్రదేశ్ సామాజిక, రాజకీయ చరిత్రలో వంగవీటి మోహన రంగాది ఒక సంచలన మజిలీ. ఆయన ఎమ్మెల్యేగా కేవలం ఒకే ఒక దఫా, అది కూడా 5 ఏళ్ళు కూడా పూర్తి చేయకపోయినా, రాష్ట్రం పైన రంగా ఎన్నటికీ చెరగని ముద్ర వేసుకున్నారు. ఇది ఆయన ప్రత్యర్థులు కూడా కాదనలేని వాస్తవం.

ఒక సైకిల్ షాప్ లో అతి సాధరణమైన కార్మికుడు గా పని చేసిన రంగా కేవలం దశాబ్ద కాలంలో రాష్ట్ర రాజకీయాన్ని ప్రభావితం చేసే వ్యక్తిగా ఎదగడం నివ్వెరబోయే అంశం. 1970, 80 లలో విజయవాడలో ఉన్న పరిస్థితులకు అద్దం పట్టేదే రంగ యొక్క ప్రస్థానం. ఒక వైపు విశాలమైన వీధులతో ఆర్థిక మందం ఉట్టి పడుతున్న బందర్ రోడ్ ఉంటె మరో వైపు కిక్కిరిసిన జనాభాతో తీరు తెన్నూ లేని శ్రామిక వాడలు విజయవాడ లోని ఇతర ప్రాంతాల్లో తారస పడతాయి. ప్రభుత్వాలు విఫలమైనప్పుడు, పెట్టుబడిదారి వర్గాల కోరల్లో శ్రామిక వర్గాలు చిక్కుకున్నప్పుడు సమాజంలో ప్రత్యమ్నాయ వ్యవస్థలు పుట్టుకొస్తాయి. కమ్యూనిస్ట్ లు కూడా తమ కమ్యూనిజం ని పేరుకే పరిమితం చేసిన రోజుల్లో పీడిత వర్గాలు కొత్త నాయకులని తయారు చేసుకుంటాయి. అనడానికి రంగ ఎదుగుదల ఒక ఉదాహరణ. అప్పటి విజయవాడ నగరం వ్యాపారపరంగా ఎంతో ప్రాముఖ్యత సంపాదించుకుంది. అంతటి వ్యాపార రథ చక్రాలను నడిపేందుకు పెక్కు మంది శ్రామికుల రక్తం స్వేదంగా మారింది. లాభాపేక్ష తప్ప శ్రామికుల సంక్షేమం పట్టని పెట్టుబడిదారి వర్గాలకు ఎదురుగా శ్రామికులకు వెన్నుదన్ను గా ఉంటూ ఎదిగిన “రాబిన్ హుడ్” వంగవీటి రాధా కృష్ణ రంగా గారి అన్న. అటువంటి బలమైన వర్గ పోరులో 1974లో హత్యకి గురి అయిన అన్న అడుగుజాడల్లో రంగ శ్రామిక వర్గ ప్రతినిధిగా ముందుకు వచ్చారు.

ఇటువంటి నేపథ్యంలో అట్టడుగు వర్గాల ప్రజలు ప్రబలంగా ఉండే కృష్ణలంక నుంచి మొట్టమొదటిసారి 1981 లో మునిసిపల్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేసి కార్పొరేటర్ గా గెలిచారు రంగ. బహుశా రాష్ట్ర చరిత్రలోనే అరుదుగా ఆ ఎన్నిక రంగ జైలు నుంచి పోటీ చేసి గెలిచారు. అక్కడితో తన రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన రంగ 1985 లో ఏకంగా విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గా కాంగ్రెస్ టికెట్పై గెలిచారు. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ వెన్నుపోటు పొడిచిన తదనంతరం జరిగిన ఎన్నిక అది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ సానుభూతి పవనాలు బలంగా వీస్తున్న తరుణం, ఇందిరా గాంధీ మరణాంతరం కాంగ్రెస్ దిక్కు తోచని స్థితిలో ఉన్న సందర్భం. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కు చరిత్ర లోనే అప్పటికి అత్యల్పం గా కేవలం 50 (మొత్తం 294) సీట్లు మాత్రమే వచ్చాయి. కోస్తా ఆంధ్రలో ఎన్నిక కాబడ్డ అతి తక్కువ మంది కాంగ్రెస్ ఎమ్మెల్యే ల్లో రంగ ఒకరు. ఎన్టీఆర్ సొంత గడ్డ, టిడిని ఖిల్లా గా పేరుగాం చిన కృష్ణ జిల్లా (నేడు ఎన్టీఆర్ జిల్లా గా నామ కరణ చేయబడ్డ జిల్లా) లో అంచనాలని తారుమారు చేస్తూ రంగ అసెంబ్లీ లోకి అడుగు పెట్టారు. 1985 నుంచి 1988 వరకు ఎన్టీఆర్ ప్రభుత్వం పలు నిర్ణయాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకుంది. అదే సమయంలో రంగ తన ప్రాబల్యాన్ని పెన్చుకుంటూ పోయారు. 1983, 85 లో వరుస పరాజయాలు చవిచూసిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం లో చుక్కాని లేని నావ అయ్యింది. అటువంటి నేపథ్యం లో రంగ తన మార్కు దూకుడు తో రాష్ట్ర కాంగ్రెస్ కి ఒక దిక్సూచిలా కనిపించరు. ఏ వర్గ పోరు అయితే విజయవాడ లో రంగ ఎదుగుదల కు ఊపిరి పోసిందో దాని ప్రతిబింబం రాష్ట్రానికి పాకింది. కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా రంగ వైపు చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. విజయవాడ కేంద్రంగా రాజకీయాలు చేసిన రంగ క్రమేపి రాష్ట్ర నాయకుడు అయ్యారు. వివిధ కారణాలు ఎత్తి చూపించి రాష్ట్రం లో మీడియా పై ఇనుప పట్టు సాధించిన వర్గాలు రంగ ని కేవలం ఒక “రౌడీ” గా చిత్రీకరించారు. తన ప్రస్తానం వెనుక ఉన్న సామాజిక , ఆర్థిక అంశాలను పూర్తిగా విస్మరిస్తూ కేవలం ఒక హింస దృక్కోణం లో ఆయన ని కర్కశుడు గా చిత్రించడం లో కృతకుత్యుల్లాయారు . రంగ తదనంతరం వారికి గిట్టని రాష్ట్ర నాయకులని చాలా మందిని అదే తరహాలో బదనాం చేయడం మనం ఎన్నో సందర్భాల్లో చూసాం, చూస్తున్నాం. అయితే ఆ మార్కు వ్యక్తిత్వ హననం రంగ తోనే మొదలయ్యింది అనేది వాస్తవం. రంగ ని రౌడీయిజం కి ప్రతీక గా చిత్రించడం ఆయన చేపట్టిన వర్గ సంఘర్షణ అంశాన్ని పక్కకు తోయడమే కాకుండా చరిత్ర ని వక్రీకరించడం అవుతుంది. ఆయన బ్రతికుండగా విజయవాడ, పరిసర ప్రాంతాల శ్రామిక కులాలకు చెందిన ప్రజలు ఆయనలో తమ నాయకుడు ని చూసారు. విజయవాడ నగరం లో పల్లెకారులు, ఆటో, రిక్షా కార్మికులు, టాక్సీ డ్రైవర్లు మొదలగు వర్గాలు ఆయనకి బాసట గా నిలిచారు . అటువంటి వాస్తవాలను తొక్కిపెడుతూ రంగ కేవలం కాపు నాయకుడు అని చెప్పడం కూడా తప్పే అవుతుంది. అన్ని కులాల వారు రంగ అనుచరులుగా ఉన్నారు, తరవాత కాలం లో పదవులు చేపట్టారు అనేది విదితం. రంగ హత్య తో రాష్ట్రం లో ఒక శకం అంతం అయ్యింది. బలవంతులు అయినా పెట్టుబడిదారి వర్గాలకు ఎదురు వస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి అని ఒక సందేశం సమాజంలోకి వెళ్ళింది. శ్రామిక వర్గాలు వోట్ బ్యాంకుగా ఉండడం తప్ప గద్దె వైపు కన్నెత్తి చూడకూడదు అనేది సారాంశం అయ్యింది. 1988 డిసెంబర్ లో జరిగిన రంగ హత్య అప్పటి ప్రభుత్వ ప్రమేయమో, అలసత్వమో లేకుండా నగరం నడిబొడ్డున పేద ప్రజల పట్టా భూమి కోసం నిరాహారదీక్ష చేస్తున్నపుడు జరగదు. విశ్లేషకులు, మేధావులు ఆ హత్యహని రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదం గానో, రౌడీ గ్యాంగ్ వార్ లో భాగంగా జరిగిన దాడి గానో అభివర్ణించే ప్రయత్నం చేసినా రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు దాన్ని అలా చూడలేదు. అందు వలెనే అప్పటికే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న టిడిపి ప్రభుత్వం రంగ హత్యానంతరం జరిగిన 1989 ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూసింది. కోస్తా ఆంధ్ర లో నేటికీ రంగ విగ్రహంలేని ఊరు ఉండదేమో అనేంత ప్రజాదరణ పొందిన వ్యక్తి రంగ. చిరస్మరీణయుడు గా ప్రజా చరిత్ర లోకి ఎక్కాడు రంగ.





డాక్టర్ జి నవీన్

రచయిత సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ రాజకీయాలకు సంబంధించిన వ్యాసాలను 20 సంవత్సరాలకు పైగా వివిధ వేదికలపై రాస్తున్నారు. అతను వృత్తిరీత్యా వైద్యుడు.

# భావజాల నిరక్షరాస్యత

## జైపాల్ రెడ్డి గ్రంథంపై కల్లూరి సునిశిత సమీక్ష

పుస్తకం సమాజానికి దర్పణం అంటుంటాం కానీ కొన్ని పుస్తకాలు ఈ నానుడికి సరిగ్గా అతికినట్టు సరిపోతాయి. అంతమాత్రమే కాక సమాజాన్ని దర్పణం లాగా దర్శించగలిగే శక్తిని ఇచ్చేవి బహు కొద్ది మాత్రమే. అటువంటి పుస్తకమే పేరెన్నికగన్న పార్లమెంటేరియన్ రాజకీయవేత్త ఎస్. జైపాల్ రెడ్డి గారు రాసిన 10 Ideologies అనే పుస్తకం. ప్రముఖ పాత్రికేయులు కల్లూరి భాస్కరం గారు ఈ పుస్తకాన్ని తెలుగులోకి తీసుకువచ్చి తెలుగు సమాజానికి గొప్ప మేలు చేశారనడంతోపాటు మన తెలుగువాడైన జైపాల్ రెడ్డిగారు ఎంతటి మేధావో మనకు పరిచయం చేశారని కూడా అనవచ్చు. మన మేధావులను మనం గుర్తించడంలో తెలుగువారిమి ఎప్పుడూ వెనుకబడి ఉంటామన్న స్పృహను కూడా కల్లూరి భాస్కరం గారు ఈ పుస్తకాన్ని అనువదించడం ద్వారా మనకు గుర్తు చేస్తున్నారు అనిపిస్తుంది. అంతటి విస్తృతమైన విషయపరిజ్ఞానం ఉన్న పార్లమెంటేరియన్లు మన భారత పార్లమెంటులో ఆసీనులై ఉండిన్నారన్న ఆనందాతిశయాన్ని కూడా కలిగిస్తుంది. ఆశ్చర్యం ఏంటంటే నలభై యేళ్ళ సుదీర్ఘమైన అనుభవమున్న పార్లమెంటేరియన్ గా ఎంతో పని ఒత్తిడిలో ఉన్న పదవుల్లో ఉంటూ కూడా ఇంతటి విస్తృతమైన అధ్యయనం చేయగల శక్తి, తపన జైపాల్ రెడ్డి గారి వ్యక్తిత్వంలో ఉండటం . ఈ గుణం ఆయనను ఒక అసాధారణ రాజకీయ వేత్తగా నిలబెట్టిందనడంలో సందేహం లేదు. "రాజకీయ మేధావి అన్న పదం ఈనాటి రాజకీయాల్లో ఒక విరోధాభాస(గా గుర్తింపబడుతున్నపుటికీ జైపాల్ రెడ్డి గారు దానిని తప్పని నిరూపించి మేధావులు రాజకీయాల్లో మనగలుగుతారని ఈ పుస్తకం ద్వారా చెప్పకనే చెప్పారు. అందువల్ల ఈ పుస్తకం మన రాజకియవేత్తలపై మనకు ఇచ్చే భరోసా కూడా. ఈరోజు రాజకీయాలు, రాజకీయ విమర్శలు, మీడియా- టీవీ డిబేట్ లు, సోషల్ మీడియా ఏది చూసినా "భావజాలం" అన్నది అప్రస్తుతంగా అప్రధానంగా మారిపోయినట్టు కనిపిస్తోంది. ఇది మనదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న పరిణామం. దీనివలన మన డిబేట్ లు ఆలోచనలు కేవలం నినాదం ప్రాయంగా భావోద్వేగాలతో నిండిపోతున్నాయి. దేశ పౌరుల్లో సామాజిక అవగాహన క్రమక్రమంగా మృగ్యమౌతున్న ఒక సంక్షోభ సందర్భంలో ఈ పుస్తకం ఒక దారి దీపంలా మనముందుకు వచ్చిందని చెప్పాలి. ఈ పుస్తకం నుండి తాను ఎంతగానో లబ్దిపొందానని మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారు కూడా భావించారంటే ఈ పుస్తకం ప్రస్తుత సామాజిక రాజకీయ జీవితానికి ఎంత అవసరమో తెలియజేస్తుంది.



జైపాల్ రెడ్డి గారి జయంతి సందర్భంగా

డాక్టర్ విరించి విరివింటి

# ఇరాన్ పై తదుపరి చర్యలు?

తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఇటీవలి కాలంలో ఇరాన్ ను కుదిపివేస్తున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ పై అమెరికా తాజా ఆంక్షలు, సైబర్ కార్యకలాపాల నుంచి దౌత్యపరమైన చర్చలు, సైనిక చర్య వరకు అనేక ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నది. వందలాదిమంది నిరసనకారులను మట్టుపెట్టడమే కాక యుఎస్ జోక్యం చేసుకుంటే ప్రతిచర్యలు తప్పవని తెహ్రాన్ హెచ్చరించిన నేపథ్యంలో, వాషింగ్టన్ ఒత్తిడి వ్యూహాలు వర్తింపచేయాలా, చర్చలా అనే సందిగ్ధంలో పడింది.

డిసెంబర్ చివరిలో ప్రారంభమైన ఈ అశాంతి, ఇస్లామిక్ రిపబ్లిక్ అధికారాన్ని సవాలు చేసే దేశవ్యాప్త ప్రదర్శనలుగా రూపాంతరం చెందింది.

ఇటువంటి అసహనాన్ని సహించని ఇరాన్ అధికారులు వందలాదిమంది నిరసనకారులను హతం చేస్తూ, ఇంటర్నెట్, మొబైల్ సమాచారానికి పరిమిత అందుబాటును కల్పిస్తూ ఉక్కుపాదంతో అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇరాన్‌లోని పరిస్థితి క్షీణిస్తున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విస్తృత ప్రతిస్పందనలను పరిశీలిస్తున్నారు. ఆర్థిక జరిమానాలు, సైబర్ కార్యకలాపాలు, దౌత్యపరమైన చర్చలు, సంభావ్య సైనిక చర్యలు అందులో ఉన్నాయి. తాజాగా ట్రంప్, ఇరాన్ నుంచి ఇంధనం కొనుగోలు చేసేవారిపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్టు ప్రకటించారు. ట్రంప్ జాతీయ భద్రతా బృందంలోని సీనియర్ సభ్యులు తదుపరి చర్యల కోసం మంగళవారం వైట్‌హౌజ్‌లో కలుసుకుని, చర్చించనున్నారు.

### ఇరాన్‌లో ఏం జరుగుతోంది?

క్షీణిస్తున్న దేశ ఆర్థిక పరిస్థితి జీవన వ్యయాన్ని పెంచ డమే కాదు జాతీయ కరెన్సీని బలహీనపరచడంతో డిసెంబర్‌లో ప్రజలు నిరసనలను ప్రారంభించారు. నేడు మనం చేస్తున్నది దానికి కొనసాగింపే. ఇరాన్ రియాల్ గత ఏడాదిలో తన విలువలో దాదాపు సగాన్ని కోల్పోయి, ఒక యుఎస్ డాలర్ విలువ దాదాపు ఒక మిలియన్ రియాళ్లగా మారిందని ఆర్థిక సంస్థల డేటా చెప్తోంది. ఆర్థిక కడగండ్లపై ప్రారంభమైన నిరసన, తర్వాత కాలంలో ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వానికి వ్యతిరేక విస్తృత ప్రదర్శనలుగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా అంతర్గతంగా ఉడుకుతున్న ఈ నిరసనలు అత్యంత విస్తృతమైనవి. ఈ అశాంతిని అణచివేసేందుకు ప్రభుత్వం సతమతమవుతోంది. ప్రదర్శనలను అణచివేసేందుకు భద్రతా దళాల మోహరింపును తెహ్రాన్ పెంచింది. యుఎస్‌లోని మానవ హక్కుల కార్యకర్తల న్యూస్ ఏజెన్సీ ప్రకారం 500 మందికి (మరో సమాచారం ప్రకారం 2500 మంది) పైగా వ్యక్తులను ప్రభుత్వం హతమార్చింది.



### ట్రంప్ వ్యాఖ్యలు ఏమిటి?

నిరసనలు ఉధృతం కావడంతో ఇరాన్‌పై ట్రంప్ కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శనకారులకు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తూ, ప్రాణాంతక దాడులు చేయవద్దంటూ తెహ్రాన్‌కు పదే పదే హెచ్చరించారు. గత శుక్రవారం అనేకమంది నిరసనకారులను హతం చేశారన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో, ఇరాన్ చాలా సమస్యలో ఉందని, కాల్పులు జరపడం ప్రారంభించవద్దు, ఎందుకంటే మేం కూడా కాల్పులు ప్రారంభిస్తామంటూ హెచ్చరించారు.ఎక్కడ నొప్పి కలుగుతుందో అక్కడ కొడతాం. అలా అని మా సేనలు ప్రత్యక్షంగా అక్కడ చర్యలు చేపడతారని కాదు, దాని అర్థం వారికి అత్యంత బాధకలిగే చోట కొడతాం అని పేర్కొన్నారు. నిరసనకారులను చంపడాన్ని అధికారులు కొనసాగిస్తే ఇరానియన్లను కాపాడేందుకు యునైటెడ్ స్టేట్స్ వస్తుందని శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. బహశ ఎన్నడూ లేనంతగా స్వేచ్ఛ కోసం ఇరాన్ చూస్తోంది. వారికి సాయపడేందుకు అమెరికా సంసిద్ధంగా ఉంటుంది అని ఆయన అన్నారు. ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్న దేశాలపై నూతన ఆర్థిక సుంకాలు విధించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు సోమవారం ట్రంప్ ప్రకటించారు.

ఒక ఆన్‌లైన్ పోస్టులో,అమెరికాతో ఏదో ఒక వ్యాపారం చేస్తూనే, ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్న ఏ దేశంపైన అయినా 25 శాతం సుంకాలు వర్తింపచేస్తామని అన్నారు. ఇరాన్‌పై ట్రంప్‌కు గల ప్రత్యామ్నాయాలు ఏమిటి? ఒక వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ, సీనియర్ ఇరాన్ అధికారులపై అదనపు ఆంక్షలు, ఇరాన్ ఇంధనం, బ్యాంకింగ్‌పై పరిమితులు విధించాలన్న ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నామని ఒక యుఎస్ అధికార ప్రతినిధి తెలిపారు. కేవలం ఆర్థిక వత్తిడి మాత్రమే కాక దాని ఆవల కూడా అనేక సంభావ్య చర్యల జాబితా ఉందని మాజీ యుఎస్ అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రత్యామ్నాయాలలో ఇరానియన్ నాయకు లను లేదా నిరసనలను హింసాత్మకంగా అణచివేయడంతో సంబంధం కలిగిన భద్రతా సదుపాయాలపై దాడుల నుంచి భారీ స్థాయి సైనిక చర్యల వరకు అనేకం ఉన్నాయి.

డిఎ



# జాతీయం- అంతర్జాతీయం



## బ్రిక్స్ అధ్యక్ష పదవి స్వీకరించిన భారత్




**న్యూఢిల్లీ :** బ్రిక్స్ 2026 అధ్యక్ష పదవిని భారత్ మంగళవారం స్వీకరించింది. ఈ సందర్భంగా బ్రిక్స్ అధికారిక వెబ్‌సైట్, థీమ్, లోగోను కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ప్రారంభించారు. బ్రిక్స్‌కు నాయకత్వం వహిస్తున్న భారత్ 'మానవత్వమే ముందు', 'ప్రజా కేంద్రీకృత విధానం'ను అవలంభిస్తుందని ఈ సందర్భంగా జైశంకర్ తెలిపారు. బ్రిక్స్‌కు నాయకత్వం వహిస్తున్న దేశంగా భారత్ ఈ గ్రూపులోని సభ్య దేశాల సామర్థ్యాన్ని, మరింతగా ప్రపంచ సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తుందని జైశంకర్ తెలిపారు.

ఈ ఏడాదికి బ్రిక్స్ ప్రారంభమై 20 ఏళ్లు పూర్తవుతాయని మంత్రి తెలిపారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఈ గ్రూపు ఒక ముఖ్యమైన వేదికగా అభివృద్ధి చెందిందని చెప్పారు. బ్రిక్స్‌కు భారత్ అధ్యక్షత వహించడం ఇది నాల్గోసారి. చివరిసారిగా 2021లో అధ్యక్ష పదవిని చేపట్టింది. బ్రిక్స్ 2026 లోగోగా కమలం పువ్వును ఎంపిక చేశారు. ఇందులో మధ్య భాగాన్ని 'నమస్తే' భంగిమలో రూపొందించారు.

## సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు, పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి –సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత, మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.





## నూరు శాతం విద్యుదీకరణ ఒట్టిదే

**న్యూఢిల్లీ :** దేశంలో వంద శాతం విద్యుదీకరణ సాధించామంటూ నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న వాదనల్లో వాస్తవం లేదని కాగ్ తేల్చింది. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఉద్దేశించిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, ప్రధానమంత్రి సహజ్ బిజిలీ ఘర్ యోజన (సౌభాగ్య) పథకాలలో అనేక లోపాలు ఉన్నాయని తెలిపింది. దేశంలో మూడు కోట్ల గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని మార్గదర్శకాలలో తెలిపారని, అంచనాలను 248.48 లక్షల గృహాలకు కుదించారని ఎత్తిచూపింది. దీని ఆధారంగానే 2019 మార్చి నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించానని ప్రభుత్వం చెప్పుకుంది. రాష్ట్రాల్లో కొత్తగా నిర్మితమవుతున్న గృహాలను సౌభాగ్య పథకం కింద చేర్చలేదని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆడిటర్‌కు తెలియజేసిన విషయాన్ని కాగ్ గుర్తు చేసింది. కాగ్ తన పరిశీలనలో డూప్లికేట్ క్లెయిములను కూడా గుర్తించింది. ఫీడర్ విభజన పనిని (వ్యవసాయ ఫీడర్లను వ్యవసాయేతర ఫీడర్ల నుంచి వేరుచేయడం) డిడియుజిజివై కింద పూర్తిగా చేపట్టలేదని తెలిపింది. విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి 2014 డిసెంబరులో డిడియుజిజివైని ప్రారంభించగా, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేని అన్ని ప్రాంతాలకూ కనెక్షన్లు ఇవ్వడానికి 2017 అక్టోబరులో సౌభాగ్య పథకాన్ని చేపట్టారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కాగ్ తన నివేదికను ప్రవేశపెట్టింది.

## అబూసలేంకి 14 రోజులు పెరోల్ సాధ్యం కాదు



**ముంబయి :** 1993 వరుస బాంబు పేలుళ్ల కేసులో దోషి అబూసలేంకి 14రోజుల పెరోల్ సాధ్యంకాదని మహారాష్ట్ర ప్రభుత్వం మంగళవారం బాంబే హైకోర్టుకి తెలిపింది. అతను అంతర్జాతీయ నేరస్తుడు అయినందున పోలీసుల ఎస్కార్ట్‌తో రెండు రోజుల పెరోల్ మంజూరు చేయవచ్చని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంఖువర్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. అయితే ఖర్చును ఆయనే భరించాల్సి వుంటుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌కు ప్రయాణించాల్సి వున్నందున రెండు రోజులు సరిపోవని సలేం న్యాయవాది ఫర్హాన్‌షా పేర్కొన్నారు. అతను ఇరవై సంవత్సరాలకు పైగా జైలులోనే ఉన్నారని, అత్యవసర పెరోల్ కోరుతున్నారని, పోలీస్ ఎస్కార్ట్ కూడా అవసరం లేదని అన్నారు. సలేం కూడా భారతీయ పౌరుడని పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో తన సోదరుడు అబూ హకీం అన్సారీ మరణించాడని, పెరోల్ జారీ చేయాలంటూ సలేం డిసెంబర్‌లో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే కోర్టుకి క్రిస్మస్ సెలవులు కావడంతో విచారణ ఆలస్యమైంది. 14రోజుల పెరోల్‌పై తమ స్పందన తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని గతవారం జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ శ్యామ్ చంద్రక్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించిన సంగతి తెలిసిందే.

## ఇరాన్‌ను వీడండి

### భారతీయులకు విదేశాంగశాఖ సూచన

**టెహ్రాన్ :** ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో.. అక్కడి భారత రాయబార కార్యాలయం ఆ దేశంలో ఉంటున్న మన పౌరులను అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచిందింది. మరోవైపు భారత విదేశాంగశాఖ సైతం.. తదుపరి నోటీసు ఇచ్చే వరకు ఆ దేశానికి ప్రయాణించొద్దని సూచించింది. "స్థానికంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలి. భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు కార్డులు సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎంబసీలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలి'' అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది.



## 29 మంది మావోయిస్టులు

- లొంగిపోయిన డీఏకేఎంఎస్ నేత పొడియం బుద్రా
- ఆయుధాలతో సరెండర్

**సుక్మా :** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎంఎస్) నేత పొడియం బుద్రాతో పాటు డీఏకేఎంఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుద్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది.

మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్బా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్టైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు.





# ట్రెయిన్‌పై కూలిన క్రేన్

- 29 మంది మృతి.. మరో 30 మందికి పైగా తీవ్ర గాయాలు
- హై-స్పీడ్ రైలు వంతెన నిర్మాణ పనులే ప్రమాదానికి కారణం

**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్‌లో బుధవారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాట్చథానీ వెళ్తున్న ఒక ప్యాసింజర్ రైలుపై భారీ క్రేన్ ఒక్కసారిగా తెగిపడింది. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న నఖోన్ రాట్చసిమా ప్రావిన్స్‌లోని సిఖియు జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9:00 గంటలకు ఈ ఘటన జరిగింది. క్రేన్ కూలిన ధాటికి రైలు పట్టాలు తప్పడమే కాకుండా, మంటలు కూడా చెలరేగాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో 22 మంది మృతిచెందారని ప్రాథమికంగా తెలుస్తోంది.

ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించిన అధికారులు.. ఆ ప్రాంతంలో జరుగుతున్న హై–స్పీడ్ రైలు వంతెన నిర్మాణ పనులే ఈ ప్రమాదానికి దారి తీశాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద క్రేన్ అదుపు తప్పి కదిలే రైలుపై పడటంతో ఈ ఘోర ప్రమాదం సంభవించిందన్నారు. థాయ్ ప్రభుత్వం తన అధికారిక 'ఎక్స్'ఖాతా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. సిఖియు ప్రాంతంలో రైలు పట్టాలు తప్పి, మంటలు వ్యాపించాయని, ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారని తెలిపింది.

ఈ ఘోర ప్రమాదంలో ప్రాణనష్టం భారీగా ఉన్నట్లు ఏఎఫ్పీ (ఏఎఫ్‌పీ) వార్తా సంస్థ తెలిపింది. తొలుత మరణాల సంఖ్య 12గా భావించినప్పటికీ, నఖోన్ రాట్చసిమా ప్రావిన్షియల్ పోలీస్ చీఫ్ థాచ్చపోన్ చిన్నవాంగ్ అందించిన తాజా సమాచారం ప్రకారం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రైలు బోగీల్లో ఇంకా పలువురు చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని, రైలులో చెలరేగిన మంటలను అదుపులోకి తెచ్చింది. ప్రస్తుతం పలు సహాయక బృందాలు రంగంలోకి దిగి, బోగీల్లో చిక్కుకున్న బాధితులను వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇరాన్‌లో మరో 4 రోజులు ఇంటర్‌నెట్ కట్



**టెహ్రాన్ :** దేశంలో మరో నాలుగు రోజుల పాటు ఇంటర్‌నెట్‌పై నిషేధాన్ని విధిస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అయితే విదేశాలకు తమ మొబైల్స్ ద్వారా ఫోన్ కాల్స్ చేసుకోవడానికి అనుమతించింది. ఉగ్రవాద చర్యల కారణంగానే ఈ చర్యలు తీసుకున్నామని విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచి తెలిపారు. కరెన్సీ తీవ్రంగా పతనమై ఆర్థిక ఇబ్బందులు తీవ్ర సంక్షోభంగా మారిన నేపథ్యంలో తొలుత ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు రానురాను ప్రభుత్వ మార్పు కోసం నినదించే పోరాటంగా మారుతున్నాయి. ఆందోళనకారులతో చేతులు కలపాల్సిందిగా ఇరాన్ భద్రతా బలగాలకు ఇరాన్ మాజీ మహారాణి మంగళవారం విజ్ఞప్తి చేసింది. ఈ పరిస్థితుల్లో ఆందోళనలకు దిగేవారిపై తీసుకుంటున్న కఠిన చర్యలపై అంతర్జాతీయంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. పలు దేశాలు ఇప్పటికే ఇరాన్ రాయబారులకు నోటీసులు జారీ చేశాయి. ఆందోళనకారులతో ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా వుందని మంత్రి తెలిపారు. దేశంలో ప్రస్తుతం చెలరేగుతున్న ఈ నిరసనలకు విదేశీ శక్తుల నుండి వచ్చిన ఆదేశాలే కారణమని అందుకే తాము చర్యలు తీసుకోవాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. కాగా ఇప్పటివరకు ఇరాన్‌లో చోటు చేసుకున్న ఈ నిరసనల్లో 2వేల మందికి పైగా మరణించినట్లు అధికారులు తెలిపారు. తీవ్రవాద చర్యలే ఈ మరణాలకు కారణమని ప్రభుత్వం తెలిపింది. మరోవైపు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వోల్కర్ టుర్క్ ఇరాన్‌లో పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆందోళన కారులపై హింసాకాండను ఆపాలని కోరారు.

## ఇమ్రాన్‌ను కలవనివ్వండి..

### ఖురాన్‌తో సోదరిల నిరసన



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యవహారం మరోసారి ఆ దేశంలో చర్చనీయాంశమయ్యింది. ఆయనను కలవడానికి ఎవరికీ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో వారి కుటుంబసభ్యులతో పాటు ఆయన మద్ధతుదారులు నిరసనలు చేపడుతున్నారు. తాజాగా ఇమ్రాన్ సోదరిలు అడియాలా జైలు బయట ధర్నా చేపట్టారు.

కొద్దిరోజుల క్రితం పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యవహారం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాఫిక్‌గా మారింది. ఆయనను జైలులోనే చంపేశారు అని పుకార్లు రావడంతో ఇమ్రాన్ వ్యవహారం తీవ్ర వివాదాస్పదమైంది. ఆయన కుటుంబసభ్యులతో పాటు పీటీఐ మద్దతుదారులు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. దీంతో ఎట్టకేలకు అక్కడి ప్రభుత్వం ఆయనను కలవడానికి అనుమతిచ్చింది. దీంతో ఆయన సోదరి డా.ఖానుమ్ ఆయనను జైలులో కలిసింది. దీంతో ఆయన బ్రతికే ఉన్నాడని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే తాజాగా మరోసారి ఇమ్రాన్ వ్యవహారం పాక్‌లో చర్చనీయాంశమైంది. ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశాల ప్రకారం మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను కలవడానికి మంగళ,గురువారాల్లో అనుమతి ఇవ్వాలి. అయితే ఈ ఆదేశాలను అక్కడి అధికారులు పాటించడం లేదు. ఆయనను కలవడానికి వారి సోదరిమణులు ఆలీమాఖాన్, ఉజ్మా ఖాన్‌లను వారిని కలవడానికి అనుమతించడం లేదు. దీంతో వారు జైలు బయిట ఆందోళన చేపట్టారు.

దీంతో వారు జైలు బయట ఖురాన్ చదువుతూ నిరసన చేపట్టారు. ఇమ్రాన్ సోదరి ఆలీమా ఖాన్ మాట్లాడుతూ.. మేము ఇక్కడ ఖురాన్ చదవడం పూర్తి చేస్తామని వారు భయపడుతున్నారు. ఎటువంటి మనుషులు వారు. అడియాలాకు వెళ్లే దారులన్నీ నిర్బంధించారు. అని ఆమె తెలిపారు. అయితే మంగళ,గురువారాల్లో ఇమ్రాన్‌ను కలవడానికి అనుమతులివ్వాలని కోర్టు చెప్పడంతో ఆ రోజుల్లో అడియాలా జైలు ఎదుటు పెద్దఎత్తున నిరసనలు జరుగుతున్నాయని అక్కడి అధికారులు తెలిపారు.

## పాలస్తీనా రచయిత్రిపై వేటు



**అడిలైట్ :** పాలస్తీనా రచయిత్రి రండా అబ్దుల్ ఫత్తాపై అడిలైడ్ ఫెస్టివల్ వేటు వేసింది.దీనిపై నిరసనలు వెల్లువెత్తడంతో ఆస్ట్రేలియాలో జరిగే ప్రముఖ ఆర్టస్ ఫెస్టివల్ సామూహిక బహిష్కరణ ముప్పును ఎదుర్కొం టుంది. అడిలైడ్ ఫెస్టివల్ నుంచి వైదొగులుతున్నట్టు వందమందికి పైగా రచయితలు, చైర్‌పర్సన్‌తో సహా నలుగురు బోర్డు సభ్యులు, ఒక స్పాన్సర్ ప్రకటించారు. బోండి బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటన నేపథ్యంలో ఫెస్టివల్‌కు రండా అబ్దుల్ ఫత్తా ఆహ్వానాన్ని రద్దు చేసినట్టు నిర్వహకులు ప్రకటించిన తరువాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని అడిలైట్ ఫెస్టివల్ కూడా ధ్రువీకరించింది. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 15 వరకూ ఈ అడిలైట్ ఆర్టస్ ఫెస్టివల్ జరగనుంది. ఈ ఫెస్టివల్‌లో బోర్డు సభ్యులతో పాటు, మరో 124 మంది రచయితలు పాల్గొనవల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ వీరిలో 100 మందికి పైగా ఈ ఫెస్టివల్‌ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. మిగిలినవారు కూడా ఈ ఫెస్టివల్‌లో పాల్గొనడం అనుమానమే అని స్థానికులు చెబుతున్నారు. రండా అబ్దుల్ ఫత్తాకు ఆహ్వానాన్ని రద్దు చేయడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే, ఈ నిర్ణయాన్ని రండా అబ్దుల ఫత్తా కూడా ఖండించారు. ఈ నిర్ణయాన్ని పాలస్తీనా వ్యతిరేక జాత్యహంకారం, సెన్సార్ షిప్ నీచమైన చర్యగా ఆమె విమర్శించారు. నిర్వాహకుల నిర్ణయాన్ని ప్రముఖ స్వతంత్ర థింక్ ట్యాంక్, స్పాన్సర్లలో ఒకటైన ఆస్ట్రే లియా ఇనిస్టిట్యూట్ తీవ్రంగా వ్యతిరేకిం చింది. ఈ కార్యక్రమ స్పాన్సర్‌గా వైదొలు గుతున్నట్లు ప్రకటించింది. నిర్వహకుల నిర్ణయాన్ని వికారమైన రాజకీయాలుగా ఖండించింది.

## అమెరికా రాష్ట్రంగా గ్రీన్‌ల్యాండ్

### కాంగ్రెస్ సభ్యుడు ర్యాండీ ఫైన్ కీలక బిల్లు



**వాషింగ్టన్ :** గ్రీన్‌ల్యాండ్ స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో కాంగ్రెస్ సభ్యుడు ర్యాండీ ఫైన్ కీలక బిల్లును ప్రవేశపెట్టారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుని దానిని అమెరికాలో చివరి రాష్ట్రంగా చేర్చుకోవాలన్న బిల్లును ప్రతిపాదించారు. ఈ మేరకు గ్రీన్ ల్యాండ్ స్వాధీనం, రాష్ట్ర హోదా చట్టాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలోకి తీసుకురావడానికి అవసరమైన అన్ని మార్గాలను అనుసరించడానికి అమెరికా అధ్యక్షుడికి అధికారం ఇచ్చే చట్టంగా తెలిపారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా జాతీయ భద్రత కోసం ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టు చెప్పుకొచ్చారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ వాదనతో ఏకీభవించినట్టు తెలిపారు. గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆర్కిటిక్ ప్రాంతాన్ని నియంత్రించకుండా మన శత్రువులను నిరోధించవచ్చు. ఇంకా రష్యా, చైనా నుంచి మన ఉత్తర ప్రాంతాన్ని రక్షించుకోవచ్చు'' అని ర్యాండీ ఫైన్ చెప్పారు. సంవత్సరాలుగా అనుసరిస్తున్న బలహీనమైన విధానాలు ఆర్కిటిక్‌లో అమెరికా వ్యూహాత్మక స్థానాన్ని క్షీణింపజేశాయని అభిప్రాయపడ్డారు. "గ్రీన్‌ల్యాండ్ మనం విస్మరించగల సుదూర ప్రాంతం కాదు. ఇది చాలా ముఖ్యమైన జాతీయ భద్రతా ఆస్తి. గ్రీన్‌ల్యాండ్‌ను ఎవరు నియంత్రిస్తారో వారు అతి కీలకమైన ఆర్కిటిక్ షిప్పింగ్, అమెరికాను రక్షించే భద్రతా నిర్మాణాన్ని నియంత్రిస్తారు. భవిష్యత్తును, మన భద్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నించే వాటిని అమెరికా ఇలా వదిలివేయకూడదు'' అని కాంగ్రెస్ సభ్యుడు ర్యాండీ ఫైన్ అన్నారు.

## టారిఫ్‌లు ఆపితే నా దారులు నాకున్నాయ్

### సుప్రీం తీర్పునకు ముందు ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ విధానాలపై అక్కడి సుప్రీంకోర్టు తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందించారు. ఒకవేళ తాను విధించిన సుంకాలను న్యాయస్థానం అడ్డుకుంటే.. ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతామని ఆయన వెల్లడించారు. "చైనా ప్రయోజనాలకు మద్దతు కల్పించే ఉద్దేశంతోనే కొందరు ఈ టారిఫ్‌లను సవాల్ చేస్తూ కేసులు వేశారు. ఒకవేళ కోర్టు సుంకాలను వ్యతిరేకిస్తే మా ప్రభుత్వం కచ్చితంగా ప్రత్యామ్నాయ అవకాశాలను అన్వేషిస్తుంది. నేను విధించిన టారిఫ్‌ల వల్ల తక్కువ సమయంలోనే ఫెడరల్ బడ్జెట్ ద్రవ్యలోటు 27శాతం వరకు తగ్గింది. ఈ సుంకాల వల్ల అమెరికాలో వినిమయ ఖర్చులు పెరిగాయని విమర్శకులు అంటున్నారు. అది నిజం కాదు. ఈ టారిఫ్‌లను విదేశాలే చెల్లిస్తున్నాయి. అమెరికాలోని కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యా ఉండదు. ఈ విషయంలో నేను తీసుకున్న నిర్ణయం సరైందే'' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే పలు దేశాలపై సుంకాల బాదుడు మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా న్యాయస్థానాల్లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అగ్రరాజ్య సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. దీనిపై న్యాయస్థానం (అమెరికా కాలమానం ప్రకారం) తీర్పు వెలువరించనుంది. టారిఫ్‌ల విషయంలో ట్రంప్ అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని అతిక్రమించారా? లేదా? అనేది కోర్టు నిర్ణయించనుంది. ఈ క్రమంలోనే గత కొన్ని రోజులుగా ట్రంప్ వరుసగా పోస్టులు పెడుతున్నారు. తాను విధించిన సుంకాలను సుప్రీంకోర్టు కొట్టేస్తే తీవ్ర ఇబ్బందుల్లో ఇరుక్కుంటామని, ఇప్పటివరకు వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించడం అసాధ్యమని ఆయన అన్నారు.

### హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ 85వ అఖిల భారత కళా ప్రదర్శనలో

# కళాకారుడికి గుర్తింపు

**వుదయం, సిద్దిపేట :**
హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే 85వ అఖిల భారత వార్షిక కళా ప్రదర్శన–2026 ఈ నెల 12వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ చిత్రకారులు తమ కళా కృతులను ప్రదర్శించారు.ఈ ప్రతిష్టాత్మక కళా ప్రదర్శనలో సిద్దిపేటకు చెందిన కళాకారుడు సామలేటి మహేష్ తీసిన పల్లె జీవనాన్ని ప్రతిబింబించే చిత్రం ప్రదర్శనకు ఎంపిక కావడం విశేషం. గ్రామీణ సంస్కృతి, జీవన విధానాన్ని అద్భుతంగా ప్రతిబింబించిన మహేష్ ఫోటోగ్రఫీ సందర్శకులను ఆకట్టుకుంటోంది.మహేష్ ప్రదర్శించిన చిత్రాన్ని తెలంగాణ రాష్ట్ర



ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, జే. వెంకటేశ్వర్లు, ప్రముఖ కళాకారులు కంది నరసింహులు, రాజేందర్, అనంతయ్య, సత్య గన్నోజు, మధు తదితర ప్రముఖులు తిలకించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖ చిత్రకారులు మహేష్ ఫోటోగ్రఫీపై ప్రశంసలు కురిపిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన కళా కృతులు అందించాలని ఆకాంక్షించారు.ఈ అఖిల భారత వార్షిక కళా ప్రదర్శన ఈ నెల చివరి వరకు కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు. కళాభిమానులు, విద్యార్థులు, చిత్రకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

# శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో మంత్రి కొండ సురేఖ

**ఐనవోలు, వుదయం :**
భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండ సురేఖకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. తీర్థ–ప్రసాదాలు సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి మౌలిక వసతులు సమృద్ధిగా అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ...భోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఐనవోలు ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, బ్రహ్మోత్సవాలు, జాతరల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని స్పష్టం చేశారు.బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ...భోగి పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు.ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



చేయడం అభినందనీయమన్నారు. భోగి పండుగ పాత కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, వర్ధన్నపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు

## బూర్గుపల్లి మాజీ సర్పంచ్ బాబు రావుకు ఘన నివాళులు



**వుదయం , సిద్దిపేట :**
సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ నివాళ్ళుహార్పిచారుసిద్దిపేట అర్బన్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,

బూర్గుపల్లి మాజీ సర్పంచ్, సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్యులు ఆనంతుల మదన్ మోహన్ ముఖ్య అనుచరులైన బాబు రావు, అకాల మరణం పట్ల సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గౌరవ పూజల హరికృష్ణ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాబు రావు పార్థివ దేహాన్ని సందర్శించిన పూజల హరికృష్ణ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాబు రావు గారు గత 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందించిన నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. ఎన్నో కష్టాలు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పార్టీని వీడకుండా, మాజీ మంత్రి ఆనంతుల మదన్ మోహన్ గారి వెంట ముఖ్య అనుచరుడిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందించారని తెలిపారు.బాబు రావు సేవలను కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ గుర్తించుకుంటుందని, బూర్గుపల్లి గ్రామ సర్పంచ్‌గా అవినీతి లేని పాలన అందిస్తూ ప్రజలకు ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. ఆయన అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు.ఈ కష్ట సమయంలో బాబు రావు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని పూజల హరికృష్ణ గారు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కలీముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి , బూర్గుపల్లి సర్పంచ్ బాలయ్య, గ్రామ అధ్యక్షుడు కనకయ్య, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని బాబు రావు ఘన నివాళులు అర్పించారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

*జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ*

**జయశంకర్ భూపాలపల్లి ,వుదయం :**
మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్యపుష్కరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, అంత్య పుష్కరాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత పుష్కరాలలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.

సరస్వతి అంత్యపుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 30.16 కోట్ల నిధులను మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.



సంబంధిత శాఖల అధికారులు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు పంపించాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ సరస్వతి అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన బందోబస్తు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రత వంటి అంశాలపై ముందుగానే ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని తెలిపారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక రహదారి మార్గాలను పరిశీలిస్తున్నామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.
వాహనాల పార్కింగ్ సమస్యలు నివారించేందుకు మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాలను గుర్తించామని, ప్రైవేట్ వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూ సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్యపుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే “కాళేశ్వర ఖండం” అనే పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. పీఠాధిపతులు, హారతి, ఇతర తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్,రూపొందించాలని సూచించారు.అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక అనుభూతిని అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మాయం సింగ్,కాటారం డి.ఎస్.పి.సూర్యనారాయణ,మహాదేవపూర్ తాసిల్దార్ రామారావు,ఎంపీడీవో,రవీంద్రనాథ్,సీఐ వెంకటేశ్వర్లు,
ఇరిగేషన్, ఎ.ఈ. మెరుగు రవీందర్, కాలేశ్వరం దేవస్థానం ఈవో తోపాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లోక కళ్యాణార్థం హిజ్రాల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లికి బోనాలు

**వుదయం , సిద్దిపేట :**
సంక్రాంతి పీడ దినాల కారణంగా ప్రజలకు ఎలాంటి చెడు జరగకూడదనే ఆకాంక్షతో హిజ్రాల ఆధ్వర్యంలో ఇంద్రమ్మ కాలనీ నుండి ఎల్లమ్మ తల్లికి బోనాలు తీశారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్రాంతి పండుగ సమయంలో పీడ దినాలు ఉంటాయని ప్రజల్లో గాఢమైన విశ్వాసం ఉంది. ఈ నేపథ్యంలో పీడ దినాల్లో ప్రజలకు హాని కలగకుండా, గ్రామాల్లో శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం నెలకొనాలని లోక కళ్యాణార్థం ఈ బోనాల కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హిజ్రాల అధ్యక్షురాలు సునీత తెలిపారు.
ఈ సందర్భంగా డప్పుల వాయిద్యాలు, ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో అమ్మవారి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతాలు భక్తిమయంగా మారాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఎల్లమ్మ తల్లి దీవెనలు



పొందారు.ఈ కార్యక్రమంలో రజిని, ప్రశాంతి, కరిష్మా, అంకిత, చిన్నారి నవీన్, కళ్యాణి తదితరులు పాల్గొని బోనాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. హిజ్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బోనాల వేడుక ప్రజల నుంచి విశేష ఆదరణ పొందింది.

## నిజంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన సినార్గోస్ ఇంటర్నేషనల్ ఎన్జీవో బృందం

**నిజాంసాగర్, వుదయం :**
ఇథియోపియా నీటిపారుదల మంత్రిత్వశాఖ, సినర్గోస్ ఇంటర్నేషనల్ ఎన్జీవో నుంచి 6 మంది సభ్యుల బృందం బుధవారం నిజాంసాగర్ ప్రాజెక్ట్ ని సందర్శించారు. ఇందులో భాగంగా వారు ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణ, విపత్తు నిర్వహణ, ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు. ఈ వివరాలని, సూపరింటెండెంట్ ఇంజనీర్ దక్షిణామూర్తి, ఎజిక్యూటివ్ ఇంజనీర్ సాల్మాన్, ఇతర ఇంజనీర్ల బృందం వివరించారు. బొగ్గుగుడిసే వద్ద నీటి పారుదల కాలువను పరిశీలించి, వివరాలు తెలిపినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ 6 మంది సభ్యుల బృందం స్కైడైవ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ఎల్ నారాయణ, డైరెక్టర్ రఘు కిరణ్, ప్రోగ్రామ్ మేనేజర్ వరప్రసాద్ సౌజన్యంతో వర్కింగ్ ఆఫ్ ఇరిగేషన్ సెక్టార్ అండ్ వాటర్ మేనేజ్మెంట్ అనే ఇంటర్నేషనల్ స్టడీ అండ్ ఎక్స్పోజర్ విజిట్ ప్రోగ్రామ్ లో భాగంగా సందర్శించారు.





### గట్టు మండల కేంద్రంలో

# సంక్రాంతి ముగ్గుల పోటీలు

**గద్వాల ,వుదయం:**
జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో సర్పంచ్ ఎం నాగరాజు ఆధ్వర్యంలో బుధవారంరోజు నిర్వహించిన సంక్రాంతి ముగ్గులపోటీల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనగట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్ముగ్గులను తిలకించి మహిళ సోదరీ మణులను అభినదించి విజేతలకు బహుమతులు ప్రధానంచేశారు. ఈ సందర్భంగా గట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్ మాట్లాడుతూ సంక్రాంతి సంబురాలలో మహిళ సోదరీ మణులు భాగస్వాములు కావడం అభినం దనీయం అని మన సంస్కృతీ సంప్రదా యాలను సంక్రాంతి పండుగ విశిష్టతను నేటి తరంవారికి తెలియచేయడం ఈ ముగ్గుల పోటీ ప్రత్యేకత అని సంక్రాంతి ముగ్గు ల పోటీలు నిర్వహించడంచాలా అభినం దనీయమని గట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్ తెలియజే శారు సంక్రాంతివాతావరణం ముందే వచ్చి నట్టు కనిపిస్తుం



దని,సంక్రాంతి పండు గను పల్లె వాతావరణంను ప్రతిబించేలా ఈ ము గ్గులు ఎంతగానో గొప్పగా వర్ణించారు సంక్రాంతి పర్వదినంను ప్రతి బించేలా చిత్రపటంతో కూడిన వేసిన ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని వాటిని వేసిన వారిని ప్రత్యేకంగా అభినదించడం జరిగి నది అదేవిధంగా చూడచక్కని ముగ్గులు వేయడం చాలా గొప్ప విషయం అని ఈసం దర్భంగా గట్టు మండల కేంద్రంలో స్థానిక ప్రజలకు గట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనాథ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించిన బృందాన్ని మరి మహిళ కమిటీ సభ్యులను గట్టు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు శ్రీనాథ్ ప్రత్యేకంగా అభి నందించారు ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజనమ్మ వార్డ్ మెంబర్ జి లక్ష్మి కంగారు తిమ్మప్ప రొల్లి కృష్ణ టీ.శంకరయ్య రాము. కె.రాము గ్రామ పెద్దలు మహిళలు చిన్నారులు యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు

## పత్రిక ప్రజలకు – ప్రభుత్వానికి వారధి లాంటిది



*విజన్ ఆంధ్ర పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించినఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిఎమ్మెల్యే విజయుడు*

**గద్వాల ,వుదయం :**
బుధవారం చల్లా కార్యాలయంలో విజన్ ఆంధ్ర తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక సమాజంలో ఒక శక్తివంతమైన సమాచార మాధ్యమంగా పనిచేస్తుందని, ప్రజల సమస్యలను, ఆశయాలను, అవసరాలను ప్రభుత్వానికి చేరవేయడంలో పత్రిక కీలక పాత్ర పోషిస్తుందని, అలాగే ప్రభుత్వం తీసుకునే విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించి తెలియజేయడంలో కూడా పత్రిక వారధిగా నిలుస్తుంది.గ్రామ స్థాయి సమస్యల నుండి రాష్ట్ర, జాతీయ స్థాయి అంశాల వరకు ప్రజల గళాన్ని పత్రిక బలంగా వినిపిస్తుంది. నిర్లక్ష్యానికి గురైన సమస్యలను వెలుగులోకి తీసుకు వచ్చి, ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడంలో పత్రిక ప్రభావవంతమైన పాత్రను నిర్వహిస్తుంది. ఇదే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని, వాటి వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించడం ద్వారా అపోహలను తొలగిస్తుంది.ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగవ స్థంభంగా పత్రిక వ్యవహరించుతూ, ప్రజలు–ప్రభుత్వం మధ్య నమ్మకాన్ని పెంపొందిస్తుంది. నిజాయితీగల వార్తలతో, నిర్మాణాత్మక విమర్శలతో ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచుతుంది. అదే సమయంలో ప్రజలను చైతన్యవంతులుగా మార్చి, తమ హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కల్పిస్తుంది
.అందువల్ల పత్రిక కేవలం వార్తలు అందించే సాధనం మాత్రమే కాకుండా, ప్రజల స్వరం ప్రభుత్వానికి చేరవేసే వారధిగా, ప్రభుత్వ ఆలోచనలను ప్రజలకు చేరవేసే దూతగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ ఆంధ్ర స్టాఫ్ రిపోర్టర్ టి.వీరన్న, బి.కె. సురేష్, బి అర్ ఎస్ పార్టి సినియార్ నాయకులు,వావిలాల రంగరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి సంబరాలు



**మధిర, వుదయం :**
మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ సభ్యులందరూ చెరువు కట్ట మైసమ్మ స్విమ్మింగ్ గాటు వద్ద ఘనంగా భోగి సంబరాలు నిర్వహించారు.మహిళలందరూ ముగ్గులతో అలంకరించి భోగి మంటలు వెలిగించి పిల్లలు పెద్దలు ఆనందోత్సవాలతో అందరూ కలిసి నృత్యాలు చేస్తూ సంతోషంతో ఆనందాన్ని పంచుకున్నారు.చిన్న పిల్లలకు భోగి పళ్ళు పోసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి,భూశా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర తెలంగాణలో సంప్రదాయ బద్దంగా మూడు రోజులు నిర్వహించే సంక్రాంతి పండుగను స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగిమంటలతో వేడుకను ప్రారంభించి చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోసి దీవించడం జరిగిందన్నారు.ఈ పండుగను ప్రతి సంవత్సరం స్విమ్మింగ్ సభ్యులందరూ కులమతాలకు అతీతంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో వేడుక నిర్వహించడం చాలా సంతోషంగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో చుక్కా రాంబాబు,జంగా శ్రీనివాసరెడ్డి, పల్లపోతు ప్రసాదరావు, గండూరి రాంబాబు, ఊటుకూరు భాస్కరరావు, రావూరి రాము, కొలగాని ప్రసాద్, తూములూరు రాజా, కష్టాల సతీష్, మాచర్ల శ్రీనివాసరావు, వందనపు శ్రీనివాసరావు,జింకల కోటేశ్వరరావు, ఏలూరి దుర్గాప్రసాద్,నంబూరు మురళి, లింగంపల్లి అప్పారావు,కొత్తూరు నరసింహారావు, చల్లా సత్యనారాయణ,గోవర్ధన్ రెడ్డి, బజాజ్ సాంబిరెడ్డి,మేకల ఉపేంద్ర స్విమ్మింగ్ సభ్యులందరూ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ కు ఆందోళన, గుబులు మొదలయ్యింది

- కంఠతడి పెడుతున్న క్యాతనపల్లి...
- అప్పుడు ఎట్లుండే ఇప్పుడు ఎట్లున్నది క్యాతనపల్లి..
- చెన్నూర్ బిఆర్ఎస్ పార్టీ రాజా రమేష్ బాబు..

**రామకృష్ణాపూర్ ,వుదయం :**
మంత్రి వివేక్ వెంకటస్వామి కి ఆందోళన, గుబులు మొదలయ్యిందని చెన్నూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్ బాబు అన్నారు. బుధవారం రామకృష్ణాపూర్ పట్టణంలోని సూపర్ బజార్ చౌరస్తాలో గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అప్పుడెట్లుండే క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఇప్పుడెట్లుంది అనే వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. వాల్ పోస్టర్ విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడారు. రాబోయే రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు వస్తున్నాయని మంత్రి వివేక్ కు ఆందోళన మొదలైందని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల్లో 50 సీట్లు కూడా గెలవలేదని మంత్రి నిరాశకు గురవుతున్నారని ఎద్దేవా చేశారు. చెన్నూర్, క్యాతన్ పల్లి మునిసిపాలిటీలను గెలుపొందాలని అనేక





విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. డబ్బుతో నాయకులను కొనాలని చూస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని గత బిఆర్ఎస్ బాల్క సుమన్ పరిపాలన ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మంత్రి పరిపాలనను గమనిస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాలలో మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం నిధులు తీసుకొచ్చారని ప్రశ్నించారు. మంత్రికి మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించి గిఫ్ట్ గా ఇస్తారని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పీర్జాదిగూడ డివిజన్ ప్రజలకు

# మకర సంక్రాతి శుభాకాంక్షలు

*తెలిపిన బండి. శ్రీరాములు*

**మేడిపల్లి, వుదయం :**
మకర సంక్రాతి పండుగను పురస్కరించుకొని పీర్జాదిగూడ ప్రజలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి శ్రీరాములు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ముంగిళ్లలో అందమైన ర ంగ వ ల్లుల తో, లోగిళ్ల లో ఆనందపు వెలుగులతో,జంగమ దేవరుల జేగంటలతోహరిదాసుల కీర్తనలతో ప్రజలు సంతోషంగా జరుపుకునే అతి పెద్ద పండుగ సంక్రాతి అని, డివిజన్ లోని ప్రజలందరూభోగ భాగ్యాలతో, సిరి సంపదలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని బండి. శ్రీరాములు ఆకాంక్షించారు.



అదేవిధంగా యువత చిన్నారులు డాబాలపైన గాలిపటాలు ఎగరవేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించి సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**అలంపూర్, వుదయం ప్రతినిధి:** గద్వాల్ జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మండలం, మదాసి కురువ - మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అంబేద్కర్ విగ్రహం దగ్గర విజయవంతంగా నిర్వహించబడింది. అయిజ నడిబొడ్డున ఉన్న డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కూడా క్యాలెండర్ ఆవిష్కరణ అత్యంత ఘనంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల నుండినాయకులు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, పిల్లలు, జిల్లా సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మదాసి కురువ - మదారి కురువ సంఘం దద్దరిల్లేలాగా ఐక్యతను ఘనంగా చాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు పుల్లూరు వెంకటేష్, ఉపాధ్యక్షులు రామాపురం తిక్కయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోవెలదిన్నె తిక్కయ్య, ఉపాధ్యక్షులు తనగల మధు, ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్, జాయింట్ సెక్రెటరీ మల్లికార్జున, ఐజ మండల అధ్యక్షుడు ఉప్పల రాజేష్, వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు, కుల బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అందరి సమిష్టి సహకారంతో ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# బడుగు బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్

రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**మహబూబ్ నగర్, వుదయం ప్రతినిధి :** బీద బడుగు బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోటలో ఏర్పాటుచేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే అందరికీ పండగ అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక వరి వేస్తే సిరి అని నిరూపించామన్నారు. మన రైతులు పండించిన వడ్లను బియ్యం గా మార్చి ప్రతీ పేదవాడికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.బీద,బడుగు, బలహీన వర్గాల గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఉచిత కరెంటు బిల్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి అనేక సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సర్పంచ్ లను గెలిపించిన విధంగానే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శాంతినగర్ లో మాదాసి/మాదారి కురువ క్యాలెండర్ ఆవిష్కరణ



**అలంపూర్ , వుదయం ప్రతినిధి :** గద్వాల్ జిల్లా అలంపూర్ తాలూకా వడ్డేపల్లి మండలం, శాంతినగర్‌లోని వాణి విద్యా మందిర్ పాఠశాలలో మదాసి కురువ - మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. శాంతినగర్ నడిబొడ్డున ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి నాయకులు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, పిల్లలు ,జిల్లా సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనికార్యక్రమాన్ని అత్యద్భుతంగా విజయవంతం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షులు పుల్లూరు వెంకటేష్, ఉపాధ్యక్షులు రామపురం తిక్కయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోవెలదిన్నె తిక్కయ్య, ఉపాధ్యక్షులు తనగల మధు, కోశాధికారి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్, జాయింట్ సెక్రెటరీ రాజోలి మల్లికార్జున, వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, కుల పెద్దలు, కుల బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# చిన్నారులకు పతంగులు పంపిణీ



**జిన్నారం, వుదయం ప్రతినిధి:** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో బుధవారం భోగి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ చిన్నారులకు యువకులకు పతంగులు పంపిణీ చేశారు. ఉత్సాహంగా చిన్నారులతో కలిసి పతంగులు ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. చిన్నారులు యువకులు చైనా మాంజా వాడొద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండుగ వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ప్రజలకు గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక టిఆర్ఎస్ నాయకులు యువకులు చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గాలిపటాలు తొలగింపు



**జిన్నారం, వుదయం ప్రతినిధి :** రోడ్డుపై తెగిపడ్డ పలు గాలిపటాలను సంగారెడ్డి జిల్లా ఎన్ఎస్యుఐ వైస్ ప్రెసిడెంట్ రూపేరావు మోహన్ సాయి సురక్షితంగా తొలగించారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. స్థానికంగా చెట్లు, విద్యుత్ వైర్లకు వేలాడుతున్న గాలిపటాలను తొలగించి ప్రజలకు వాహనదారులకు మూగ జీవాలు పక్షులకు ఇబ్బందులకు గురి కాకుండా స్వచ్ఛందంగా ముందుకు రావడాన్నీ మున్సిపల్ ప్రజలు ప్రముఖులు అభినందించారు.



# ముగ్గుల పోటి విజేతలకు బహుమతులు అందజేత

**వేంసూర్ , వుదయం ప్రతినిధి:** వేంసూరు మండలం పరిధిలోని చౌడవరం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ అంజమ్మ చిన్ని కృష్ణ ఉప సర్పంచ్ గొర్ల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భోగిమంటల సంబరాలు కోలాటం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జలగం ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై సంక్రాంతి ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళ విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మరియు గొర్ల భానుచందర్ రెడ్డి మారిశెట్టి నరసరావు కొప్పుల మురళి మహేష్ వెంకటనారాయణ పల్లెవాడ సర్పంచి శ్రీదేవి భాను ప్రకాష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గోదా దేవి కల్యాణం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**కోదాడ , వుదయం :** కోదాడ పట్టణంలోని కేఎల్ఆర్ కాలనీలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన గోదాదేవి కల్యాణోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ .ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టును తీవ్రంగా ఖండించిన గవినోళ్ళ శ్రీనివాస్



**నారాయణపేట , వుదయం ప్రతినిధి :** ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టు ప్రజాస్వామ్యకమని,రాష్ట్రంలో రైతుల సమస్యలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, పర్యావరణ సమస్యలు, ప్రజల జీవన సమస్యలు ఎన్నో పెండింగ్‌లో ఉన్న ఈ సమయంలో వాటిని పక్కన పెట్టి పూర్తిగా అప్రస్తుతం అయిన ఒక అంశంపై సిట్ ఏర్పాటు చేయడం దురదృష్టకరం అని సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమకారుడు బాపన్ పల్లి సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు.

ఇది ఉన్నత అధికారుల విలువైన సమయాన్ని వృథా చేయడమే కాకుండా, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుండి మళ్లించేందుకు ప్రభుత్వం కావాలనే నడిపిస్తున్న చర్యగా భావిస్తున్నట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగ విలువలకు తీవ్రంగా విరుద్ధంగా ఉన్నాయి అన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, ప్రజల గొంతుకగా నిలబడే బాధ్యత మీడియాకు ఉందని అటువంటి మీడియాపై ముఖ్యంగా జర్నలిస్టులపై అరెస్టులు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు.ప్రజాస్వామ్య దేశంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు అని ఆవేదన వ్యక్తం చేశారు.మీడియాను భయభ్రాంతులకు గురి చేసి, ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ప్రయత్నాలను గవి నోళ్ల శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తక్షణమే ఈ అరెస్టులను ఉపసంహరించుకోవాలని, జర్నలిస్టులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల అసలు సమస్యలపై దృష్టి సారించి, పాలనను బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి - ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి అని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# పటాన్చెరులో ఎండీఆర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు:** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సంస్థ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ గారి సమక్షంలో సంప్రదాయ ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కళాత్మక ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారు రంగురంగుల డిజైన్లు, సంప్రదాయ రూపకాలు, పండుగ థీమ్‌లతో కూడిన ముగ్గులను రూపొందించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పోటీల సందర్భంగా కాలనీ/ప్రాంతం అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.

మహిళలు, విద్యార్థినులు సంప్రదాయ కళలపై చూపుతున్న ఆసక్తిని అభినందించారు.

ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ గారు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి-సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళల ప్రతిభకు వేదికగా నిలిచే ముగ్గుల పోటీలు సామాజిక ఐక్యతను కూడా పెంపొందిస్తాయని అన్నారు.

పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

ఇలాంటివి నిరంతరం నిర్వహిస్తాం - నిర్వాహకులు సమాజంలో సాంస్కృతిక విలువలను కాపాడేందుకు ఎండీఆర్ ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాల్గొన్నవారికి, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



**నాగర్ కర్నూల్, వుదయం ప్రతినిధి :** మకర జ్యోతి దర్శనం సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ ధర్మశాస్త్ర దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పడిపూజోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ స్వాములు, అయ్యప్ప స్వామి భక్తులు, శివమాల స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పట్టణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయ శాస్త్రి ఆధ్వర్యంలో పడిపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పసుపుల సుందర్, గురుస్వాములు లక్ష్మణ్,ఖానాపురం ప్రదీప్, నరేష్, చంద్రశేఖర్, శేఖర్, పరమేశ్వర్, జగన్, పాండు ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా బాటతో విద్యుత్ సమస్యల పరిష్కారం

**గుమ్మడిదల, వుదయం ప్రతినిధి :** ప్రజా బాట కార్యక్రమం ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం సులభమవుతుందని గుమ్మడిదల ఏడీఈ దుర్గా ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రంలో మాట్లాడుతూ.. మంగళ, గురు, శనివారాల్లో కార్య క్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. వినియోగదారులు, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రజా బాట కార్యక్రమాన్ని వినియోదారులు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పండుగ రోజు గృహ జ్యోతి లేఖల పంపిణీలో విద్యుత్ అధికారులు



**నారాయణపేట టౌన్ , వుదయం ప్రతినిధి:** నారాయణపేట జిల్లాలో సంక్రాంతి పండుగ రోజు సైతం విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికీ తిరిగి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తారంగా ప్రచారం చేస్తున్నారు. విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశానుసారం ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన లేఖను ఇంటికి తిరిగి జిల్లా లో 14 మండలాల్లో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ నవీన్ కుమార్ అన్ని మండలాల విద్యుత్ శాఖ ఏఈ లతో సంక్షేమ పథకాల ఉచిత విద్యుత్ పథకాన్ని ఏవిధంగా అమలు చేస్తున్నారు, ఉచిత విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే డిస్కమ్ లకు చెల్లిస్తుందని వాటి వివరాలను ఈ లేకలో పేర్కొన్నారని ఎస్.ఈ. నవీన్ కుమార్ ప్రజలతో మమేకమై పంచుకున్నారు. నారాయణపేట మండలం కోల్లంపల్లి , మక్తల్ మండలాల్లో సిబ్బంది తో ఇంటింటికి తిరిగి పంపిణిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట రూరల్ ఏఈ సాయినాథ్ రెడ్డి, ఏఈటి సతీష్, రూరల్ ఎల్.ఐ. జీ. రవీంద్రచారీ, దేవణ్ణ, జె.ఎల్.ఎమ్, శ్రీనివాస్, రమేష్, మక్తల్ ఏఈ రామకృష్ణ స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

# చైనా మాంజా నిషేధంపై పోలీసుల తనిఖీలు



**జిన్నారం, వుదయం ప్రతినిధి :** జిన్నారం మున్సిపాలిటీ లో ప్రాణాంతకమైన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హనుమంతు హెచ్చరించారు. బుధవారం మున్సిపల్ కేంద్రంలోని పలు దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చైనా మాంజా వల్ల వాహనదారులు, పక్షులు ప్రాణాపాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని, ప్రజలు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఎట్టి పరిస్థితుల్లో చైనా మాంజా విక్రయాలు జరపరాదని వ్యాపారస్తులను హెచ్చరించారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# మధిరలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

**మధిర, వుదయం ప్రతినిధి:** మధిర పట్టణంలోని సాయి నగర్ లో భోగి పండుగ సందర్భంగా సాయినగర్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందుగా భోగి పండుగ సందర్భంగా తెల్లవారు జామున భోగి మంటల కార్యక్రమం కాలనీవాసులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు.అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వారి నైపుణ్యతను ప్రదర్శించారు. పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో ప్రతి పండుగను నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పండుగ నిర్వహించడం వలన చిన్నారులకు పండుగ యొక్క విశిష్టత, సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకునేందుకుదోహదపడతాయని అన్నారు.అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు సాయి నగర్ గణేష్ కమిటీ సభ్యులు బహుమతి ప్రధానం అందజేశారు.



# ఫ్రెండ్స్ యూత్ టోర్నమెంట్‌లో విజేతలు అశ్విత్,సూర్య



**మధిర, వుదయం ప్రతినిధి :** ఫ్రెండ్స్ యూత్ టోర్నమెంట్ సీజన్2 ఆధ్వర్యంలో మధిర మినీ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో అండర్16 విభాగం డబుల్స్‌లో మినీ స్టేడియం క్రీడాకారులు డి.హాశ్విత్,సూర్య విజేతలుగా నిలిచారు. యువ క్రీడాకారులు తమ అద్భుతమైన ప్రదర్శన,ఘాటైన స్మాష్‌లు, సమన్వయ ఆటతో ప్రత్యర్థులను మించి మొదటి బహుమతిని సొంతం చేసుకున్నారు. మధిర మినీ స్టేడియంలో జరిగిన ఈటోర్నమెంట్ యువతలో క్రీడా ఉత్సాహాన్ని మరింత పెంచినది.ఈ సందర్భంగా స్టేడియం ఇన్చార్జి కమ్ అడ్మినిస్ట్రేటర్ వై.చిన్ని మరియు బ్యాట్మెంటన్ కోచ్ డి.సునీల్ మరియు కబడ్డీ కోచ్ ప్రవీణ్ అభినందనలు తెలియజేశారు.

# ఎర్రవరం ఆలయాన్ని సందర్శించిన రాజమండ్రి న్యాయమూర్తి



**కోదాడ, వుదయం :** మండల పరిధిలోని ఎర్రవరం దూలగుట్ట పై వేంచేసియున్న బాల ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం ఆంధ్ర రాష్ట్రం రాజమండ్రి కి చెందిన సీనియర్ సివిల్ జడ్జ్ కర్రి ప్రకాష్ సత్య ప్రియ దంపతులు సందర్శించుకున్నారు ఈ సందర్భంగా వారుఆలయ నిత్య అన్నదానానికి 25 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు అనంతరం ఆలయ కమిటీ వారు వారిని జ్ఞాపికతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కర్రి నిఖిల, శ్రీ ఉదయ పద్మిని, ఆలయ కోర్ కమిటీ సభ్యులు భాషబోయిన భాస్కర్ రావు కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**కోదాడ , వుదయం :** కోదాడ మండల పరిధిలోని అల్వాలపురం గ్రామంలో బుధవారం హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు గ్రామాన్ని రంగుల కళావేదికగా మార్చాయి. ఇంటి ముందర వేసిన ముగ్గులు గ్రామ సంస్కృతి, మహిళల కళా నైపుణ్యానికి అద్దం పట్టాయి.పోటీలకు గ్రామ మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. రంగురంగుల ముగ్గులు, సంప్రదాయ ప్రతీకలు, ఆధ్యాత్మిక భావాలతో రూపొందించిన ఆకృతులు అందరి దృష్టిని ఆకర్షించాయి. గ్రామ వీధులన్నీ ఒక కళా గ్యాలరీని తలపించాయి .ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ, జోగిని మాత కళా స్వామి ముఖ్య అతిథులుగా హాజరై, ముగ్గుల పోటీలను పరిశీలించి మొదటి బహుమతి మద్దెల పూజిత, రెండవ బహుమతి మద్దెల శ్రీలక్ష్మి, మూడోవ పోతురాజు గౌతమి లకు బహుమతులు బహుకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.గ్రామీణ సంప్రదాయాలను కాపాడే ఇలాంటి కార్యక్రమాలు యువత చేతిలోనే సాధ్యమవుతాయి. హనుమాన్ యూత్ చేపట్టిన ఈ ప్రయత్నం అభినందనీయం" అని ప్రశంసించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. మహిళల ముఖాల్లో కనిపించిన ఆనందం ఈ కార్యక్రమానికి అద్దం పట్టింది.గ్రామంలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంచుతూ, ఐక్యతను చాటేలా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలు అల్వాలపురం గ్రామస్తులకు మరపురాని అనుభూతిని మిగిల్చాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్లు భట్టి విక్రమార్క కార్యాలయం వద్ద భోగి సంబరాలు



**మధిర, వుదయం ప్రతినిధి :** మధిర పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయం వద్ద భోగి పండుగ ఘనంగా నిర్వహించారు.అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క కాంగ్రెస్ నాయకులు పాల్గొని భోగి మంటలు వేశారు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఆనందం గడిపారు,గంగిరెద్దుల వాళ్లు తమ కళా పాటవాన్ని ప్రదర్శించి ప్రజలను మైమరిపించారు.ఈ సందర్భంగా మల్లు నందిని విక్రమార్క మాట్లాడుతూ సంక్రాంతి ముగ్గులతో అలరారుతున్న తెలుగు లోగిళ్లలో భోగి పండుగ జరుపుకుంటున్న తెలంగాణా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు,మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని మనసారా కోరుకుంటు.మీ జీవితం భోగభాగ్యాలతో తులతూగాలని అందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మధిర మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు సర్పంచులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం



**నాగర్ కర్నూల్, వుదయం ప్రతినిధి :** జిల్లా లోని బిజినపల్లి మండల పరిధిలోని వట్టెం దేవాలయంలో ధనుర్మాసం ప్రత్యేక పూజల కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు గోదాదేవి కళ్యాణం వేదమూర్తులైన బ్రాహ్మణులచే వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు , నవీన్ స్వామి , నరసింహ చార్యులు, తివారి,ల ఆధ్వర్యంలో వేదమూర్తులైన బ్రాహ్మణులచే వేదమంత్రో చరణాల మధ్య శాస్త్రోక్తంగా గోదాదేవి కళ్యాణంలో విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యావచనం, మధుపర్కం,మంగళాష్టకాలు, కన్యాదానం,జిలకర బెల్లం,మహ సంకల్ప పఠనం,మాంగల్య ధారణ,తలంబ్రాలు వేద ఆశీర్వచనం వేదమంత్రచరణల మధ్య చేశారు. గోదా రంగనాయక స్వామి వార్లకు సమర్పించిన తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేశారు. కళ్యాణం లోపాల్గొన్న భక్తులందరికీ చిన్నారి సాన్విసింగ్ నృత్యం ఎంతగానో అలరించింది . తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మరియు వారి కుమార్తె, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి దిలీపాచారి రాష్ట్ర సభ్యుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, . ఆలయ వ్యవస్థాపక సభ్యుడు ప్రతాప్ రెడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారి దేవేందర్ రెడ్డి , వికాస తరంగిణి ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బండారు రాజశేఖర్ , బిజెపి జిల్లా మహిళా నేత మ్యాకం చంద్ర కల,సర్పంచ్ జ్యోతి, జక్ పాల్ రెడ్డి, చంద్రా రెడ్డి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన వందలాది మంది భక్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.దేవస్థాన నిత్యాన్నప్రసాద ట్రస్టు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది.

# భోగి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**

భోగి పండుగ మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని భోగి మంటలు వెలిగించి, పాత ఆలోచనలు, అరిష్టాలను దూరం చేసి, కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భోగి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను జరుపుకోవడం ద్వారా ఐక్యత, ఆనందం మరింత పెరుగుతాయని తెలిపారు. రైతన్నల కష్టానికి గౌరవం తెలిపే పండుగగా భోగిని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**

నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు పోలీస్ శాఖ అండగా ఉంటూ సత్వర న్యాయం చేస్తారనే నమ్మకాన్ని, భరోసా కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందే ఉద్దేశంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల శుభ్రత, సిబ్బంది విధి నిర్వహణ విధానం తదితర అంశాలను జిల్లా ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు, త్వరిత న్యాయం, పారదర్శక సేవలు అందేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు,పలిమెల ఎస్ఐ రమేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా కోశాధికారిగా ఎర్రం రామన్న

**వుదయం, పరకాల :**



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్ర రావు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా బీజేపీ జిల్లా కోశాధికారిగా ఎర్రం రామన్న నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రం రామన్న మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డితో పాటు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ రాజేశ్వర్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, దొంతి దేవేందర్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డి, కొండేటి శ్రీధర్, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్. విజయ చందర్‌రెడ్డి, డాక్టర్. సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు తదితర జిల్లా, నియోజకవర్గ, పట్టణ బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత, అభివృద్ధి కోసం సర్వదా కృషి చేస్తానని అన్నారు.

# భీమదేవరపల్లి అభివృద్ధికి సహకరిస్తా

## కేంద్ర మంత్రి బండి సంజయ్

**వుదయం, భీమదేవరపల్లి**

సర్పంచ్ కుమారస్వామి మాచర్ల మా ఆహ్వానం మేరకు బుధవారం భీమదేవరపల్లి గ్రామాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సందర్శించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్‌కు సూచించారు. గ్రామ అభివృద్ధికి తన సాయం ఎల్లప్పుడు ఉంటుందని సర్పంచ్ మాచర్ల కుమారస్వామికి భరోసా ఇచ్చారు. కేంద్ర నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# నోటీసు లేకుండ జర్నలిస్టుల అరెస్టుపై టీడబ్ల్యూజేఎఫ్ ఖండన

**వుదయం, వరంగల్ :**

ఎలాంటి నోటీసు, సెర్చ్ వారంట్ , దర్యాప్తు గానీ లేకుండానే జర్నలిస్టుల ఇండ్ల ల్లోకి వెళ్ళి ముగ్గురు జర్నలిస్టులను అరెస్ట్ చేయడాన్ని టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పొడేటి అశోక్, కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు, ఈర్ల సురేందర్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఆనంతుల రమేష్, జిల్లా కోశాధికారి గాయపు రాజురెడ్డిలు బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. అర్ధరాత్రి జర్నలిస్టుల కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యేలా పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని పోలీసులను డిమాండ్ చేశారు. వార్తల ప్రసారంలో అభ్యంతరం ఉంటే ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోకుండా ఇష్టానుసారం వ్యవహరించడం భావ్యం కాదన్నారు. వార్తల ప్రచురణ, ప్రసారాలకు మీడియా యాజమాన్యాలే బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

# ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

## 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు

**వుదయం, హనుమకొండ :**



సంక్రాంతి పండుగ అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని పేర్కొన్నారు. రైతులు ఏడాది పొడవునా చేసిన కష్టానికి ఫలితంగా వచ్చే పంటల ఆనందాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అందరూ కలిసి పంచుకునే పర్వదినమే సంక్రాంతి అని అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు గ్రామీణ జీవన శైలిని, ఐక్యతను, పరస్పర సహకారాన్ని గుర్తు చేస్తాయని తెలిపారు. ప్రత్యేకంగా రైతుల జీవితాల్లో ఈ పండుగ కొత్త ఆశలు, నూతన ఉత్సాహాన్ని నింపుతుందని, మంచి దిగుబడులతో రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. యువత మంచి మార్గంలో ముందుకు సాగుతూ సమాజాభివృద్ధికి తోడ్పడాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆకాంక్షించారు.



# ఘనంగా సంక్రాంతి సంబురాలు

**వుదయం, హనుమకొండ టౌన్ :**

బన్ను న్యూరో హెల్త్, రిహాబిలిటేషన్ సెంటర్‌లో బుధవారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ హాజరై వేడుకలను ప్రారంభించారు. సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా భోగి మంటలు, బొమ్మరిల్లు, భోగి పళ్ళు వంటి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొని పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లె సంస్కృతి, భారతీయ సంప్రదాయాలను భావి తరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బన్ను న్యూరో హెల్త్, రిహాబిలిటేషన్ సెంటర్ ప్రిన్సిపాల్ వీరమల్ల కిరణ్ కుమారి, చంద్రజిత్‌రెడ్డి, టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

## ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

**వుదయం, రాయపర్తి :**

యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు మొగ్గు చూపాలని, అప్పుడే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రామీణ ప్రాంతాలలోని క్రీడా నైపుణ్యాలను గుర్తించడానికి, క్రీడాకారులను ప్రోత్సహించాలని అనే ఉద్దేశంతో ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బహుమతిలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాయపర్తి స్థానిక సర్పంచ్ గారె సహేంద్ర భిక్షపతి, ఐత రామ్ చందర్, చందు రామ్,చందు మల్లేష్ గజావెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి, మచ్చ శ్రవణ్ చిలువేరు సాయిగౌడ్, జీవన్, ఉబ్బని మధు, గారె నరేష్,గారె విష్ణు గుండె రాకేష్ గారె అఖిల్, ఐత వెంకటేష్,డెక్క రాహుల్ తదితరులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి పరామర్శ

**వుదయం, రాయపర్తి :**

రాయపర్తి మండలం మైలారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ లేత ఆకుల యాదవ రెడ్డి తల్లి వెంకటమ్మ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో తొర్రూర్ టౌన్ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, గ్రామ సర్పంచ్ చిర్ర వేణు, నాయకులు ఉల్లెంగల నరసయ్య బీరం వెంకటరెడ్డి, చిర్ర మల్లయ్య, పరుపాటి రత్నాకర్‌రెడ్డి, పగిడిపల్లి భీమారెడ్డి, చిర్రాములు, చిర్రా ఎల్లయ్య, పరుపాటి రాజు, చిర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు వెళ్లే భక్తులకు బస్సుల సౌకర్యం కల్పించాలి

## మహాదేవపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం

**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**

సమ్మక్క సారక్క మహా జాతరకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్సు సౌకర్యం కల్పించాలని మహాదేవపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆర్టీసీ డీఎంను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు గడ్డం స్వామి మాట్లాడుతూ.. మహాదేవపూర్ మండలంలోని గ్రామాల ప్రజలతోపాటు చత్తీస్‌గఢ్ మహారాష్ట్ర నుంచి వెళ్లే బస్సులు మహాదేవపూర్ గుండా వెళ్తాయని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అధిక సంఖ్యలో బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మేడారం జాతరకు వెళ్లే బస్సులకు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ చీర్లవంచ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.




# సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

## రామ రాజేష్ ఖన్నా

**వుదయం, వరంగల్ టౌన్ :**



ప్రజలకు, ఉద్యోగులకు జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్రాంతి పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ముఖ్యంగా రైతులు కష్టపడి పండించిన పంటలకు గౌరవం తెలిపే మహత్తర పండుగగా సంక్రాంతి ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు సంప్రదాయాలను గౌరవిస్తూ, పరస్పర ప్రేమాభిమానాలతో సంక్రాంతి ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

# కార్మికులకు సంక్రాంతి శుభాకాంక్షలు

## ఏఐఎఫ్‌ఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు చంద్రగిరి శంకర్

**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి కార్మికులకు, ప్రజలకుమకర సంక్రాంతి కనుమ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఏఐఎఫ్ఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు చంద్రగిరి శంకర్ సింగరేణి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం తాము పనిచేస్తామని, ఏఐఎఫ్ఎఫ్టీయూ తరుపున కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతామని ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

## స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు




**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**

సీనియర్ జర్నలిస్టులైన దొంతు రమేష్, చారి, సుధీర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (ఎన్‌యూజే-ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్‌లు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. లంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఈ కేసు ను వెంటనే ఎత్తివేసి, జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖండించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్,సంయుక్త కార్యదర్శులు కడపాక రవి,పల్నాటి రాజు,మారెపల్లి చంద్ర మౌళి, భూపాల్,జగన్, కారుకూరి సతీష్ హేందర్ తదితరులు ఉన్నారు.



# చిన్నారులకు ఆటల పోటీలు

**వుదయం, జయశంకర్ భూపాలపల్లి :**

మహాదేవపూర్ మండల కేంద్రంలోని గడి హనుమాన్ దేవాలయంలో దేవాలయ నిర్వాహకులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. బుధవారం భోగి పండుగ సందర్భంగా ఆటల పోటీలను నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో చిన్నారులు పాల్గొని విజేతలుగా రాణించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు చిన్నారులకు ప్రైజ్ మనీతోపాటు గాలిపటాలు అందజేశారు. కార్యక్రమంలో మహాదేవపూర్ గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు పడాల రాజమౌళి, పూసల హరీష్, మహమ్మద్ నయిమొద్దీన్, మహమ్మద్ బిన్ అలీ, మహాదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు వార్డు మెంబర్ అస్రార్ ఖురేషి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నెన్నెల గట్టయ్య,హనుమాన్ టెంపుల్ నిర్వాహకులు శ్రీపతి రాజబాపు, చిటికెల రవి, కడార్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి

**వుదయం,హనుమకొండ :**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం గంటూరుపల్లి సమీపంలోని హెచ్‌పీ గోదాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాలవ్యాపారి మృతి చెందారు. గోదాం వద్ద హైవే పనులు చేస్తున్న టిప్పర్.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాల వ్యాపారి ఈర కుశుడు(38) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు, వారి బంధువులు హసన్‌పర్తి ప్రధాన రహదారిపై బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దొంగతనానికి యత్నం..

- గ్రామస్తులకు చిక్కిన యువకుడు
- గణపురం మండలంలో ఘటన

**వుదయం, గణపురం :**

మండలంలోని గాంధీనగర్ గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం చేసేందుకు యత్నించిన ఇద్దరు యువకులను గ్రామస్తులు అడ్డుకున్నారు. వారిలో ఒకరిని పట్టుకోగా, మరొకరు పారిపోయారు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బీరబోయిన రామకృష్ణ, బత్తుల శంకర్ ఇళ్లలోకి బుధవారం రాత్రి ఇద్దరు గుర్తుతెలియని యువకులు చొరబడేందుకు ప్రయత్నించారు. గమనించిన ఇంటి యజమాని గట్టిగా కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు వారిని పట్టుకొనేందుకు వెంబడించారు. దొంగలు పల్సర్ బైక్‌పై పారిపోతుండగా గ్రామస్తులు చాకచక్యంగా ఒకరిని పట్టుకున్నారు. మరొకరు చీకట్లో తప్పించుకున్నారు. పట్టుబడ్డ యువకుడిని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్ ఘటనాస్థలికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సహకార సంఘాలు గ్రామీణ అభివృద్ధికి కీలక పాత్ర

## డీసీఓ సంజీవరెడ్డి

**వుదయం, హనుమకొండ :**

మున్నూరు కాపు పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు ఉద్దేశించిన మొదటి సమావేశం జ్యోతి ప్రజ్వలనతో ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, సభ్యుల సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా కోరబోయిన సాంబయ్య, చైర్మన్‌గా మంద ఐలయ్య వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీఓ సంజీవరెడ్డి హాజరై మాట్లాడుతూ.. సహకార సంఘాలు గ్రామీణ, సామాజిక అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సభ్యుల పొదుపు అలవాట్లు పెంపొందించడం, తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలు కల్పించడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రతి సభ్యుడు ఐక్యతతో, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అధ్యక్షులు కోరబోయిన సాంబయ్య మాట్లాడుతూ, సంఘ అభివృద్ధికి సభ్యులందరి సహకారం ఎంతో అవసరమని, సభ్యుల సంక్షేమమే సంఘ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అపెక్స్ కమిటీ, పాలక మండలి సభ్యులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ అప్పల సుధాకర్, డాక్టర్ సుదీప్, పుప్పాల కిషన్, పుప్పాల తిరుమల్, ఇ.వి.శ్రీనివాస్ రావు, ఆకుల రాజేందర్, గంటా రవికుమార్, మర్రి జనార్ధన్, కటకం పెంటయ్య, గైనేని రాజన్, ఇనుగాల శ్రీధర్, తోట వెంకన్న, ఏనుగుల మానస రాంప్రసాద్, కందుల సృజన్, పెంచాల గోపాల్, పిట్టల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# చక్కని ఆరోగ్యం

# పిల్లలు అతిగా ఫోన్ చూస్తున్నారా?



పిల్లల్లో అధిక మొబైల్ వాడకం వ్యసనంగా మారి, వారి శారీరక, మానసిక ఆరోగ్యం, చదువులు, దినచర్యలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 'టెక్సట్ నెక్', కళ్ల అలసట, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫోన్ చేతికి ఆరో వేలిగా మారిపోయింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా ఫోన్‌ను విపరీతంగా వాడుతున్నారు. ఈ అతి వాడకం పెద్దల కంటే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా మానసికంగా వారిని ఇబ్బందికి గురి చేస్తుంది. పిల్లలు కూడా అతిగా ఫోన్ చూస్తుంటే వారిని వెంటనే ఆ అలవాటు నుంచి దూరం చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. పిల్లలో ఫోన్ చూసే అలవాటు క్రమంగా ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లల దినచర్య, చదువు, ఆటలు, సామాజిక కార్యకలాపాలపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఫోన్‌లను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల శ్రద్ధ, నిద్ర, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ అలవాటును ఎలా నియంత్రించాలో, పిల్లలను సమతుల్య, ఆరోగ్యకరమైన దినచర్య వైపు ఎలా ప్రేరేపించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ స్క్రీన్‌పై నిరంతరం వేలాడుతూ ఉండటం వల్ల 'టెక్సట్ నెక్' వంటి సమస్యలు వస్తాయి, ఇది మెడ, భుజాలు, వెన్నెముకపై చాలా ఒత్తిడిని కలిగిస్తుంది. మొబైల్ ఫోన్‌ల నుండి వెలువడే నీలి కాంతి కళ్ళను అలసటకు గురి చేస్తుంది, వాటిని పొడిగా చేస్తుంది, దృష్టిని బలహీనపరుస్తుంది. రాత్రి ఆలస్యంగా మొబైల్ ఫోన్‌లను వాడటం వల్ల నిద్రలేమి, అలసట మరియు చిరాకు పెరిగే నిద్ర హార్మోన్ 'మెలటోనిన్' ఉత్పత్తి తగ్గుతుంది. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది, ఇది ఊబకాయం మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొబైల్ వ్యసనాన్ని అధిగమించాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలతో మాట్లాడటం ఉత్తమ మార్గం అని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల వారి ఆరోగ్యం, చదువులు, మానసిక అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందని పిల్లలకు వివరించడం అవసరం. సమయ పరిమితులను నిర్ణయించడం, మొబైల్ ఫోన్‌ల కోసం ప్రత్యేక సమయాన్ని నిర్ణయించడం, పిల్లలను ఇతర ఆసక్తికరమైన కార్యకలాపాల వైపు ఆకర్షించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆటలు, విహారయాత్రలు, చదువులు, కుటుంబంతో కలిసి చేసే అభిరుచులు మొబైల్ ఫోన్‌ల నుండి దృష్టి మరల్చడానికి సహాయపడతాయి. పిల్లలు మంచి ఉదాహరణను చూడగలిగేలా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమంగా పిల్లలను కొద్దిసేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

# రైస్ ఇలా వండితే.. అన్నం తిన్నా షుగర్ కంట్రోల్!

డయాబెటీస్ ఉన్న వారు, అధిక బరువు ఉన్నవారు అన్నం తినాలంటేనే భయపడిపోతుంటారు. ఎందుకంటే అన్నంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. దీనిని తినడం వల్ల బాడీలో కార్బోహైడ్రేట్స్ పెరిగి బరువుతో పాటు షుగర్ లెవల్స్ కూడా



పెరుగుతాయని వాళ్ల టెన్షన్.. అయితే అలాంటి వారికే ఈ గుడ్‌న్యూస్.. అన్నం తిన్నా బాడిలో షుగర్‌ను కంట్రోల్ ఉంచుకోవచ్చు. అన్నం తినడం వల్ల శరీరంలో కార్బోహైడ్రెడ్స్ పెరుగుతాయన్న మాట వాస్తవమే.. కానీ కొన్ని చిట్కాలను పాటించడం వల్ల వాటి పెరుగుదలను నెమ్మది చేయవచ్చు. దానితో పాటు బాడిలో షుగర్‌తో పాటు బరువు పెరగడాన్ని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఇందుకు రు పెద్దగా కష్టపడాల్సి అవసరం కూడా లేదు. కేవలం అన్నం వండేటప్పుడు అందులో కొన్ని బెండకాయలు, లేదా బంగాళాదుంపలు వేసుకుంటే సరిపోతుంది. దీని వల్ల అన్నం త్వరగా అవ్వడమే కాకుండా ఔషధంలా మారుతుంది. ఇది మేము చెబుతున్న విషయం కాదు.. వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ జాకోబ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇలా అన్నంలో బెండకాయలు కలిపి వండుకొని తినడం ద్వారా మన బాడిలో షుగర్ లెవల్స్ పెరగకుండా కంట్రోల్‌లోనే ఉంటాయట.

# అల్లంతో ఆరోగ్య ప్రయోజనాలు

శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే ఎంతో మంచిది.శీతాకాలంలో చాలా మంది అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తొందరగా జబ్బుల బారినపడుతుంటారు. శీతాకాలంలో రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల జీర్ణ సమస్యలు, జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల శీతాకాలంలో రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. వాటిలో ముఖ్యంగా అల్లం తీసుకుంటే మంచిది. అల్లంను టీలో మాత్రమే కాకుండా ఇతర ఆహార పదార్థాలకు కూడా జోడించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. అల్లం శీతాకాలంలో వచ్చే జీర్ణ సమస్యల నుంచి మనల్ని కాపాడుతుంది. వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. అంతేగాక, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. అందుకే మధుమేహ వ్యాధి బాధితులకు ఇదొక వరమనే చెప్పాలి. అయితే, డయాబెటిస్ ఉన్న వ్యక్తులు అల్లంను మితంగా తీసుకోవాలి. రోజుకు 5 గ్రాములు తీసుకుంటే చాలు. రక్తంలో చక్కరను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని నియంత్రిస్తుంది. ఇక అల్లంలో ఉండే యాంటీఅక్సిడెంట్స్ లక్షణాలు పుష్కలంగా ఉండటంతో మన రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శీతాకాలంలో వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. వృద్ధులు తగినంత అల్లం తీసుకోవడం వారి ఆరోగ్యానికి మంచిది. శరీర నొప్పులు, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి వృద్ధులకు ఉపశమనం కలిగిస్తుంది. అల్లం కలిపిన మిశ్రమాలు తీసుకోవడం వల్ల శరీరం శక్తివంతం అవుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది.



# నిద్రలేచిన వెంటనే నిస్సత్తువగా అనిపిస్తుందా?

ఓట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఓట్స్ తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు నయమవుతాయి. ముఖ్యంగా కాస్త అలసటగా, నీరసంగా అనిపిస్తే వెంటనే ఓట్స్ తయారు చేసుకుని తినడం మంచిది. రాత్రి బాగా నిద్రపోయిన తర్వాత కూడా కొంత మందికి ఉదయం లేచినప్పుడు ఉత్సాహంగా అనిపించదు. నీరసంగా, అలసటగా అనిపిస్తుంది. ఇలా జరగడానికి పోషకాల లోపమని నిపుణులు అంటున్నారు.



తరచూ ఇలా అలసిపోయినట్లు అనిపిస్తే ఏం చేయాలని అనిపించదు. అలాంటి సమయాల్లో చాలా మంది నిద్రపోతుంటారు. అయితే ఇలా చేయకుండా కొంచెం ఓపిక చేసుకుని శరీరానికి శక్తినిచ్చే ఆహారాలను తీసుకోవడం మంచిది. ఎందుకంటే నిద్రపోవడం వల్ల బలహీనత మరింత పెరుగుతుంది. ఇలాంటి సందర్భంలో రు ఓట్స్ తినవచ్చు. ఓట్స్ అలసట నుంచి ఉపశమనం పొందడంలో సహాయపడతాయి. ఎందుకంటే వాటిలో సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి శక్తిని నెమ్మదిగా విడుదల చేస్తాయి మరియు శరీరాన్ని ఎక్కువ కాలం చురుగ్గా ఉంచుతాయి. ఓట్స్‌లో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఓట్స్ తినడం వల్ల రక్తహీనతనుంచి బయటపడవచ్చు. ఓట్స్‌లో ఐరన్, మెగ్నీషియం, విటమిన్ బి ఉంటాయి. ఇవి కండరాలు, నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తద్వారా మానసిక, శారీరక అలసట తగ్గుతుంది.

# పండగ వేళ.. ఆరోగ్యంగా..!

పండక్కి చేసే పిండి వంటల్ని ఆస్వాదించే విషయంలో అస్సలు రాజీపడరు కొంతమంది. ఈక్రమంలో తమకు నచ్చిన స్వీట్స్, డీప్ ఫ్రై చేసిన వంటకాల రుచుల్ని మనసారా ఆస్వాదిస్తుంటారు. అయితే ఇవి తినేటప్పుడు బాగానే ఉంటాయి కానీ.. ఆ తర్వాతే అజీర్తి, కడుపుబ్బరం.. వంటి సమస్యలు మొదలవుతాయి. అందుకే ఈ సమయంలో నచ్చినవి మితంగా తీసుకుంటూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..



సాధారణంగా భోజనానికి ముందు నీళ్లు తాగకూడదంటారు కొందరు. కానీ ప్రత్యేక సందర్భాల్లో ఎక్కువ తినేస్తామేమో అనే భయం ఉంటే ఏదైనా తినే ముందు కొన్ని నీళ్లు తాగడం వల్ల ఎక్కువ తినకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల శరీరాన్నీ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చంటున్నారు. అలాగే రోజంతా మధ్యమధ్యలో నీళ్లు తాగుతూ ఉండడం మర్చిపోకూడదు. ఈ క్రమంలో కాఫీ, శీతల పానీయాలు, కాక్‌టెయిల్స్.. వంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. పండగ సందర్భంగా.. ఆయా వంటకాలను బయటి నుంచి ఆర్డర్ చేసుకోవడం కాకుండా ఇంట్లోనే తయారుచేసుకోవాలి. అప్పుడే ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతాం. అలాగే వంటకాలు ఎంత రుచిగా ఉన్నా సరే మితంగానే తినాలి. కొన్ని పదార్థాలు మిగిలిపోయాయని మరుసటి రోజు తీసుకుందామనుకుంటే.. అజీర్తి, కడుపుబ్బరం.. వంటి సమస్యలు తప్పవు. ఈక్రమంలో పండగ మర్నాడు తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. అలాగే పండగ రోజునా.. రోజువారీ వ్యాయామాలు మాత్రం మానకూడదు.

# కొంచెంగా ఎక్కువసార్లు తినండి!



చలికాలం వేడివేడిగా ఏదైనా తాగాలనో తినాలనో అనిపిస్తుంటుంది. కానీ తీరిక లేకనో తమమీద శ్రద్ధ లేకనో మహిళలు టీ, కాఫీలనే ఎక్కువగా ఆశ్రయిస్తుంటారు. దాంతో అలసట, డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు. చర్మం పొడిబారుతుంది. అందుకే ఈ కాలంలోనే పోషకాహారం మరింత ముఖ్యం. రోగనిరోధక శక్తిని పెంచే విటమిన్-సి ఎక్కువగా ఉండే సీజనల్ పండ్లు ఏవైనా తినొచ్చు. వీటితోపాటు తులసి, అల్లం, పసుపు, దాల్చినచెక్క, మిరియాలు వంటివి వాడితే శ్వాసకోశ సమస్యలు రాకుండా ఉంటాయి. ఇవి వేడిని కలిగించడంతోపాటు గ్యాస్ సమస్యల్నీ నియంత్రిస్తాయి. కండరబలంకోసం గుడ్లు, పనీర్, గింజలు... వంటి ప్రొటీన్ ఆహారాన్నీ తప్పక తీసుకోవాలి. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు... వంటి వాటిని ఆహారంలో విధిగా చేర్చుకోవాలి. ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి. వీలైనంతవరకూ స్వీట్లు తగ్గించండి. తినాలనిపిస్తే ఇంట్లో చేసిన నువ్వులు, పల్లీ లడ్డూలు తినండి. తక్కువ పరిమాణంలో ఎక్కువసార్లు తింటే రక్తంలో చక్కెరస్థాయులు నియంత్రణలో ఉండి, క్రేవింగ్స్ కూడా తగ్గుతాయి.

# కడుపుబ్బరానికి.. ఇవీ కారణం కావచ్చు..!

ఇష్టమైన ఆహారం ఎక్కువగా లాగించినా, మలబద్ధకం ఉన్నా, కడుపులో గ్యాస్ ఏర్పడినా, నీళ్లు ఎక్కువగా తాగినా, నెలసరి సమయంలో.. ఇలా పలు సందర్భాల్లో కడుపు ఉబ్బరంగా అనిపించడం సహజమే! దాంతో తలెత్తే అసౌకర్యం వల్ల



ఇతర పనులపై దృష్టి పెట్టలేం.. మరి, ఈ సమస్యను తగ్గించుకోవాలంటే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. పీచు, ద్రవాహారం తక్కువగా తీసుకోవడం.. వ్యాయామం చేయకపోవడం.. వంటివి మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ సమస్య వల్ల కడుపుబ్బరం సమస్య తలెత్తవచ్చని చెబుతున్నారు. అందుకే పీచు అధికంగా ఉండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో మహిళలు రోజూ తాము తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. తృణధాన్యాలు, పండ్లు, కాయగూరలు, పప్పులు, నట్స్, గింజల్లో.. పీచు అధికంగా ఉంటుంది. వీటితో పాటు ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలంటున్నారు నిపుణులు. సమయం లేదనో, ఇతర కారణాల రీత్యానో కొంతమంది గబగబా భోజనం చేసేస్తుంటారు. కడుపు లో గ్యాస్, ఉబ్బరానికి ఇది కూడా ఓ కారణమే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇలా త్వరత్వరగా తినడం వల్ల ఆహారంతో పాటు గాలి కూడా కడుపులోకి వెళ్లిపోయి ఈ సమస్యల్ని తెచ్చిపెడుతుందట! అందుకే భోజనానికి కనీసం అరగంటైనా కేటాయించమంటున్నారు. అలాగే ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినడమూ ముఖ్యమేనట! ఈ క్రమంలో పదార్థం రుచిని ఆస్వాదించడంతో పాటు జీర్ణవ్యవస్థ కూడా చురుగ్గా ఉంటుందని, మరీ ఎక్కువ ఆహారం తీసుకోకుండానూ జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. కడుపులోని మంచి బ్యాక్టీరియా ఉబ్బరాన్ని తగ్గిస్తుందట! ఇందుకోసం ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు, మజ్జిగ.. వంటివి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోమంటున్నారు నిపుణులు. రాత్రుళ్లు ఆలస్యంగా తినడం, అర్ధరాత్రి దాటాక పడుకోవడం వల్ల నిద్ర సరిపోదు. తద్వారా ఆహారం అరక్కపోవడం, గ్యాస్, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. అందుకే త్వరగా తినడం, వేళకు పడుకోవడం మంచిదని చెబుతున్నారు.

# ఆహారం విషయంలో ఈ పొరపాట్లు వద్దు!

అసలే చలికాలం.. ఎండ తక్కువగా రావడంతో సరిపడా 'డి' విటమిన్ శరీరానికి అందదు. చల్లటి వాతావరణం కారణంగా వ్యాయామాలు చేయడానికి శరీరమూ సహకరించదు. వీటికి తోడు ఆకలేయదు.. దాహమూ కాదు. ఇవన్నీ రోగనిరోధక శక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఇవే కాదు.. ఈ కాలంలో తీసుకొనే ఆహారం విషయంలో తెలిసో తెలియకో చేసే కొన్ని పొరపాట్లు కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇంతకీ ఏంటా పొరపాట్లు? వాటిని సరిదిద్దుకొనే మార్గాలేంటో తెలుసుకుందాం రండి.. ఆహారాన్ని వృథా చేయడం ఇష్టం లేక ఉదయం మిగిలినవి రాత్రికి, రాత్రి మిగిలినవి మరుసటి రోజు తినడం చాలామందికి అలవాటు. కొంతమంది చలికాలంలోనూ ఇలాగే చేస్తుంటారు. కానీ ఇది ఆరోగ్యకరం కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ కాలంలో జీర్ణశక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో ఒక పూట మిగిలినవి మరో పూట తినడం వల్ల అరుగుదల శక్తి మరింతగా తగ్గిపోతుందట! తద్వారా అవి జీర్ణం కాక కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్, వికారం, వాంతులు.. వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందట! అందుకే ఈ కాలంలో ఏ పదార్థం తీసుకున్నా వేడివేడిగా తీసుకోవడమే శ్రేయస్కరం అంటు న్నారు నిపుణులు.



సాధారణంగానే చలికాలంలో జీర్ణశక్తి మందగిస్తుంటుంది. దీనికి తోడు ఈ చలికి ఉదయాన్నే నిద్ర లేచి వ్యాయామం చేయాలనిపించదు. తద్వారా బరువు తగ్గే ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి ఇలాంటి సమయంలో నెయ్యిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మరింత బరువు పెరుగుతాం అనుకుంటారు కొందరు. ఈ ఆలోచనతోనే దాన్ని పూర్తిగా పక్కన పెట్టేస్తుంటారు. కానీ ఇది పొరపాటు అంటున్నారు నిపుణులు. ఎందుకంటే మంచి కొవ్వులు అధికంగా ఉండే నెయ్యి కడుపు నిండిన భావనను కలిగిస్తుందట. తద్వారా చిరుతిండ్ల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే ఇది ఆహారపు కోరికల్ని తగ్గించి శరీరంలో పేరుకుపోయిన కొవ్వుల్ని కరిగించేందుకు సహకరిస్తుంది. ఈ రెండు ప్రయోజనాలూ బరువు పెరగకుండా అదుపులో ఉంచుకునేందుకు దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. అందుకే ఏ కాలమైనా టీస్పూన్ నెయ్యిని తీసుకోవడం ఆరోగ్యకరం అని చెబుతున్నారు. శీతాకాలంలో వాతావరణం సహజంగానే పొడిగా ఉంటుంది. దీనికి తోడు దాహం వేయట్లేదని కొంతమంది నీళ్లూ సరిగ్గా తాగరు. ఫలితంగా శరీరం డీహైడ్రేట్ అవడం, చర్మం పొడిబారడం.. వంటి సమస్యలొస్తాయి. అయితే ఇలాంటి సమయంలో కొంతమంది అదే పనిగా స్నాక్స్, ప్రిజర్వేటివ్స్ కలిపిన పదార్థాలు.. వంటివి తీసుకుంటారు. వీటిలో కొన్నిటిని నీటి శాతం పూర్తిగా తొలగించి తయారుచేస్తుంటారు. ఇలాంటి పొడి పదార్థాలు ఈ కాలంలో తీసుకోవడం వల్ల శరీరం మరింత డీహైడ్రేట్ అవుతుంది.. చర్మం ఎక్కువగా పొడిబారుతుంది. అందుకే ఈ కాలంలో ఇలాంటి వాటికి దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు.

# జీడిపప్పు ఎక్కువ తింటే ప్రమాదమా?

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన జీడిపప్పును మన ఆహారంలో తరచూ తీసుకుంటూ ఉంటాం. అయితే, జీడిపప్పును ఎక్కువగా తీసుకోవడం పలు సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తీసుకోకపోవడం మంచిందని అంటున్నారు. జీడిపప్పును మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. జీడిపప్పు, బాదం, పిస్తా, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతుంటారు. డ్రైఫ్రూట్స్ రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ కారణంగానే వీటి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ సంపన్నుల నుంచి సామాన్య ప్రజల వరకు వీటిని తమ ఆహారంలో తీసుకుంటున్నారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీడిపప్పును చాలా మంది తమ వంటకాల్లో వినియోగిస్తుంటారు.



పాయసంతోపాటు వెజ్, నాన్ వెజ్ పులావ్, బిర్యానీ, స్వీట్లు, బిస్కెట్లు, కేకులు, టాపింగ్ ఐస్‌క్రీమ్స్ లాంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొందరు జీడిపప్పును మాసాల పొడి లేదా కారం లేదా మిరియాల పొడితో నెయ్యిలో వేయించి సేవిస్తారు. ఇలా చాలా రకాలుగా జీడిపప్పును తమ ఆహార పదార్థాల్లో తీసుకుంటూ వాటి ప్రయోజనాన్ని శరీరానికి అందిస్తుంటారు. జీడిపప్పు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతారు. అంతేగాక, శరీర జీవక్రియను పెంచుతాయి. జీడిపప్పులో మోనోఅన్శాజురేటెడ్, పాలీఅన్సాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. వీటితో గుండె ఆరోగ్యానికి ప్రయోజనమే ఉన్నప్పటికీ.. హృదయ సంబంధిత వ్యాధులు ఉన్నవారు మాత్రం జీడిపప్పును ఎక్కువగా తీసుకోకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పలు ఆరోగ్య సమస్యలు కారణమవుతుందని చెబుతున్నారు. జీడిపప్పు ఆరోగ్యకరమైనది అయినప్పటికీ మితంగా తింటేనే మంచిదని అంటున్నారు. జీడిపప్పును తక్కువ మొత్తంలో తరచూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అని చెబుతున్నారు. కాగా, ప్రతీ సంవత్సరం నవంబర్ 23న జీడిపప్పు దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఆచారం మొదట అమెరికాలో ప్రారంభమైంది. జీడిపప్పు చెట్టు ఈశాన్య బ్రెజిల్‌లో పుట్టిందని చెబుతుంటారు. జీడి పప్పు రైతులను గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారు. సాధారణంగా జీడిపప్పు చెట్టు జీవితకాలం 60 ఏళ్లు. జీడిపప్పు నాటిన మూడేళ్ల లోపు దిగుబడిని ఇవ్వడం ప్రారంభిస్తుంది. గరిష్ట పంటకు ఎనిమిదేళ్లు పట్టవచ్చు.

# బిజినెస్

## 44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు

వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహన (పీవీ–కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025లో 44,89,717కు చేరాయని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడిం



చింది. 2024లో సరఫరా అయిన 42,74,793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్దుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

## బీసీసీఎల్ ఇష్యూకు 147 రెట్ల స్పందన

రూ.1071 కోట్ల సమీకరణ లక్ష్యంతో వచ్చిన, కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) ఐపీఓ ముగిసేసరికి 146.81 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 34,69,46,500 షేర్లను ఆఫర్ చేయగా, 50,93,44,51,200 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 310.81 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 258.04 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 49.26 రెట్ల స్పందన వచ్చింది.

## ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల పైనే..



మన దేశం నుంచి 2025లో రూ.4 లక్షల కోట్లకు పైగా విలువైన ఎలక్ట్రానిక్స్ ఎగుమతి అయినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్లు ఉత్పత్తి ప్రారంభించనుండటంతో, ఎగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్ విలువ మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అధికారిక అంచనాల ప్రకారం 2024-25లో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సుమారు రూ.11.3 లక్షల కోట్ల చేర జరిగింది. ఇందులో రూ.3.3 లక్షల కోట్ల విలువైనవి ఎగుమతి అయ్యాయి. 2025 క్యాలెండర్ ఏడాదిలో ఎగుమతి అయిన ఎలక్ట్రానిక్స్ విలువ రూ.4 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది.ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్ల నుంచి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుండటంతో 2026లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మరింత పెరుగుతాయని సామాజిక మాధ్యమ పోస్టులో అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశ్రమ అంచనా ప్రకారం, ఎలక్ట్రానిక్స్ రంగంలో 25 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. 2025లో మన దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ.2.03 లక్షల కోట్లకు చేరాయని మంత్రి తెలిపారు. 2024లో ఎగుమతి చేసిన రూ.1.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి రెట్టింపు కావడం గమనార్హం. మొబైల్ తయారీదార్ల పరిశ్రమ సమాఖ్య ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రకారం, దేశంలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 75 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.76 లక్షల కోట్ల)కు చేరుతుంది. ఎగుమతులు 30 బి.డాలర్లు (రూ.2.7 లక్షల కోట్లు)గా ఉంటాయని అంచనా.

## మార్కెట్లే రూపాయి విలువను నిర్ణయిస్తాయ్



దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని కేవలం కరెన్సీ మారకపు విలువతోనే లెక్కించడం సరికాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. అమెరికా డాలర్ విలువ రూ.90ని మించడం కూడా, కరెన్సీ సాధారణ కదలికల్లో భాగమేనని పేర్కొన్నారు. భారత ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని.. వృద్ధిరేటు అధికంగా ఉండటం, ద్రవ్యోల్బణం అదుపులో కొనసాగడం, ఆర్థిక స్థిరత్వం, పెట్టుబడులు–వినియోగం ఆరోగ్యకరంగా నమోదవ్వడాన్ని ఎన్‌డీటీవీ ఇంటర్వ్యూలో ఆయన ప్రస్తావించారు విదేశీ మారకపు నిల్వలు కూడా 690 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయని గుర్తు చేశారు. రూపాయి విలువ నిర్ణయం అనేది మార్కెట్ల చేతిలో ఉందని, తీవ్ర హెచ్చుతగ్గులు నమోదవ్వకుండా చూడటం వరకే ఆర్‌బీఐ పాత్ర ఉంటుందని, దీర్ఘకాలంగా మన విధానం అదేనని వివరించారు. డాలర్ విలువ రూ.90ని మించినా కూడా, తమ పాత్ర మారదన్నారు. నవంబరులో రూపాయి విలువ ఎక్కువగా తగ్గేందుకు, అమెరికా మన ఉత్పత్తులపై విధించిన అధిక సుంకాలు కూడా కారణమయ్యాయని పేర్కొన్నారు. ఎగుమతుల ఆదాయ వృద్ధి తగ్గగా, బంగారం–వెండి సహా ఇతర దిగుమతుల బిల్లు భారం పెరిగి, డాలర్‌కు గిరాకీ అధికమైందని వివరించారు. దేశీయంగా ద్రవ్యోల్బణం తక్కువగా ఉండేందుకు, సరఫరాలు మెరుగ్గా ఉండటమే కారణమని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు. ఆహార ధరలతో పాటు అంతర్జాతీయంగా కమొడిటీ ధరలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు.

## 40% పని అదే చేస్తోంది



సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ప్రస్తుతం టెక్ సంస్థల్లో దాదాపు 40% పనులు ఏఐ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ సంఘం నాస్కామ్, ఇండీడ్ సంయుక్తంగా నిర్వహించిన 'వర్క్ రీ-ఇమాజిన్- ది రైజ్ ఆఫ్ హ్యూమన్-ఏఐ కొలాబరేషన్' సర్వే తెలిపింది. 2027 నాటికి నిపుణులు, ఏఐ కలిసి పనిచేసే వాతావరణాన్ని 97% మంది మానవ వనరుల విభాగాధిపతులు ఊహిస్తున్నారు. ఆటోమేషన్ పెరుగుతున్నా, నాణ్యత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఏఐ ఒకప్పుడు బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం అయ్యేది. ఇప్పుడు టెక్ సంస్థల్లో ఒక సహోద్యోగిగా మారిపోయింది అని నివేదిక పేర్కొంది. వివిధ విభాగాల్లో 20-40% పనులను ఏఐ నిర్వహిస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఏఐని కేవలం సహాయం చేసేదిగా కాకుండా, రోజువారీ నిర్ణయాల్లో భాగంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో ఏఐతో కలిసి పనిచేసేలా ఉద్యోగులను సిద్ధం చేయడమే ప్రత్యామ్నాయమని నాస్కామ్ పరిశోధనా విభాగం అధిపతి కేతకీ కర్ణిక్ పేర్కొన్నారు. యాంత్రీకీకరణ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఏఐ ఇచ్చే ఫలితాల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో, సగంకంటే ఎక్కువ మంది ఏఐ రూపొందించిన పనుల్లో అసంపూర్ణత లేదా తక్కువ నాణ్యత ఉన్నట్లు గుర్తించారు. ఏఐ చేసే పనుల్లో కచ్చితత్వం, సమగ్రత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని నివేదిక తేల్చింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 45 శాతం పనులు ఏఐ ద్వారా జరుగుతుండగా, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటివి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది' అనేకంటే.. ఉద్యోగుల నుంచి సంస్థలు ఆశిస్తున్న పనితీరు మారుతోంది అని చెప్పొచ్చని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశి కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సరికొత్త గరిష్ఠాలకు బంగారం, వెండి..

భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఎన్నడూలేని రీతిలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళుతున్నాయి. ఫ్యూచర్ మార్కెట్‌లో కిలో వెండి ధర మార్చి డెలివరీ కాంట్రాక్ట్ ఒక్క రోజులోనే రూ.12,803 పెరిగి రూ.2.87 లక్షలకు చేరింది. బంగారం సైతం 10 గ్రాములు రూ.1.43 లక్షల వద్ద ట్రేడవుతోంది. గత నాలుగు రోజుల్లోనే వెండి ధర రూ.35 వేలు మేర పెరిగింది. ఈ ఏడాదిలో (2026) ఇప్పటివరకు రూ.52 వేలు పెరగడం గమనార్హం. గతేడాది డిసెంబర్ 31 నాటికి రూ.2.35 లక్షలుగా ఉంది.
ఇక బంగారం సైతం ఫ్యూచర్ మార్కెట్‌లో ఫిబ్రవరి కాంట్రాక్ట్ ఒక్క రోజులో రూ.932 పెరిగి రూ.1.43 లక్షల వల్ల సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇక హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో (స్పాట్ గోల్డ్) 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,600 పలుకుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,650గా ఉంది. కిలో వెండి ధర రూ.2,88,300 ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బంగారం ఔన్సు 4,638.75 వద్ద ట్రేడవుతుండగా, వెండి 90 డాలర్ల ఎగువన కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.20గా ఉంది. రూపాయి విలువ క్షీణత కూడా దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతోంది. తాజాగా విడుదలైన అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచ



నాలను పెంచాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి పేర్కొన్నారు. ఈ అంచనాలు బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమయ్యాయని తెలిపారు. కమొడిటీ ఎక్స్ఛేంజీలో వెండి ఔన్సు తొలిసారి 91 డాలర్ల మార్కును చేరుకుందన్నారు. దీనికితోడు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా మరో కారణమని తెలిపారు.

## బడ్జెట్‌లో పాడిపరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలి




వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలు సంఘటిత రంగం లోని పాడి పరిశ్రమకు ఎంతో అనుకూల పరిస్థితులను తీసుకొచ్చాయని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బ్రాహ్మణి నారా తెలిపారు. 'ప్రస్తుతం వినియోగదారులు పనీర్, చీజ్, నెయ్యి, వెన్న వంటి అధిక ప్రోటీన్లున్న ఉత్పత్తుల వైపు మొగ్గు చూపిస్తున్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతోమంది రైతులు వ్యవస్థీకృత డెయిరీ వ్యవస్థలో భాగస్వాములయ్యారు' అని పేర్కొన్నారు. '2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా పాడి పరిశ్రమ ఉత్పాదకతను పెంచడం కోసం నాణ్యమైన దాణాపై రైతులకు రాయితీలు కల్పించాలి. దేశంలో 1.2 లక్షల మంది పశు వైద్యులు అవసరం ఉండగా, ప్రస్తుతం 68,000 మందే ఉన్నారని పేర్కొన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు వెటర్నరీ కళాశాలల సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. గ్రామీణ ఉపాధి కల్పనలో కీలకమైన మినీ డెయిరీ యూనిట్లకు మూలధన రాయితీలను పెంచాలి. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి' అని బ్రాహ్మణి కోరారు.

# క్రీడలు



## ప్రణాళికల్లో వాళ్లిద్దరూ..

రాజ్‌కోట్: భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో చురుగ్గా పాల్గొంటున్నారని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ పేర్కొన్నాడు. ''కోహ్లి, రోహిత్ ప్రతి మ్యాచ్ గెలవాలని కోరుకుంటున్నారు. వారికి ఉన్న ఆపార అనుభవంతో జట్టులోని ఇతర ఆటగాళ్లకు సూచనలివ్వగలరు. ఇస్తుంటారు కూడా. వన్డే ఫార్మాట్, దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచకప్‌పై గంభీర్‌తో తమ ఆలోచనలు పంచుకుంటారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతికూలంగా చాలా చర్చ జరుగుతుంటుంది. కానీ మేం భిన్నమైన వాతావరణం చూస్తాం. ఇక్కడ అన్ని సానుకూలాంశాలే ఉంటాయి. టీ20 ప్రపంచకప్ అనంతరం ఎక్కువ వన్డేలు ఉంటాయి. 34 ఓవర్ల అనంతరం మ్యాచ్‌లో ఒక్క బంతినే కొనసాగించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. అందుకు తగ్గట్టుగా బ్యాటింగ్ లైనప్‌ను నిర్మించడంపై కసరత్తు చేస్తాం'' అని సితాన్షు అన్నాడు.

## పాక్ సంతతి ఆటగాళ్లకు వీసాల తిరస్కరణ..

ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్ 2026.. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. ఈ నేపథ్యంలో పాక్ సంతతికి చెందిన నలుగురు అమెరికా ఆటగాళ్లకు భారత వీసాల జారీలో జాప్యం నెలకొంది. అలీ




ఖాన్, జహంగీర్, మహ్మద్ మోహ్సిన్, అదిల్ ఈ జాబితాలో ఉన్నారు. భారత్ తన వీసా నిరాకరించిందనే అర్థం వచ్చేలా అలీఖాన్ ఇన్‌స్టాలో స్టోరీ పోస్ట్ చేశాడు. ఇది సోషల్ మీడియా వేదికగా పలు ఊహాగానాలకు కారణమైంది. కానీ వీసాలను నిరాకరించలేదని, ఇంకా జారీ ప్రక్రియ కొనసాగుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం యూఎస్ఏ జట్టు కొలంబోలో ఉంది. మిగతా సభ్యుల వీసా ప్రక్రియ అక్కడి భారత హై కమిషన్ ఆధ్వర్యంలో ముగిసింది. కానీ పాక్ సంతతికి చెందిన నలుగురు ఆటగాళ్ల వీసాల జారీలో మాత్రం జాప్యం నెలకొంది. వారు శ్రీలంకలోని భారత రాయబార కార్యాలయంలో అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఈ దశలో వీసాలను ప్రాసెస్ చేయలేమని ఆ ఆటగాళ్లకు సమాచారం అందింది. సాయంత్రం తరువాత, అమెరికా మేనేజ్‌మెంట్‌కు భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ వచ్చింది. అవసరమైన సమాచారంలో కొంతే అందిందని, విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఇంకా అదనపు సమాచారం రావాల్సి ఉంది' అని అధికారిక వర్గాలు తెలిపాయి.

## లక్ష్యసేన్ శుభారంభం



దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21-12, 21-15తో ఆయుష్ శెట్టిపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో గాయత్రి ద్వయం 21-15, 21-11తో ఆర్చిచా, సుకిత (థాయ్‌లాండ్) జంటపై గెలుపొందింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) 21-19, 21-15తో రైకో గుంజి (జపాన్)ని ఓడించింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ 21-15, 21-18తో ఆంగ్ సిన్, తియో యి (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. అపరిశుభ్రం.. బ్లిక్‌ఫెల్డ్: ఇండియా ఓపెన్‌కు ఆతిథ్యమిస్తున్న ఇందిర గాంధీ ఇండోర్ స్టేడియంపై డెన్మార్క్ క్రీడాకారిణి మియా బ్లిక్‌ఫెల్ట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇండోర్ స్టేడియంలోని పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయని విమర్శించింది. వార్మప్ కోర్టుల్లో పక్షుల రెట్టలు ఉండటం.. తీవ్ర చలితో క్రీడాకారులు వింటర్ జాకెట్లు, గ్లోవ్స్ ధరించాల్సి రావడంపై ఆవేదన వ్యక్తంచేసింది. ఈ పరిస్థితులు గాయాలు, అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉన్నందున బీడబ్ల్యూఎఫ్ జోక్యం చేసుకోవాలని కోరింది. ఆగస్టులో ఇక్కడ జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ వరకైనా సౌకర్యాలు మెరుగుపడాలని మిషెల్ లీ (కెనడా), ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) ఆకాంక్షించారు.

## ఆ సిరీస్ తర్వాత అలీసా రిటైర్మెంట్




సిడ్నీ: ఆస్ట్రేలియా మహిళల కెప్టెన్ అలీసా హీలీ ఆటకు వీడ్కోలు పలకనుంది. మార్చిలో సొంతగడ్డపై భారత్‌తో జరిగే సిరీస్ ఆడి కెరీర్ ముగించాలని ఆమె నిర్ణయించుకుంది. భారత్‌తో మూడు వన్డేలు.. పెర్త్‌లో ఏకైక టెస్టులో చివరిసారిగా ఆస్ట్రేలియా జట్టుకు అలీసా సారథ్యం వహించనుంది. ఈ ఏడాది చివర్లో ఇంగ్లాండ్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లేనందున.. టీమ్‌ఇండియాతో టీ20 సిరీస్‌లో ఆమె పాల్గొనట్లేదు. ''భారత్‌తో జరిగే సిరీసే ఆసీస్ తరఫున చివరిది కావడం మిశ్రమ భావోద్వేగాల్ని కలిగిస్తోంది. ఇప్పటికీ ఆసీస్‌కు ఆడటం నాకెంతో ఇష్టం. కానీ మొదట్నుంచీ నన్ను ముందుకు నడిపించిన పోటీతత్వం కొంతవరకు కోల్పోయాను. వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయమని అనిపిస్తోంది'' అని అలీసా తెలిపింది. 35 ఏళ్ల అలీసా ఇప్పటి వరకు ఆసీస్ తరఫున 10 టెస్టులు (489 పరుగులు), 123 వన్డేలు (3563), 162 టీ20 (3054)ల్లో బరిలో దిగింది. మూడు ఫార్మాట్లలో కలిపి 8 శతకాలు, 38 అర్ధ సెంచరీలు సాధించింది.

## కోచ్‌లకూ టాప్స్



దిల్లీ: భారత క్రీడారంగంలో శిక్షకుల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ కీలక ప్రతిపాదనలు చేసింది. ప్రతిభావంతులైన క్రీడాకారుల కోసం అమలు చేస్తున్న 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్) తరహాలోనే.. శిక్షకులకు కూడా 'కోచ్ టాప్స్' పథకాన్ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. ఈమేరకు 43 పేజీల సమగ్ర నివేదికను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు సమర్పించగా.. ఈ సూచనల్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దేశంలో కోచ్‌ల పురోగతి క్రమబద్ధంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి జాతీయ కోచ్ అక్రిడిటేషన్ బోర్డు (ఎన్‌సీఏబీ) ఏర్పాటు అవసరమని గోపీచంద్ కమిటీ అభిప్రాయపడింది. ఈ బోర్డు భారత శిక్షణ వ్యవస్థకు కేంద్ర నాడీ వ్యవస్థలా పనిచేస్తూ.. జవాబుదారీతనాన్ని పర్యవేక్షిస్తుందని పేర్కొంది. ఈ బోర్డులో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు, క్రీడా శాఖ కార్యదర్శి, జాతీయ స్థాయి ప్రముఖులు, విద్యావేత్తలు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం పటియాలా లోని ఎన్ఐఎస్‌లో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సుల స్థానంలో కొత్త విధానాన్ని ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి, మధ్య, ఎలైట్, జాతీయ జట్టు కోచ్‌లుగా వివిధ దశల్ని సూచించింది.

## ఆమె మనిషి కాదు..రోబో



దిల్లీ: బ్యాడ్మింటన్‌లో ఆమె 35 బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు నెగ్గింది. పది సార్లు రన్నరప్‌గా నిలిచింది. ప్రతి పెద్ద టోర్నీలో ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుని క్రీడా ప్రపంచం చూపు తన వైపు తిప్పుకొంది. ఆమె కేవలం 23 ఏళ్లకే ఇదంతా సాధించింది. మహిళల సింగిల్స్‌లో సంపూర్ణ ఆధిపత్యం కొనసాగిస్తోంది దక్షిణ కొరియాకు చెందిన యువ షట్లర్ అన్ సియంగ్. స్కాట్లాండ్ షట్లర్ క్రిస్టీ గిల్మోర్ మాటల్లో చెప్పాలంటే సియంగ్ మనిషి కాదు రోబో. ''ఆమె ఒక రోబో. చిన్న వయసు నుంచే ఆమె కష్టపడిన తీరు అద్భుతం. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆమెపై గెలవడం కష్టం. కనీసం ఒక్క పాయింట్ సాధించాలన్నా శ్రమించాల్సి ఉంటుంది. తరానికి ఒక ప్లేయర్ ఆమె. రాబోయే కొన్ని తరాలకు సియంగ్ ఆదర్శం. ఆమె కోర్టులో చురుకుగా కదులుతూ, గాయాలబారిన పడకుండా ఫిట్‌నెస్‌ను గొప్పగా కాపాడుకుంటోంది'' అని గిల్మోర్ కొనియాడింది. 2017లో పదిహేనేళ్ల వయసులో ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తన జట్టును గెలిపించడం ద్వారా సియంగ్ వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది సీనియర్ జట్టులో చోటు సంపాదించింది. 2019లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. కరోనా కారణంగా రెండేళ్లు ఆమె ఆట ఒడిదొడుకులకు గురైంది. కానీ 2023లో అత్యుత్తమ స్థాయికి చేరుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ గెలిచిన దక్షిణ కొరియా తొలి షట్లర్‌గా ఆ ఏడాది ఘనత సాధించిన సియంగ్.. తొలిసారి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంకును కైవసం చేసుకుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లోనూ స్వర్ణం నెగ్గింది. మహిళల బ్యాడ్మింటన్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 2024 పారిస్ ఒలింపిక్స్ స్వర్ణం కైవసం చేసుకుంది. ఇప్పటివరకు 128 వారాలు అగ్రస్థానంలో ఉన్న అన్ సియంగ్‌ను ఓడించడం దాదాపుగా అసాధ్యమనే చెప్పొచ్చు. ప్రస్తుతం ఆమె ఫామ్ ఆ స్థాయిలో ఉంది. ''ఆమె కఠిన ప్రత్యర్థి. మానసికంగా, శారీరకంగా దృఢంగా లేకపోతే ఓడించలేం. ఆమెతో పోరులో ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఏమరపాటుగా ఉండకూడదు. చిన్న అవకాశమొచ్చినా పుంజుకుంటుంది. సియంగ్ ఆడుతున్నంతసేపు ప్రేక్షకులు ఉత్సాహంగా ఆమె ఆట చూస్తూనే ఉంటారు. ఆమె ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం'' అని మిషెలీ లీ (కెనడా) చెప్పింది. ఇటీవల ముగిసిన మలేసియా ఓపెన్‌లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సియంగ్ చేతిలో మూడు మ్యాచ్‌లు ఓడింది మిషెలీ. ఇండియా ఓపెన్‌లో అన్ సియంగ్ టాప్‌సీడ్‌గా బరిలో ఉంది.

# నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1430 క్యూసెక్కుల ఇన్ ఫ్లో





**నిజాంసాగర్, వుదయం :**

నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్నటువంటి సింగూరు ప్రాజెక్టు నుండి నిజాంసాగర్ లోకి 4380 క్యూసెక్కుల నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులో కి వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సింగూరు ప్రాజెక్టు కట్ట మరమ్మత్తులు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రాజెక్టులోని కొంత భాగం నీటిని నిజాంసాగర్ లోకి వదలడం జరుగుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కాగా నిజాంసాగర్ రాయకట్టు వంటకాలువ కింద సాగు చేస్తున్న పంట పొలాల వ్యవసాయ అవసరాల కొరకు 700 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# కేటీఆర్‌వి అటెన్షన్ డైవర్షన్ డ్రామా లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ధర్మపురి, వుదయం:**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించే నాటకాలని రాష్ట్ర సంక్షే మ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డా రు.బుధవారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేక రులతో మాట్లాడారు.అబద్ధాల రాజకీయాలకు తెరలేపారు

పదేళ్ల పాలనలో విఫలమై,నేడు ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బీఆర్ఎస్ నేతలు అబద్ధాల రాజకీయాలకు దిగుతున్నారని మంత్రి విమర్శిం చారు. కృష్ణ జలాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, గతంలో ఇదే అంశంపై అసెంబ్లీలో చర్చకు వస్తే భయపడి పారిపోయిన చరిత్ర బీఆర్ఎస్‌ది అని ఆయన గుర్తు చేశారు. కృష్ణ, గోదావరి జలాల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర సంపదను విచ్చలవిడిగా దోచుకుంది.ఆ పాపాల ఫలితంగానే నేడు తెలం గాణ భారీ ఆర్థిక భారాన్ని మోయా ల్సి వస్తోంది అని త్రి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోని దోపిడీ పాలనకు భిన్నంగా,ప్రస్తుతం కాంగ్రె స్ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ గా ఉంటూ పారదర్శక పాలన అందిస్తోందని పేర్కొన్నారు.మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే తీర్పు సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణ పాఠం చెప్పారని,అది కేవలం ఆరంభం మాత్ర మేనని అడ్లూరి వ్యాఖ్యానించారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆ పార్టీని ప్రజలు పూర్తిగా తిరస్కరించడం ఖాయమని

ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి స్పష్టం చేశారు.

# యువత క్రీడల్లో రాణించాలి



**వుదయం కొండపాక :**

మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో

మంగళవారం రోజు గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు నిర్వాహకులు ప్రవీణ్, తరుణ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, జూదం లాంటి చెడువ్యాసనాల బారిన పడకుండా యువత క్రీడల్లో తరుచు పాల్గొనాలని కోరారు. క్రీడలో రాణిస్తూ దేహ దారుఢ్యంతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా స్పోర్ట్స్ ఖాతాలో ప్రభుత్వ ఉద్యోగాలు కూడా సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. యువత తలుచుకుంటే కానీ పని అంటూ ఉండదు కాబట్టి పట్టుదలతో ముందుకు సాగుతూ ఐక్యత చాటాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్న ప్రవీణ్, తరుణ్ లను గ్రామస్థులు ప్రశంశించారు.

మంగళవారం నిర్వహించిన పోటీలో సనువాల రవి, వెంకటేష్,రాజు, రమేష్ ల విన్నర్ టీం గెలుపొందినట్టు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువత క్రీడాకారులు పాల్గొన్నారు.

# శ్రీరాంపురంలో మొక్కలు నాటిన మంత్రి తుమ్మల





**దమ్మపేట వుదయం :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాదమ్మపేట మండల పరిధిలోని శ్రీరాంపురం గ్రామంలో బుధవారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మొక్కలు నాటినారు. శ్రీరాంపురం గ్రామ సమీపంలో గ్రామస్తులు వాకింగ్ ట్రాక్ కోసం ఏర్పాటు చేసుకున్న రోడ్డుకు ఇరువైపులా మంత్రి తుమ్మల మొక్కలు నాటారు. వేసిన ప్రతి మొక్క బ్రతికే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గ్రామ సర్పంచుకు, గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతో పాటు నున్న. రత్నారావు, దొడ్డ. ప్రసాదు, పైడి వెంకటేశ్వరరావు, నాగప్రసాద్, అచ్యుతరావు, కె.వి, సత్యనారాయణ, తోపాటు సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు, శ్రీరాంపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలు–యువత ఉత్సాహంతో

# సంక్రాంతి ముగ్గుల పోటీలు





**వుదయం , సిద్దిపేట:**

సిద్దిపేట పట్టణంలోని 10వ వార్డులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. బింగి బాలలక్ష్మీ – రాజేశం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం, యువజన విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజుల రాజనర్సు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగలు మన సంస్కృతికి ప్రతీకలని, మహిళలు మరియు యువత ఈ తరహా సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. 10వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 150 మందికి పైగా మహిళలు, యువతులు చిన్నా–పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు, సాంప్రదాయ డిజైన్లతో వార్డు అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.ముగ్గుల పోటీలు జరుగుతున్న సమయంలో గంగిరెద్దుల ఆట విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రాచీన కాలం నుంచి కొనసాగుతున్న గంగిరెద్దుల సంప్రదాయాన్ని పెద్దలు గుర్తు చేస్తుండగా, పిల్లలను సైతం ఈ విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు గంగిరెద్దుల విన్యాసాలను వీక్షించి కళాకారులను అభినందించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి మున్సిపల్ చైర్మన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, చేర్యాల వెంకన్న, డాక్టర్ విటోబా, డాక్టర్ చంద్రారెడ్డి, వినయ్ రాజ, విజయ్ తదితరులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు సిద్దిపేట పట్టణంలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చాయని స్థానికులు పేర్కొన్నారు.

# మధిర మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దటమే లక్ష్యం

: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.



**మధిర, వుదయం :**

మధిర మున్సిపాలిటీ నీ రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఇప్పటికే ప్రకటించారు.మధిర మున్సిపాలిటీలో వరద నీటి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతిపాదించిన పనులకు గాను మున్సిపల్,అర్బన్ డెవలప్మెంట్ శాఖ నుంచి 140 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.ప్రతి ఇంటి నుంచి వచ్చే మురుగునీటి తరలింపుకు ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఓవైపు జరుగుతుండగా తాజాగా మంజూరైన భారీ మొత్తం నిధులతో వరద ముంపు లేకుండా శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమయింది. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద140 కోట్లు మంజూరు అయ్యాయి. వరద నీటి కాలువలు, మధిర మున్సిపాలిటీ నీ వైరా నది వరద ముంపు నుంచి శాశ్వత ముగా విముక్తి కల్పించేందుకు భారీ రిటైనింగ్ వాల్, ప్రస్తుతం మధిర మున్సిపాలిటీలో ఉన్న వరద నీటి కాలువలకు రీ డిజైనింగ్ పనులు తాజా నిధుల ద్వారా చేపట్టనున్నారు. పట్టణంలో వరద నీటిని మళ్లించేందుకు ఆర్సీఎం చర్చి రోడ్డు నుంచి సాయిబాబా టెంపుల్ వరకు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వరద కాలువ నిర్మాణం చేపట్టనున్నారు. పులకడం వారి వీధి, ఆర్ అండ్ బి సబ్ డివిజన్ ఆఫీసు నుంచి శివాలయం వరకు, రామాలయం నుంచి యాదవ బజార్ వరకు, రైస్ మిల్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు,వ్యవసాయ మార్కెట్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు, ఇల్లందుల పాడు ప్రాంతంలో అదేవిధంగా మడుపల్లి ప్రాంతంలో, అంబారుపేట,

మరియు శివాలయం నుంచి రాయపట్నం బ్రిడ్జి వరకు మొత్తం వరద కాలువల నిర్మాణానికి రూ.40 కోట్లు ఖర్చు చేయనున్నారు.

మధిర మున్సిపాలిటీ వెంట ప్రవహిస్తున్న వైరా నది పొడవునా మొత్తంగా భారీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.65 కోట్ల రూపాయలు వెచ్చించనున్నారు.ప్రస్తుతం మధిర మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వరద కాలువలు అన్నింటిని రీ డిజైనింగ్ చేయడానికి రూ.35 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# 17 న సాయుధ పోరాట అమరుల సంస్మరణ సభ

మచ్చా వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ
విలేకరుల సమావేశంలో మచ్చా విద్యాసాగర్




**ఖమ్మంవుదయం :**

: తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ అమరులు మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి ల 77వ సంస్మరణ సభ ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు మచ్చా విద్యాసాగర్ తెలిపారు.

ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సమ సమాజ నిర్మాణం కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 1949 జనవరి 17న ఆనాడు నెహ్రూ సైన్యం కాల్చి చంపారని, ఈ పోరాటంలో మచ్చా వీరయ్య, వెలగపూడి కృష్ణమూర్తి లు అమరులు అయ్యారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం 77వ సంస్మరణ సభ ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ త రాష్ట్ర కార్యదర్శి పోటురంగారావు ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఏపీ అధికార ప్రతినిధి ఐఎఫ్ టు ప్రసాద్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ , చావా రమేష్, దురుసోజు రమేష్ తో పాటు అనేక మంది అతిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎన్ తిర్మల్ చే రచించిన మచ్చ వీరయ్య జీవిత చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. గోకనపల్లిలో జరిగే సంస్మరణ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో మోడెం వెంకన్న, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మచ్చ సూర్యనారాయణ, అడ్వకేట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 18న సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్**

**ఖమ్మం,వుదయం :**

జనవరి 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన ఉన్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.

జిల్లా ఇంచార్జి కలెక్టర్, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి పరిధిలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నర్సింగ్ కళాశాల ప్రక్కన హెలీ ప్యాడ్ ను డిజిసిఏ స్టాండర్డ్ ప్రకారం ఏర్పాటు చేయాలని, అక్కడ ఫైర్ వాహనం సిద్ధంగా ఉంచాలని అన్నారు. సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్యులతో కూడిన బృందాన్ని ప్రోటోకాల్ ప్రకారం 108 వాహనంతో సహా ముఖ్యమంత్రి కాన్వాయ్ లో ఉంచే విధంగా సిద్ధం చేయాలని అన్నారు.

ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం మంచి వాహనాలను ఎంపిక చేయాలని ఇంచార్జ్ కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో చేస్తున్న కార్యక్రమ వివరాలను శాఖల వారీగా అందించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసుకోవాలని అన్నారు.

ఈ పర్యటనలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ వెంట ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోవిందుపల్లెలో వైభవంగా ముగ్గుల

**ధర్మపురి ,వుదయం ప్రతినిధి):**



సంక్రాంతి పండుగను పురస్కరిం చుకొని మండలంలోని గోవిందు పల్లె గ్రామంలో మహిళల కు ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాజరపు లలిత రాజేశం, ఉపస ర్పంచ్ కోలా రాయమల్లు, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో గ్రామ మహిళలు ఉత్సాహం గా పాల్గొన్నారు.రంగురంగుల ముగ్గులతో వీధులన్నీ శోభాయ మానంగా మారాయి.ఈ సంద ర్భంగా సర్పంచ్ లలిత మాట్లా డుతూ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకో వడంతో పాటు మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయ డమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామంలో ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులు అందజేశారు.పాల్గొన్న ప్రతి ఒక్కరికీ గ్రామ పంచాయతీ పాలకవర్గం తరపున ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు ఖమ్మం సారథినగర్ లో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



**ఖమ్మం వుదయం :**

సంక్రాంతి పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తోట రామారావు తన ధర్మపత్ని,48వ డివిజన్ కార్పోరేటర్ గోవిందమ్మతో కలిసి ముగ్గుల పోటీలు

నిర్వహించారు.ఖమ్మం సారథినగర్ రామాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ పోటీలకు మహిళామణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ముగ్గుల పోటీల నిర్వాహకులు తోట రామారావు–గోవిందమ్మ పుణ్య దంపతులను,వారి కుమారులు రమేష్,డాక్టర్ లక్ష్మణ్, కుటుంబ సభ్యులను అభినందించారు.హాజరైన వారందరికి ఎంపీ రవిచంద్ర భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారి నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.పోటీలలో పాల్గొన్న, కార్యక్రమానికి హాజరైన మహిళామణులకు ఎంపీ వద్దిరాజు,మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ,బీఆర్ఎస్ నాయకులు ఆర్జేసీ కృష్ణ,పగడాల నాగరాజు, కిరణ్, తోట రామారావు,కార్పోరేటర్ గోవిందమ్మలు చీరల్ని బహుకరించారు.

## ముగ్గుల పోటి విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మంత్రి జలగం ప్రసాద్

**వేంసూర్ ,వుదయం :**



వేంసూరు మండలం పరిధిలోని చౌడవరం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ అంజమ్మ చిన్ని కృష్ణ ఉప సర్పంచ్ గొర్ల సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భోగిమంటల సంబరాలు కోలాటం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జలగం ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై సంక్రాంతి ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళ విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు

. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మరియు గొర్ల భానుచందర్ రెడ్డి మారిశెట్టి నరసరావు కొప్పుల మురళి మహేష్ వెంకటనారాయణ పల్లెవాడ సర్పంచి శ్రీదేవి భాను ప్రకాష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తీగలాధర్మారంలో వైభవంగా ముగ్గుల పోటీలు



**ధర్మపురి,వుదయం :**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని తీగలాధర్మారం గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పందిరి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ముఖ్య అతిథులుగామార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సంగ నర్సింలు, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్ పాల్గొన్నారు.గ్రామానికి చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగురం గుల ముగ్గులతో వీధుల ను అందంగా తీర్చిదిద్దారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ప్రథమ బహుమతి నడిగోటి జ్యోతి,ద్వితీయ బహుమతి సర్గం పుష్పలత,తృతీయ బహుమతి మారాజు జమున.ఈ సందర్భం గా సర్పంచ్ మాట్లాడుతూ మన సం స్కృతి సంప్రదాయాలను కాపాడు కోవడం లో ఇటువంటి పోటీలు దోహదప డతాయని వారు పేర్కొ న్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గంధం రమేష్, సత్తయ్య, నిరూప, జలజ, ఆశీనాబేగం, ముత్యం, సంతోష్, ఉపేందర్, చందపాషా, పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు

## ఓటర్ల జాబితా

# తప్పుల తడక



మున్సిపల్ అధికారుల తీరుపై ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ధ్వజం

**ధర్మపురి, వుదయం :**

ర్మపురి మున్సిపాలిటీలో ఓటర్ల జాబితా తయారీ అత్యంత అస్తవ్యస్తంగా తయారైందని, అధికారుల నిర్లక్ష్యం తో ఈ గందరగోళం నెలకొందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ధర్మపురిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఓటర్ల జాబితాను రూపొందించారని ఆయన మండిపడ్డారు.వార్డులు మారిన ఓటర్లు గల్లంతైన అభ్యర్థులుమున్సిపల్ జీవో ప్రకారం ఓటరు నివాసం ఉండే గృహం ఆధారం గానే వార్డును కేటాయించాల్సి ఉండగా, అధికారులు నిబంధన లకు విరుద్ధంగా వ్యవహరించారని శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. కేవలం ఇంటి నంబర్ల ఆధారంగా జాబితా సిద్ధం చేయడం వల్ల తీవ్ర గందరగోళం ఏర్పడిందన్నారు.6వ వార్డుకు చెందిన 180 మంది ఓటర్లను 14వ వార్డులోకి మార్చా రని తెలిపారు.అదే విధంగా 6వ వార్డులోని మరో 130 మంది ఓటర్లను 7వ వార్డుకు బదిలీ చేశారని పేర్కొన్నా రు.పలు వార్డు ల్లో పోటీ చేసేందుకు సిద్ధమైన అభ్యర్థుల ఓట్లే జాబితాలో గల్లంతు కావడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు.

ఈ మొత్తం వ్యవహా రంపై మంత్రి సమాధానం చెప్పాలని, బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, మాజీ మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, నాయకులు వోడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, ఎల్లగౌడ్, చిర్నేని నర్సయ్య, అనంతుల లక్ష్మణ్, తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, జెట్టి రాజన్న, బాకీ శేఖర్, కాశెట్టి విజయ్, రాజిరెడ్డి, ఆసిఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వుదయం సినిమా



## గ్లామర్ కాదు.. పాత్రలు, కథలే ముఖ్యం

చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది సారా అర్జున్. ఇక ఇటీవల 'ధురంధర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయి.. సెన్సేషనల్ బ్యూటీగా మారింది. హీరోయిన్‌గా చేసిన తన మొదటి మూవీనే బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవడంతో పాటు పలు సంచలన రికార్డులు క్రియేట్ చేయడంతో అమ్మడు రేంజ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఊహించని పాపులారిటీ దక్కడంతో పాటుగా.. వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా అర్జున్ తనకు గ్లామర్ పాత్రలకంటే.. సవాళ్లతో కూడిన పాత్రలకే తాను ప్రాధాన్యత ఇస్తానని కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. ''నటిగా గ్లామర్ కాదు.. సవాళ్లతో కూడిన పాత్రలు, బలమైన కథలే ముఖ్యం.

## 'అనగనగా ఒక రాజు'

### సినిమాకి బ్లాక్ బస్టర్ టాక్ ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు: నవీన్ పొలిశెట్టి



**చిత్రం:** అనగనగా ఒక రాజు
**తారాగణం:** నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి
**సంగీతం:** మిక్కీ జె. మేయర్
**దర్శకత్వం:** మారి
**నిర్మాతలు:** సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య
**నిర్మాణ సంస్థలు:** సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్
**సమర్పణ:** శ్రీకర స్టూడియోస్
**పీఆర్ఓ:** లక్ష్మీవేణుగోపాల్

ఈ సంక్రాంతిని నవ్వుల పండుగలా మార్చడానికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో థియేటర్లలో అడుగుపెట్టారు స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి. మూడు వరుస ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని.. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు.

భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, చివరిలో భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని.. అసలు సిసలైన పండగ సినిమాలా ఉందని 'అనగనగా ఒక రాజు' చూసిన ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు. మొదటి షో నుంచే 'అనగనగా ఒక రాజు' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో.. తాజాగా సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు తమ సంతోషాన్ని పంచుకుంది.

స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఓవర్సీస్ లో ప్రీమియర్ షోల నుంచే అద్భుతమైన స్పందన లభించింది. థియేటర్ లో ప్రతి ఒక్కరూ సినిమాని ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అంటూ ప్రేక్షకుల నుంచి ఈ స్థాయి స్పందన రావడం సంతోషంగా ఉంది. ఇంకా సినిమా చూడనివారు టికెట్ బుక్ చేసుకొని వెళ్ళండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ రోజు ఉదయం హైదరాబాద్ లోని శ్రీరాములు థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి సినిమా చూశాము. ఫస్ట్ హాఫ్, సెకండ్ హాఫ్ అనే తేడా లేకుండా సినిమా అంతా నవ్వుతూనే ఉన్నారు ప్రేక్షకులు. అదే సమయంలో క్లైమాక్స్ లో ఎమోషన్ కూడా బాగా వర్కౌట్ అయిందని అంటున్నారు. హాయిగా నవ్వుకుందామని వస్తే, చివరిలో కంటతడి పెట్టించారు అంటూ ఎందరో ప్రశంసిస్తున్నారు. మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ ని ఇచ్చిన ప్రేక్షకులకు పేరుపేరునా కృతజ్ఞతలు. మాకు మద్దతుగా నిలిచిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు." అన్నారు.

కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. "మా సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందన చాలా సంతోషాన్ని కలిగించింది. ఈ ఫలితం మా అందరి కష్టాన్ని మర్చిపోయేలా చేసింది. నేను పోషించిన చారులత పాత్ర బాగుందని అందరూ ప్రశంసించడం ఆనందంగా ఉంది. నటిగా ఇది ఛాలెంజింగ్ పాత్ర. మొదటిసారి ఇలాంటి క్యూట్ మాస్ కామెడీ చేశాను. సంక్రాంతి పండుగకు నేను నటించిన సినిమా విడుదలై విజయం సాధించడం నాకు మరింత ఆనందాన్ని ఇచ్చింది. అందరూ ఈ సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను." అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "అనగనగా ఒక రాజు సినిమాపై ముందు నుంచి నమ్మకంగా ఉన్నాము. ఆ నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. అన్ని చోట్లా సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. ప్రేక్షకులు సినిమాలో కామెడీని ఎంత ఎంజాయ్ చేస్తున్నారో.. అంతకన్నా ఎక్కువ చివరిలో ఎమోషన్ కి కనెక్ట్ అవుతున్నారు. రానున్న రోజుల్లో థియేటర్ల సంఖ్య పెరిగే అవకాశముంది. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ లో భారీ వసూళ్లు వస్తాయి." అన్నారు.

## సంక్రాంతి కానుకగా ఆకాష్ - భైరవి అర్ధ్యా జంటగా 'కొత్త మలుపు'



**చిత్ర వివరాలు:**
**నటీనటులు:** ఆకాష్ (హీరో), భైరవి అర్ధ్యా (హీరోయిన్), రఘు బాబు, పృధ్వి, ప్రభావతి, మహేందర్, డీడీ శ్రీనివాస్, కిట్టయ్య తదితరులు
**బ్యానర్:** తథాస్తు క్రియేషన్స్
**దర్శకత్వం:** శివ వరప్రసాద్ కేశనకుర్తి
**నిర్మాత:** తాటి బాలకృష్ణ
**సహ నిర్మాత:** తాటి భాస్కర్
**సంగీతం:** యశ్వంత్
**పీఆర్వో:** కడలి రాంబాబు, దయ్యాల అశోక్

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రేక్షకులకు ప్రత్యేక కానుకగా 'కొత్త మలుపు' సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా, భైరవి అర్ధ్యా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోంది. శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వంలో, తాటి బాలకృష్ణ నిర్మాణంలో రూపొందుతున్న ఈ సినిమాలో సీనియర్ నటులు రఘు బాబు, పృధ్వి, ప్రభావతి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాటల్లో.. "రొమాంటిక్ లవ్ సస్పెన్స్‌తో పాటు హాస్యరసాన్ని కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందించాం. ఆకాష్-భైరవి జోడీ చాలా చక్కగా కుదిరింది. వీరు బావ-మరదలుగా నటిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ఫస్ట్ లుక్ విడుదల చేశాం. త్వరలోనే సినిమా విడుదలకు సిద్ధమవుతాం." అని చెప్పారు.

నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ.. "ఈ మూవీని పూర్తిగా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిస్తున్నాం. గ్రామీణ వాతావరణంలో సాగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం." అని అన్నారు.

గ్రామీణ నేపథ్యంతో, ప్రేమ-సస్పెన్స్-కామెడీ మేళవింపుతో రూపొందుతున్న 'కొత్త మలుపు' ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రేక్షకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## అల్లు అర్జున్ అభిమానులకు గుడ్‌న్యూస్

### ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ భారీ ప్రాజెక్ట్






సంక్రాంతి రోజున ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులకు మరో గుడ్‌న్యూస్ వచ్చేసింది. అల్లు అర్జున్ హీరోగా బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ ప్రతిష్ఠాత్మక సినిమా రాబోతుంది. ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఇద్దరు స్టార్స్ కలిసి పని చేయబోతోన్న ఈ సినిమా ఆడియెన్స్‌కు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది.

ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను పవర్‌ఫుల్ వీడియో కంటెంట్‌తో అనౌన్స్ చేయటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, బివి వర్క్స్‌తో కలిసి నిర్మిస్తోన్న ఈ సినిమా నేషనల్ రేంజ్‌లో అభిమానులు, ప్రేక్షకుల అంచనాలను పెంచేస్తోంది.

ఈ భారీ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. బన్నీవాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో ఇప్పుడీ అనౌన్స్‌మెంట్ తెగ వైరల్ అవుతోంది. సినిమా ఎలా ఉండబోతుంది, కథేంటి అనే అంశాలపై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి.

తిరుగులేని స్టైల్, ఎలక్ట్రిఫైయింగ్ స్క్రీన్ ప్రెజన్స్, పాన్ ఇండియా స్టార్‌డమ్ ఉన్న అల్లు అర్జున్.. వాస్తవానికి దగ్గరగా ఉండే, హై ఇంపాక్ట్ ఫిల్మ్ మేకింగ్‌తో కమర్షియల్ సినిమాలకు కొత్త అర్థం ఇచ్చిన దర్శకుడు లోకేష్ కనకరాజ్ కలిసి ఈ సినిమాలో పని చేస్తున్నారు. వీరికి తోడుగా రాక్‌స్టార్ అనిరుధ్ కూడా జాయిన్ కావటం విశేషం.

సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమా షూటింగ్ 2026 ఆగస్టులో ప్రారంభం కానుంది. AA23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ డైనమిక్ దర్శకత్వంలో ఇప్పటివరకు ఎప్పుడూ చూడని కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. రీసెంట్ టైమ్స్‌లో అందరూ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా మారింది.



## అంతేగా అంతేగా..

**సంక్రాంతి కానుకగా ఈ నెల 12న విడుదలైన 'మన శంకరవరప్రసాద్ గారు' పాజిటివ్ టాక్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయోత్సాహంలో ఉన్న చిత్ర బృందం సంబరాలు చేసుకుంది. సంబంధిత వీడియో తాజాగా విడుదలైంది. సినిమాలోని పాటను గుర్తుచేస్తూ.. 'ఏంది వెంకీ సంగతి' అని చిరంజీవి అడగ్గా 'అదిరిపోయిందిగా సంక్రాంతి' అంటూ వెంకటేశ్ రిప్లై ఇచ్చారు. తర్వాత ఇద్దరూ 'అంతేగా అంతేగా' అంటూ సందడి చేశారు.**



## ఆ విషయల్లో కీలక నిర్ణయం తీసుకున్న

నటి రాధికా ఆప్టే అందాల ఆరబోతకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిపోయి, దేశవ్యాప్తంగా భారీ గుర్తింపు తెచ్చుకుంది. హిందీతో పాటు తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో నటిస్తూ దూసుకుపోతుంది. నటన, గ్లామర్ రెండింటిలోనూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సంపాదించుకున్న రాధికా.. ఇప్పుడు తల్లి అయినప్పటికీ కెరీర్‌లో ఏమాత్రం బ్రేక్ తీసుకోకుండా ముందుకు సాగుతోంది. ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ వరుస ప్రాజెక్ట్‌స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఇటీవల విడుదలైన 'సాలీ మోహబత్' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించిన రాధికా.. తన పర్ఫార్మెన్స్‌కు మంచి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం ఆమె కెరీర్ పూర్తిగా పీక్ ఫేజ్‌లో కొనసాగుతోందని చెప్పాలి. ఇక సినిమాలతో పాటు పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ, తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తోంది.



## దృశ్యం 3 రిలీజ్ ఆరోజే..

సినీ ప్రియులను థ్రిల్ చేసిన ఫ్రాంచైజీల్లో 'దృశ్యం' ఒకటి. ఈ సిరీస్‌లో భాగంగా రూపొందుతున్న మూడో సినిమా 'దృశ్యం 3' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఏప్రిల్ 2న ఈ మూవీని రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం సోషల్ మీడియాలో ప్రకటించింది. ఈ మేరకు పంచుకున్న స్పెషల్ వీడియో ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే పూర్తయిన సంగతి తెలిసిందే. మోహన్‌లాల్ హీరోగా జీతూ జోసెఫ్ తెరకెక్కిస్తున్నారు.

అనుకోకుండా హత్య జరగడం, దాన్నుంచి బయటపడేందుకు ఓ కుటుంబం చేసే ప్రయత్నాలే ఈ సినిమాల కథాంశాలు. మలయాళంలో రూపొందిన ఈ హిట్ ఫ్రాంచైజీ తర్వాత తెలుగు, తమిళం, హిందీ లోనూ రీమేక్ అయిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్ నటిస్తున్న 'దృశ్యం 3' అక్టోబరు 2న విడుదల కానుంది. వేరే కథతో హిందీ 'దృశ్యం 3' రూపొందుతుందన్న ప్రచారాన్ని జీతూ జోసెఫ్ ఇటీవల ఖండించారు. తెలుగులో 'దృశ్యం', 'దృశ్యం 2'లో వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే.



## జూమ్‌కాల్‌లో అనసూయ కన్నీటి పర్యంతం



మనమంతా మనుషులమేనని, ఒక మనిషిగా భావోద్వేగానికి లోనవ్వడంలో తనకెలాంటి సిగ్గూ లేదని సినీ నటి, యాంకర్ అనసూయ అన్నారు. తాజాగా జరిగిన జూమ్ ప్రెస్‌మీట్‌లో ఆమె భావోద్వేగానికి గురయ్యారు. దీనిపై ఇన్‌స్టా వేదికగా ఆమె వివరణ ఇచ్చారు. ''నిన్న జూమ్ కాల్ ద్వారా ప్రెస్‌మీట్‌లో మాట్లాడాను. ఆ సమయంలో నాకు లభించిన మద్దతు నన్నెంతో భావోద్వేగానికి గురి చేసింది. అదే సమయంలో కొంతకాలంగా నేను అనారోగ్యంతో ఉండటంతో, ఆ బలహీన క్షణంలో కన్నీళ్లు ఆగలేదు. నేను పూర్తిగా బాగున్నా. మన స్వయం నిర్ణయాధికారానికి మద్దతుగా మాట్లాడినందుకు ఇలాంటి భయంకరమైన పరిస్థితులను ఎదుర్కోవడం నిజంగా బాధాకరం. అయితే, నా వెనుక నిలబడ్డ అద్భుతమైన, బలమైన మహిళల వల్ల నాకు అపారమైన ధైర్యం లభిస్తోంది''

## నేను రూ.400 బట్టలు వేసుకుంటాను

**బుల్లితెర ప్రేక్షకులకు శ్రీసత్య ప్రత్యేక పరిచయం అవసరం లేదు. 'ముద్దమందారం' 'త్రినయని', 'నిన్నే పెళ్లాడతా' వంటి హిట్ సీరియల్స్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ చిన్నది ఆ తర్వాత బిగ్ బాస్ తెలుగు సీజన్ 6 ద్వారా మరింత పాపులారిటీ సంపాదించింది. ప్రస్తుతం టీవీ షోలు, ఈవెంట్స్, డాన్స్ ప్రోగ్రామ్‌లతో బిజీగా ఉన్నది.**

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.